ఏప్రిల్ 01-15, 2023

సంపుటి 03, సంచిక 12

తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక



భారత రాజ్యాంగ నిర్మాత,
బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఆర్థిక వేత్త,

## డా॥ బి.ఆర్. అంబేద్కర్

జయంతి 14-4-1891



తెలంగాణ వైతాళికులు

ఒద్దిరాజు సీతారామచంద్రరావు
జయంతి : 2-4-1887

ఒద్దిరాజు రాఘవ రంగారావు
జయంతి : 4-4-1894

*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **TELANGANA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 4th Floor, Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

# విషయ సూచిక




04 తన జీవితం పోరాటాల చిత్రం అని చెబుతున్న **డా॥ కట్టా నరసింహారెడ్డి** కవిత **"నిరీహా జీవితం"**



11 మానవ సంబంధాలను తడుముతున్న జ్ఞాపకాల కథ... **వాసవదత్త రమణ "బంధపు తడి"**



27 నా నుండి మన ఆలోచనలకు బీజం వేసే **సంపత్** కథల పైన **దాస్యం సేనాధిపతి** విశ్లేషణ



05 స్త్రీ వ్యక్తిత్వానికి రెండవ కోణం ఆవిష్కరించిన **చిన్నా** 'నాటి కథ'... **"వర్షం కురిసిన రాత్రి"**



14 కళ్ళ శాశ్వతత్వం అక్షరాలుగా చేర్చిన **హనీష్** కవిత... **"నీ తదనంతరం"**



31 అబద్ధాల ప్రపంచం గురించిన ఆవేదన **ఎలనాగ** కథ... **"విద్యుత్ శ్మశానవాటిక"**



07 కొత్త రుచులు ఊరించే కథనంతో కొనసాగే మోహన్ కథలకు **కూర చిదంబరం** వ్యాస రూపావిష్కరణ **"ముగ్ధ మోహనమీ కథలు"**

37 కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత, కీర్తిపురస్కార గ్రహీత **పసునూరి రవీందర్**తో **చందు తులసి** ఈ పక్షం ముచ్చట..

బాల్యం తీపిని నెమరువేసుకునే **కొరుప్రోలు హరనాథ్** కవిత **"బాల్యం"** ...పేజీ 10

స్త్రీ వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించిన **ప్రణవి** కవిత **"ఆమె"** ...పేజీ 46

పౌరుషలేని పుణ్య పురుషుల్ని ప్రశ్నిస్తున్న **కరిపె రాజకుమార్** కవిత గజ **"ఈతగాళ్లు"** ...పేజీ 43

హృదయం లేని నగరంతో నలిగిన ఒక పల్లెటూరి యువకుడి కథ **వేణు నక్షత్రం** **"వసుంధర"** ...పేజీ 17

సీనియర్ కవి కె. ప్రభాకర్ గురించి **రజా హుస్సేన్** స్మర్శ **"కాఫీ విత్ కె. ప్రభాకర్ పొయెట్రీ..."** ...పేజీ 15

గుండుకు గుండె చూపిన సుభాష్ చంద్రబోస్‌ని ఆవహించి తనలోకి పిలుస్తున్న **భానుప్రకాష్** కవిత **"ఆవహించు"**..పేజీ 36

సాహిత్యతారలను పరిచయం చేస్తున్న **సాగర్ల సత్తయ్య** వ్యాసం **"విశిష్ట మహిళా సాహితీమూర్తులు"** ...పేజీ 41

**ఇంకా...** మరెన్నో కవితలు, సాహితీ శిఖరం, సమాజం, పుస్తక పరిచయం, స్వీకారం.. మొదలైనవి...

నాటి కవిత



శ్రీశ్రీ

# కోల్పడిన ప్రేమకు

కనులు విచ్చి నీదుసమాధి కాంచలేను
అట గులాబి తీయని దెంతయైన నేమి !
నా అడుగులంట పర్వు శూన్యతను కడుగు
పెనుతరంగాల మ్రోతల వినుటె చాలు !

ఊరట వహింతునా ? మహాదూరమున వ
సింతువేమొ జీవాత్మవై, ఎదొ అగాధ
నీరవత ఆవరించగా తారకలకు
చుట్టు నెలకొను నిశ్శబ్ద మట్టిది నిను.

తలిని నీ వైతివి ! ద్యోతలాన
నివసనముందువు నీయంత నీవె, అచటి
అమితమరిమంతమైన నీహాయిలోన
పరివ్యాప్త విస్మృతవ్యాదున్న త్తభావమెల్ల.

కాని యైన నాకొక్కవేళ కాంచెదీవు
కడచు నొక్కనిశ్వాసమ్ము, గాఢబాధ ;
చకితవాడు తెరువంబడి స్వర్గమందు
ద్వారమొకడు వెన్వెంట మూతపడినట్లు.

కాన తావకీనసమాధి కాంచలేను
అట గులాబి తీయని దెంతయైన కాని,
నాఅడుగులంట పర్వు శూన్యతను కడుగు
పెనుతరంగాల మ్రోతలే వినగవలతు.

—స్టీఫెన్ ఫిల్లిప్సు గీతముల కనువాదము.

*సేకరణ : బంగారు రామాచారి*

సంపాదకీయం

తంగేడు

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

01-15 ఏప్రిల్, 2023

సంపుటి 03 సంచిక 12



శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్



డా॥ కాంచనపల్లి గోవర్ధన్ రాజు
అసోసియేట్ ఎడిటర్
9676096614

ఎడిటోరియల్ బోర్డ్ :
ఘనపురం దేవేందర్
రంగు నవీనాచారి

# పుస్తకం కొని చదవాలి

ఇటీవల తెలుగు సాహిత్యంలో పుస్తక ప్రచురణ చాలా పెరిగిపోయింది. సృజనకారుడు విచిత్రమైన దశలో ఉన్నట్టు తోస్తున్నది. సృజనకారుడు మొట్టమొదట తను రాసిన కవితను పత్రికలలో అచ్చు అయ్యేటట్లు చూసుకోవాలి. అది జరగకపోతే సోషల్ మీడియా ఉండనే ఉంది. అక్కడ నుండి 20 కవితలు కనీసం 15 అయినా అచ్చయితే అందులో ఇంకొక 15 కలిపితే ప్రచురణకు సిద్ధం. ఇక ముందుమాట రాయడంలో సిద్ధహస్తులు ఎలాగూ ఉన్నారు. వాళ్ల చుట్టూ తిరిగి తిరిగి ముందుమాట రాయించుకోవాలి. ఈ విధంగా నానా ఇబ్బందులు పడి ఒక సంపుటి బయటకు తీస్తే ఒక ఆవిష్కరణ సభ ఏర్పాటు చేసుకోవాలి. వచ్చేవాళ్లు ఏదో కవితాప్రతిభ కలవారు అయితే చాలదు. గొప్ప వాగ్మి అయితే సరిపోదు. వాళ్లతో సదరు రచయితకు ప్రయోజనం కూడా నెరవేరాలి. సభ ఏర్పాటు చేసి తను వేసిన పుస్తకాలు వాయనాలుగా పంచాలి. ఒకవేళ పుస్తకం తీసుకోవడం మిస్ అయితే సాహిత్య అభిమానులు చాలా చాలా గుర్తుచేస్తారు. మీ సంపుటి మాకు ఇవ్వలేదు ఏమిటి? అని అడుగుతారు. పుస్తకాలు ఇట్లా సాధ్యమైనంత పంచి, పుస్తకాల షాప్‌కి వెళితే మేం కవితా సంపుటాలు తీసుకోవడం లేదు అని చెప్తారు. లేక ఆ పబ్లిషర్ మాకు పంపిస్తాడు లెండి అనే మాటలు చెబుతారు. అమ్ముడైతే వాళ్లకు సగం కమిషన్ ఇవ్వాల్సిందే.

ఇప్పటికీ ఇంగ్లీషు సాహిత్యంలో రచనల మీదే జీవిస్తున్నవారు ఉన్నారు. మన పక్క రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటకలలో పుస్తకాలు కొని చదవడం ఒక సాధారణ అంశం. ఇక్కడ సృజనకారుల పరిస్థితి ఇంత దైన్యంలో కూరుకుపోవడానికి కారణం ఏమిటి? ఒక పుస్తకం వేయడానికి అంతా కలిపి 50 వేల వరకు ఖర్చు పెట్టుకుని సాధించేదేమిటి? అనే నిరాశ ఆవహించే సందర్భాలు అనేకం ఉంటాయి.

ఇంత సామాజిక సంచయానికి మూలమైన సృజనకారునికి జరిపించవలసిన సన్మానం ఇదేనా? దీనికి ప్రధాన కారణం ఏమిటి? పుస్తకం కొని చదివే సంస్కారము, జిజ్ఞాస లేని మన పాఠకులని ఏమనాలి? పోనీ ఉచితంగా ఇచ్చినా ఎంతమంది చదువుతున్నారు? అది కూడా అనుమానమే.

దీనికి కారణం సృజన మీద ఉండవలసిన గౌరవం లేకపోవడమే. ఈ భావమే పుస్తకావిష్కరణ సభలని ఒక ప్రహసనంగా మారుస్తున్నాయి.

ఒక కోటి రూపాయలు మీకు దొరికితే మీరేం చేస్తారు అని అడిగితే ఒక గ్రంథాలయాన్ని కట్టిస్తా అంటాడు మహాత్మాగాంధీ. "ఇంకే స్వేచ్ఛ నాకు వద్దు జైలులో పుస్తక పఠనానికి అనుమతి కావాలని" కోరుతాడు నెల్సన్ మండేలా. "తుపాకి కంటే పుస్తకమే గొప్ప ఆయుధం" అంటాడు లెనిన్. చార్లీ చాప్లిన్ ఒక్కోచిత్రం నటించాక తనకు వచ్చిన పారితోషికాల్లో మొదటి వంద డాలర్లు పుస్తకాలే కొనేవాడట. కాబట్టి పుస్తకాన్ని గురించి మేధావి వర్గం ఇంత చెప్తున్నా తెలుగు పాఠకులు లేక సృజనకారులు కూడా పట్టించుకోరు. పుస్తక ప్రాధాన్యం గురించి చెప్పమంటే బ్రహ్మాండంగా ఉపన్యాసం చేస్తారు. కాగా వెలువడుతున్న అన్ని పుస్తకాలు కొనడం ఎవరికీ సాధ్యం కాకపోవచ్చు. కనీసం మంచి పుస్తకం, తనకు నచ్చిన పుస్తకం అయినా కొనే హాబీని విద్యావంతులు పెంచుకోవాలి. కవులు కూడా సభలో కూర్చున్న ప్రతి వ్యక్తికి ఉచితంగా పుస్తకాలు ఇవ్వడం ఏమంత మంచి సంప్రదాయం కాదు. చాలామందికి ఉచితాల మీద గౌరవం ఉండదు. సృజనల ఉత్తిష్ఠ స్థాయి పాఠకునిచే కొనిపిస్తుంది చదివిపిస్తుంది. తెలుగు సాహిత్యానికి అందునా కవిత్వానికి తక్కువ మంది పాఠకులు ఉన్నారనేది ఒక కాదనలేని సత్యం. ఆ తక్కువ మందిలోనైనా కొనాలనే అభిరుచి అవశ్యం రావాలి.

నిజానికి పాఠకుడు రచయిత పరస్పర ఆశ్రితులు. ఎవరు ఎవరి పట్ల శూన్య భావంతో ఉన్నా సృజన సంగమం ఫలవంతం కాజాలదు చదవడం అలవాటైన వ్యక్తికి అందులో ఎంత గొప్పదనం ఉందో తెలుస్తుంది. ఏ ఆడంబరం లేకపోయినా విద్యావంతుడు గౌరవించబడడం మనం అనేక సందర్భాలలో చూస్తున్నాం. తినడం తొంగోడం కాదు జీవితం అంటే కళాపోసన ఉండాలి అని ఎవరో సినిమా రచయిత అన్నట్టుగా జీవితం సారవంతం కావాలంటే పుస్తకం లాంటి ఉపకరణం ఆవశ్యం. తెలుగు సాహిత్యంలో ఉత్తమ అభిరుచి కలిగిన పాఠకులు, వాళ్లను మెప్పించే రచయితలు విస్తరించాలని ఈ రంగం మరింత సంపన్నం కావాలని ఆశిద్దాం.

*జై జాగృతి! జై తెలంగాణ!!*

# నిరీహా జీవితం



- డాక్టర్ కట్టా నరసింహా రెడ్డి



నా జీవితం ఇతరులు తీసిన
ఛాయాచిత్రం కాదు
ఎవరో గీసిన ఫోటోస్కెచ్ కాదు
ఏ రాయితో చెక్కబడ్డ శిధిల శిల్పం కాదు

అది గమ్యం వైపు చూపు నిలిపి
శిఖరం వైపు సాగుతున్న
నా రథచక్రాల రాపిడిలో
రాలిన అగ్ని కణాలను ఒడిసిపట్టి
జడత్వాన్ని మండించిన
తిరుగబడే స్వరాల చిరునామా

విరజిమ్ముతున్న చైతన్య దీపాల వెలుగులో
నా చుట్టూ పరుచబడ్డ ప్రలోభాల నీడల చేదనలో
అలసి సొలసి జడలా బిగుసుకున్న
ఏకాంతాలను చీల్చుతున్న
భగభగ మండే అగ్నిచైతన్యం

నా జీవితం ఏడు దశాబ్దాల
నిద్రా మార్మికం కాదు
అది అధ్యాపకవృత్తిలో
నిశితశోధనే సాధనగా
జీవిత స్థాయిని పెంచుకొని
సంక్షోభ సమయాల్లో గాట్లు పడ్డ గాయాలకు
లేపనాలను అద్దుకుంటూ
ఓడిపోతూ గెలుస్తూ పడిపోకుండా
పోరాటాలతో నేర్చుకున్న పాఠాలతో
గెలుపు వొడిలో సేదతీరుతూ
జ్ఞాపకాల ప్రవాహంలో
అహం కొమ్ములను విరుచుకొని
కత్తులు దూసుకుంటున్న వ్యవస్థలో
నన్ను నేను ఆవిష్కరించుకున్న
నిరీహ జీవిత పోరాటాల చిత్రం

నాటి కథ

# వర్షం కురిసిన రాత్రి

మరొక స్త్రీ దీనత్వాన్ని పట్టించుకోలేని ఒక స్త్రీ...

చిన్నా
86852 39804

**రచయిత గురించి...**

*చిన్నా అనే వాడుకనామం గల రచయిత పెదకోట్ల చిన్నయ్య. 10 అక్టోబర్, 1965న ఉమ్మడి నల్లగొండ జిల్లా భువనగిరిలో జన్మించారు. 1974 సంవత్సరం నుండి వీరు రచనలు గావిస్తున్నారు. వీరు ప్రస్తుతం నల్గొండలో నివసిస్తున్నారు.*

"అమ్మా" కేక వేసి కుప్పలా కూలిపోయాను. నా పొట్టలో కత్తి గుచ్చుకొని ఉంది. ఉలిక్కిపడి లేచాను.

కల... పీడ కల... గోడ గడియారం పంద్రెండు గంటలు కొట్టింది మామూలుగా. లేచి లైట్ వేశాను.

నా గుండెలో ఒక విధమైన వణుకు మొదలైంది. శరీరమంతా వణకసాగింది. ఒళ్ళంతా చెమట. మంచినీళ్ళు త్రాగి సోఫాలో కూలబడ్డాను. గుండె నొప్పి కొంచెం తగ్గినట్టు అయింది.

అప్రయత్నంగా మరో మంచంపై పడుకున్న నా శ్రీమతి వైపు చూశాను. హాయిగా నిద్రపోతోంది. అదృష్టవంతురాలు. నాకు భయం వేసింది.

చిన్నప్పుడు వీధిబడికి వెళ్ళేటప్పుడు నామాల పంతులుకు భయపడేవాణ్ణి!

పెళ్ళయినప్పటినుంచి ఈ దెయ్యానికి (సారీ! ధర్మపత్నికి) భయపడ్తూనే ఉన్నాను! టేబిల్‌పై ఉన్న సిగరెట్ పాకెట్‌లోంచి ఒక సిగరేట్ తీసి వెలిగించాను. సిగరెట్ కాలుతున్నది! కాలుతున్న సిగరెట్లా నాగుండె మండుతున్నది. సిగరెట్ పొగలా నా మెదడులో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయ్! కిటికీ వద్దకు వెళ్ళాను. ఆకాశంవేపు చూశాను. ఆకాశం అంతా మేఘావృతమై న్యాయానికి వేయబోయే ముసుగులా నల్లగా ఉంది.

ఎక్కడో మెరుపు!

"వానవచ్చేట్టుంది" అనుకున్నాను.

ఇంతలో-

ఫెళఫెళ ఉరుములు. మెరుపులు!

కిటికీ మూసేసి, మళ్ళీ సోపాలో కూలబడ్డాను.

"ఢాం!"

ఎక్కడో పిడుగు పడింది.

నా గుండె వెయ్యి మైళ్ళ స్పీడుతో కొట్టుకోసాగింది.

వర్షం కుండపోతగా కురవసాగింది.

తలుపు దబ్... దబ్... దబ్... బాదిన చప్పుడు.

గాలికి చప్పుడౌతుందేమోనని ఊరుకున్నాను. కాని, తలుపు చప్పుడుతోపాటు మాటలు వినిపించాయి.

"బాబుగోరూ! తలుపు తీయండి... తలుపు తీయండి".

గబగబా వెళ్ళి తలుపుతీశాను.

ఎదురుగా పాతికేళ్ళ స్త్రీమూర్తి... ఆమె కట్టుకున్న చీర ఆమె అవయవాల్ని పూర్తిగా దాచలేకపోతున్నది.

ఆమె చంకలో దాదాపు మూడేళ్ళ కుర్రవాడు. కుర్రవాని ఒంటిపై ఒక్క నూలుపోగు కూడా లేదు.

పిచ్చిగా ఆమె కళ్ళలోకి చూస్తున్నాడు. ఇద్దరూ బాగా తడిసి ఉన్నారు.

"ఢాం"

మళ్ళీ ఎక్కడో పిడుగు పడింది.

నా గుండె స్పీడు మళ్ళీ ఎక్కువైంది.

"అమ్మా" అని కేక వేసి, తన తల్లిని వాటేసుకున్నాడు ఆ కుర్రవాడు.

"బాబూ!" తల నిమిరింది.

ఐదు నిమిషాల్నుంచి అచేతనునిగా నిలబడ్డ నాలో చేతనత్వం ప్రవేశించింది కాబోలు.

"లోపలికి రామ్మా!..." అన్నాను ఏమనాలో తోచక. ఆమె భయపడ్తూ లోనికి అడుగుపెట్టింది. పిచ్చిగా దిక్కులు చూసింది. నడిరోడ్డుపై నిలబడి దారులు వెదికేవాడిలా.

"బయటికి వెళ్ళు విన్పించింది..." సింహగర్జన విన్పించింది.

వెనుదిరిగి చూశాను.

నా శ్రీమతి లేచి, నిలబడి ఉంది. ఆమె కళ్ళలోంచి నిప్పులు రాల్తున్నాయ్. ముఖం కోపంలో ఎర్రబడి ఉంది.

"నీకే చెప్పేది! బయటికి వెళ్ళు..."

నాటి కథ



"అమ్మగోరూ!... ఈ ఒక్కరాత్రికి ఉండనీయమ్మా! నాకోసం కాదమ్మా! బాబు కోసం! వానకు వణుకుతు న్నాడమ్మా?... నీ కాళ్ళు పట్టుకుంటా నమ్మా! చచ్చి నీ కడుపున పుడతా..." ఆమె కళ్ళల్లోంచి కన్నీళ్ళు ఏకధారగా వస్తున్నాయ్.

"బయటికి వెళ్తావా? లేదా? నువ్వెందుకు వెళ్తావే! ఊం... ఊం..."

"అమ్మగోరూ! తమరు ఈ రేత్రి మీ ఇంట్లో ఉండనీయకపోయినా ఫరవాలే దమ్మా? నన్నలా అనొద్దు. చావనైనా చస్తాం గాని నీ మాటలు వినలేను. నీ కొక దణ్ణం తల్లీ!..." అని బాబుతో సహా జోరుగా కురుస్తున్న వర్షంలోకి పరుగెత్తింది. దూసుకుపోయే రాకెట్‌లా...

ఆమె వెళ్ళినవేపు చూస్తూ నిలబడ్డాను.

"ఏమిటీ!!! మీరు బెల్లం కొట్టిన రాయిలా నిలబడి చూస్తున్నారు?... దానికి మీకు ఎన్నాళ్ళనుంచి సాగుతోంది. ఏమిటలా చూస్తున్నారు? మీ రహస్యం బైట పడిందనా?... ఐనా మిమ్మల్నే మనాలి?... మిమ్మల్ని నా కంటగట్టిన మా నాన్నగారినానాలి!... అయ్యో రాత!..." మొసలి కన్నీరు కారుస్తూ... సోఫాలో కూలబడింది. నేను ఓదార్చాలనేమో, మధ్యమధ్య తలెత్తి నా వంక చూస్తోంది. ఐనా నేను నా శ్రీమతి వద్దకు వెళ్ళలేదు.

నా కళ్ళలో ఇంకా ఐదు నిమిషాల క్రితం జరిగిన సంఘటన స్త్రీ, కుర్రవాడు మెదులుతున్నారు. నిలవటానికి నీడలేని.. తింటానికి తిండి లేని.. నిరుపేదలు మనదేశంలో కోకొల్లలు.

గాంధీ, నెహ్రూలు ఆశించిన రామ రాజ్యంగా మన దేశం ఎన్నడు రూపొందుతుంది?... ఈ వానలో ఆ స్త్రీని అలా వెళ్ళగొట్టినందుకు నా మనసెందుకో ఆక్రోశించింది.

కానీ నేను అశక్తుణ్ణి, బలహీనుణ్ణి, ధనహీనుణ్ణి ఈ యింటిలోని ప్రతి వస్తువు, అణువు మా ఆవిడ సొత్తే.

ఆలోచనలతో నాలుక వేడెక్కసాగింది. నా గుండెలో రైళ్ళు పరుగెత్తసాగాయి. శరీరం స్వాధీనం తప్పిపోసాగింది. మా శ్రీమతి యింకా వాగుతూనే ఉంది. మెల్లగా అడుగులో అడుగు వేస్తూ, మంచం దగ్గరికి వెళ్ళి దానిలో కూలబడ్డాను.

ఇంకా వర్షం కురుస్తూనే ఉంది. ఉరుములు! మెరుపులు! నా గుండెల్లో మంటలు! మంటలు!

* * *

తెల్లవారింది.

బాలభానుని బంగారు కిరణాలు జగమంతా పరుచుకుంటున్నాయ్. పనికుర్రవాడు రాములు నా క్కాఫీ అందిస్తూ...

"బాబుగారూ! మన వీధి చివరి చెట్టుక్రింద ఉండే బిచ్చగత్తె కొడుకు చచ్చిపోయాడండి... పాపం, రాత్రి వానకు తడిసినట్టున్నాడు. ఏమిటాలోచిస్తున్నారు బాబుగారూ! కాఫీ త్రాగండి! ప్రొద్దున్నే చావు కబురు చల్లగా చెప్పాడు. ఏమిటో! నా నోరు మంచిదికాదండి!" అన్నాడు.

నా కెందుకో కాఫీ త్రాగాలన్పించలేదు.

"రాములూ! ఆ చెట్టు దగ్గిరికి పోదాం పద" అన్నాను ఏదో ఆలోచిస్తూ.

రాములు నా వంక అయోమయంగా చూశాడు ఏమి అర్థంకానట్టు. రాములు సహాయంతో చెట్టు దగ్గిరికి వెళ్ళాను. నా నెత్తి మీద పిడుగుపడ్డట్టయింది.

భగవాన్! రాత్రి మా యింటికి వచ్చిన స్త్రీమూర్తి కొడుకు చచ్చిపోయాడు.

నా శ్రీమతి ఆమెను వెళ్ళగొట్టకపోతే, కుర్రవాడు బ్రతికి వుండేవాడేమో!

ఆమె తనకొడుకు శవం పైపడి ఏడుస్తూనే వుంది. ఆమె కళ్ళలోంచి కన్నీళ్ళు కుండపోతగా వస్తున్నాయ్.

ఆ దృశ్యం చూడలేకపోయాను. అప్రయత్నంగా నా చేయి చొక్కా జేబులోకి వెళ్ళింది. రెండు రూపాయల నోటు తీసి... ఆమె కివ్వమని రాములు కిచ్చాను. ఎన్నికల్లో ఓడిపోయిన రాజకీయ నాయకునిలా తలొంచుకొని బరువైన గుండెలతో మా యింటివేపు అడుగువేశాను.

**పెళ్ళయినప్పటి నుంచి ఈ దెయ్యానికి (సారీ! ధర్మపత్నికి) భయపడ్తూనే ఉన్నాను! టేబిల్‌పై ఉన్న సిగరెట్ పాకెట్‌లోంచి ఒక సిగిరేట్ తీసి వెలిగించాను. సిగిరెట్ కాలుతున్నది! కాలుతున్న సిగిరెట్లా నాగుండె మండు తున్నది. సిగరెట్ పొగలా నా మెదడులో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయ్! కిటికీ వద్దకు వెళ్ళాను. ఆకాశంవేపు చూశాను. ఆకాశం అంతా మేఘా వృతమై న్యాయానికి వేయబోయే ముసుగులా నల్లగా ఉంది.**

*(ప్రగతి సచిత్ర వారపత్రిక, 10 మే, 1974 సంచికలో ప్రచురింపబడింది.)*

వ్యాసం

# ముగ్ధ మోహనమీ కథలు

సొగసు కథల మీద గడుసు వ్యాసం...




కూర చిదంబరం
86393 38675


సాహిత్య ప్రక్రియలన్నింటిలో కెల్లా, కథాప్రక్రియ బహు ప్రాచీనము మరియు ప్రాచుర్యము గాంచినది. నిన్నటి తరానికి 'కథలు' అనగానే ఆరుబయట వెన్నెల రాత్రుళ్ళలో నానమ్మలు లేదా అమ్మమ్మలు "అనగనగా...." అంటూ రాజకుమారుడు వేటకు వెళ్ళటం, అడవిలో ఓ చక్కని రాజకుమారి రాక్షసుడి బారినపడి గుహలో బంధించబడటం, వీరోచితంగా రాజకుమారుడు రాక్షసునితో పోరాడి, సంహరించి రాజకుమారిని పెళ్ళాడటంతో కథ కంచికి వెళ్ళేది.

తర్వాతి కాలంలో కాశీమజిలీ కథలు, అరేబియన్ నైట్సు కథలు, సాహసి సింధ్ కథలు పుస్తకాల రూపంలో వచ్చి పఠితులను అలరించేవి.

దిన, వార, మాస పత్రికలు వచ్చి కథల ప్రాముఖ్యత పెరిగింది. జీవన వ్యాపారం ఉరుకుల పరుగుల మయం అయ్యాక నేటి పాఠకులు కథల పైనే మక్కువ చూపుతున్నారు. వీలు దొరికిన 15-20 నిమిషాల్లో చదవటం ముగించ గలగటం కథాసాహిత్యం చేకూర్చగలిగే సౌకర్యం.

'సాహిత్యం యొక్క ప్రయోజనం పాఠకుడిని సంస్కారవంతుడిగా చేయటం' అంటారు గురజాడ. సాహిత్యంలో భాగమైన కథలు ఆలోచనలని పెంచుతాయి. మంచితనం వేపు నడిపించి సంస్కారవంతుల్ని చేస్తాయి. సమాజాన్ని పురోగతి వేపు తీసుకువెళ్ళుతాయి. కథ జీవితమంత గొప్పది. జీవితమంత విలువైనది. అందమైనది. సాగరమంత విస్తృతమైనది సమాజమంత విశాలమైనది. కథల్లో జీవితం ప్రతిబింబించటం వల్ల పాఠకుడు మమేకమౌతాడు తాదాత్మ్యత చెందగలుగుతాడు. ఈ సౌకర్యం వల్ల కావొచ్చు. నేటి రచయితలు కథలు రాయటానికే మొగ్గుచూపుతున్నారు. కథా రచనలో సంక్షిప్తత క్లుప్తత ఉంటుంది. అనవసర సాగదీతలకు ఆస్కారం ఉండదు.




నేటి కథకుల భావప్రపంచం ఎల్ల లెరుగక విశాలమై వికసిస్తున్నది. మంచి కథలు రాస్తున్నారు. కథల రాసి, వాసి పెరుగుతున్నది. పత్రికలు సాహిత్య సంస్థలు పోటీలు నిర్వహించి మంచి కథలను అందిస్తున్నారు. కంప్యూట రీకరణ, ముద్రణ సౌలభ్యం వల్ల పలు ఔత్సాహిక కథకులు నేరుగా పాఠకులకు తమ కథల్ని అందిస్తున్నారు. లోగడ ప్రచురించబడిన తమ కథలను సంపుటాల రూపంలో తెచ్చి సాహిత్య చరిత్రలో నిలిచిపోతున్నారు.

కవిత్వం అంటే ప్రాణం పెడుతూ, కథలంటే మక్కువ చూపుతూ, కవిత్వం, ఒక చేత, కథాసృష్టి మరో చేత సంధిస్తూ, 'సవ్యసాచి' అనిపించుకుం టున్నారు వర్ధమాన రచయిత దాసరి మోహన్. లోగడ 'దండెం' మరియు 'అల్మారా' కవితల సంపుటాల వెలయించి తన సాహిత్యాభిమానము చాటుకోవటమే కాదు, నందిని సిధారెడ్డి, అమ్మంగి వేణుగోపాల్, వఝల శివకుమార్ వంటి ప్రముఖుల ప్రశంసలందుకున్నారు. రసజ్ఞుల హృదయాలను గెలుచుకుని ఇప్పుడు 'రాళ్ళకుచ్చె' కథా సంపుటిని మన ముందుకు తీసుకు వస్తున్నారు. ఇందులో 17 కథలున్నాయి. వీటిలో కొన్ని తెలుగు వెలుగు, నమస్తే తెలంగాణ, నెలవంక, నెమలీక వంటి ప్రముఖ పత్రికలలో,

వ్యాసం

అంతర్జాల పత్రికలలో ప్రచురితమై పాఠకాదరణ పొందాయి.

సాహిత్య సృజనకు భావుకత మూలవస్తువు. కవుల్లో ఈ భావుకత ప్రత్యేకంగా భాసిస్తుంది. మొదట కవిగా ప్రకటితమైన మోహన్ తన భావుకతను, సృజనాత్మక పటిమను, కథాకేదారాల వేపు మళ్ళించారు. తాత్త్వికత భావుకత రెండూ అందంగా అనుసంధానించబడి, పాలూ మీగడలా కలిసిపోయి, భాసిల్లుతూ మనోల్లాసాన్ని కలిగిస్తున్నాయి. మేజిక్ రియలిజం, పౌరాణికంలాంటి ఊహాలోకాల్లో విహరించకుండా మనమధ్యే ఉన్న మధ్యతరగతి, జీవితాలను చిత్రికపట్టి మనోజ్ఞమైన కథా శిల్పాన్ని సృష్టిస్తున్నారు.

ఒక మంచి కథను చదివితే మనసు పులకిస్తుంది. షడ్రసోపేత భోజనం చేసినంత ఆనందం కలుగుతుంది. ఎన్నో జీవిత సత్యాలు ఆవిష్కరింపబడి పఠితకు, తద్వార సమాజానికి సత్సందేశ మిస్తూ మార్గ నిర్దేశనం చేస్తుంది. ప్రాపంచిక దృక్పథం ఉన్న ఈ కథలు మానసిక వికాసాన్ని పెంచుతాయి. మీ సంస్కారానికి ఆస్కారం కలిపిస్తాయి. జీవితంలోని సంక్లిష్టతలకు అద్దం పడతాయి. యథార్థ జీవితాల్లోని వ్యథలను, సంతోషాలను వెలుగు చీకట్లను తులనాత్మకంగా మన ముందుచుతాయి.

ఈ కథల్లోని పాత్రలు మనతో సంభాషిస్తాయి. మనలో ఒదిగిపోతాయి. కథాంశం మనం నిత్యజీవితంలో అనుభూతిస్తున్నట్లుగానే కనిపిస్తూ, తమలోని ప్రత్యేకతను చాటుకుంటాయి. తన కథల్లో తానుండటం, భావస్ఫోరకమైన వచనకవిత్వాన్ని బంగారంలో వజ్రాల్లా, పాయసంలో జీడిపలుకుల్లా పొదగటం మోహన్ ప్రత్యేకత. మనతో కలిసినడుస్తూనే విలక్షణమైన ఆలోచనలతో మన ముందు నిలుస్తారు. ప్రాపంచిక వస్తువును కవితాత్మకం చేస్తారు. 'నాకేం తెలుసు' అంటూ అమాయకంగా ప్రశ్నిస్తూనే, దైవం ఏంచేయదలచుకున్నాడో చెబుతారు. ఎంతటి కష్టతరమైనా, అనూహ్యమైనా, జీవితాన్ని కొనసాగించవలసిందే... అన్న తాత్త్వికతను మనలో నింపుతారు.

తన చుట్టూ ఉన్న మనుష్యుల్ని, చెట్టూ చేమల్ని, రాయీ, రప్పనూ, బాల్యస్మృతులను, నైసర్గిక పరిస్థితుల్ని అధ్యయనం చేస్తూ, కవిత్వాన్నీ కథనీ కలిపి, కథ, కథనం, ఎత్తుగడ, ముగింపు అన్నింటినీ సమపాళ్ళలో రంగరించి రంగవల్లులద్దిన కథలివి. పద పటాటోపం, అనవసర వర్ణనల జోలికిపోకుండా నేరుగా మన హృదయాల్లో నాటుకుపోతాయి. స్థాలీపులాక న్యాయంగా.... ఈ కథల్లోని కొన్ని ప్రత్యేకతలు.

విజయసాధనకు మానవ ప్రయత్నంతో బాటు దైవసంకల్పం ఉండితీరాలి. వరుస విజయాలకు కళ్ళు నెత్తి కెక్కిన్నాడు దైవం ఎలా శిక్షిస్తాడో చెప్పేదే 'నాకేం తెలుసు...' కథ. పనులన్నీ పక్కన పెట్టి నీ ముంగిట వాలాను అని 'ఆయన' సంతోషించినా, ఆయనకు తెలియదు మూలమలుపు దగ్గరే ముక్తి లభిస్తుందని. ఎదురుగా వచ్చిన సుమో ఢీ కొంది. చివరి చూపూ దక్కలేదు. దైవం వేసే శిక్షకు ఏ అప్పీలు ఉండదని ఈ కథ చెబుతుంది.

జీవితం అంతే కష్టాలు, నష్టాలు. కొండొకచో మిష్టరీలు. రమేష్, ఉమలు పరస్పరం అభిమానించుకునే స్నేహితులు. ఊహించని ఓ దురదృష్ట ఘడియలో వారు పయనిస్తున్న కారు ప్రమాదానికి గురియై ఇద్దరూ మరణిస్తారు. ఇద్దరి కుటుంబాలు ఎలా తోడు నీడ లేక అల్లాడాయో... రమేష్ భార్య లక్ష్మి, పిల్లలు, ఉమ భర్త కిరణ్ వారి పిల్లలు పరస్పరాశ్రితులై ఎలా దగ్గరవుతారో 'జీవితం కొనసాగించాల్సిందే.....' కథ చెబుతుంది. అవును పోయేవారి వెంటే ఎవరమూ పోలేము. మిగిలినవారి జీవితాలు కొనసాగాల్సిందే! పై రెండు కథల్లో తాత్త్వికత ఉంది. నిమిత్త మాత్రమే ఉంది. నగ్నసత్యము ఉంది.

బాల్యం దాని తాలుకు జ్ఞాపకాలు అపురూపాలు. మళ్ళీ మళ్ళీ జ్ఞాపకం చేసుకుని మురిసిపోవల్సిన పెన్నిధులు. అన్నింటా 'అఛీవర్' అయిన ఈ ఛార్టర్డ్ అకౌంటెంట్ స్మృతులు ఆయన స్వగ్రామం చుట్టూ తిరుగుతూ ఉంటాయి. ఊరి పొలిమేరకు గుర్తుగా పెట్టిన రాళ్ళకుచ్చె చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటాయి. అంతటి ప్రముఖుడూ, తరచూ బాల్యంలోని చిన్న పిల్లాడై పోతూ ఉంటాడు. కథకుడితో పాటు ఆయన జ్ఞాపకాల సారథ్యంతో మననూ తీసుకెళ్తూ ఉంటాడు. 'ఈ సారి నిజంగానే...' అంటూ కథ ముగించేసరికి ఇంకా జ్ఞాపకాల తేరులో పయనిస్తున్న మనం తెల్లబోతాము. తేరుకోవటానికి నాలుగు క్షణాలు పడుతుంది. కరీంనగర్ యాస, భాషతో సాగిన ఈ కొసమెరుపు కథ సంకలనానికే హైలైట్ అనవచ్చును.

జన్మనిచ్చిన మాతృమూర్తి ఋణం ఎన్ని జన్మ లెత్తినా తీర్చుకోలేనిది. కళ్ళ డాక్టర్ అజయ్ ఐ కేంపు నిర్వహించి అందులో భాగంగా తల్లి కళ్ళు ఆపరేట్ చేసి తన సేవాతత్పరతను నిరూపించుకోవాలనుకుంటాడు. సహ (అ) ధర్మచారిణి రాధిక అందుకు సహకరించదు. 'అమ్మ సేవ' చేయాలనుకున్న అజయ్ కల కలగానే మిగిలిపోతుంది. అనుకున్నవన్నీ, అనుకున్నట్లు నెరవేరవు కద! తన ఇంట్లోనే సహకారం అందక "ఊహల్లో ఊయెలలూగే అజయ్ నిరాశావాదులకు 'చెంపచరుపు' లాంటిది ఈ కథ. కథను కథగానే ముగించిన ఈ కథలో రచయిత చివరన ఏదో సందేశం ఇవ్వడు. పాఠకుల ఊహనే వదిలి పెడతారు.

విందులు వేడుకలకు బహుమతులతో వచ్చే అతిథులకు రిటర్న్ ఇవ్వటం ఆనవాయితీ. మరణం అంచువరకు వెళ్ళి వచ్చిన ఆ వ్యక్తి హాస్పిటల్లో అందుకున్న సేవలకు సిబ్బందికి 'రిటర్న్ సేవాకార్యక్రమాలను చేయాలనుకోవటం రచయిత గొప్ప ఆలోచన. పాఠకునికి సత్సందేశం ఇచ్చే కథ.

పదినీతులు చెప్పటం కంటే ఒక మంచిపని చడీచప్పుడు లేకుండా చేయాలని చెప్పే 'గుంతలు' కథలో అధిక్షేప నిరసన' ప్రకటిస్తూ, సున్నితమైన హాస్యం, నర్మగర్భతకు కూడా 'తగునని'

వ్యాసం

నిరూపించుకున్నాడు మోహన్. కొసమెరుపు కథ చివరి వాక్యాలు రచయిత తన సామాజిక బాధ్యతను గుర్తు తెచ్చుకుని పాఠకులకు కూడా గుర్తు చేయటం రచయిత సున్నితత్వానికి, సేవాభావానికి తార్కాణం.

కరోనా మహమ్మారి మూడేళ్ళుగా ప్రపంచాన్నీ అతలాకుతలం చేస్తున్నది. సామాజిక బాధ్యత గల రచయిత లెందరో స్పందించారు. కాలంతో బాటు తానూ నడుస్తానని నిరూపించుకున్న మోహన్ కూడా కరోనాపై కలం ఝుళిపించారు. భార్యాపిల్లల అసలు నైజం కష్టాల్లోనే బయటపడుతుందని చెబుతూనే మనల్ని పట్టి పీడిస్తున్నా అత్యాశ, అసూయ, స్వార్థం అనే వైరస్‌లు కరోనా కంటే భయంకరమైనవి అని ప్రకటించటం రచయిత లోచూపుకు నిదర్శనం.

మరణం తుదిచరణం అంటారు విజ్ఞులు. తర్వాతేం జరుగుతుంది అన్నది ఊహామాత్రమే. ఎవరికీ తెలియదు. అసలు ఏదైనా జరుగుతుందో, లేదో తెలియదు. రచయిత ఆలోచనాపటిమ exponential thinkingతో మనసు కొత్త ఆలోచనల లోకానికి అతిసహజంగా తీసుకెళ్తారు. 'గీయాల గిట్ల అయితంది....' లో. అన్ని సమస్యలకు instant solutions వెదకవద్దు. కాలమే కొన్ని సమస్యలకు తీర్పు చెబుతుంది అంటారు 'కాలం తీర్పు' కథలో.

తన కథల్లో మనుషుల్నే కాదు... 'కోణార్క్ ఎక్స్ రైలు బండిని పాత్రగా చేసి, సినిమా చూపితే సినిమా అయ్యాక లైట్లు వెలుగుతాయి. కాని ట్రేన్ ప్రయాణంలో కథ అయిపోయాక (నిద్ర పోవటానికి) లైట్లు ఆరిపోతాయి. 'ఆలస్యం... ప్రేమ... విరహం'లో కోణార్క్ ఎక్స్ కథలో జొప్పించిన తీరుకు పాఠకులు ముగ్ధులవకుండా ఉండలేరు. నవ్వత అంతర్లీనంగా సాగుతూ కథనంలో ఉల్లాసాన్ని ప్రవేశపెట్టిన తీరు బావుంది. రైలుబండి కదిలితే (గాని) పై బెర్తులోని బ్యాగ్ ఫలహారాలు బయటకు రావట!' ట్రైన్ జర్నీలో ఒక్కరు ప్రయాణించినా బోర్ ఉండదు. మాట్లాడటానికి మహాను భావులు చాలామంది ఉంటారు'ట! సహ ప్రయాణీకుల వ్యక్తిగత వివరాలపై ఆసక్తి, వాళ్ళు ఇచ్చే retortలు అతి సహజంగా, రైలు ప్రయాణమంత అలవోకగా అనాయాసంగా దొర్లుతాయి ఈ కథలో.

'మన తాతలు ఇంగ్లీషువాళ్ళను వెళ్ళగొట్టితే..., మనం మాత్రం ఇంగ్లీషు భాషను అందలమెక్కిస్తున్నాం అంటారు 'తెలుగు అత్త ఇంగ్లీషు కోడలు' కథలో. 'తెలుగును ఆదరించటం.... ఆచరించటం ... ఇంటినుండే మొదలవ్వాలి' అన్న కథ చివరి వాక్యం రచయిత ఆరాటం తెలియచేస్తుంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇంగ్లీషుకు ఇస్తోన్న ఆదరణ గమనించితే, మాతృభాష ప్రేమికుల కలలు ముందు ముందు ఎటు పయని స్తాయో... సాకారం అవుతాయో లేదో... కాలం మాత్రమే చెప్పగలుగుతుంది.

> **పది నీతులు చెప్పటం కంటే ఒక మంచిపని చడీచప్పుడు లేకుండా చేయాలని చెప్పే 'గుంతలు' కథలో అధిక్షేప నిరసన' ప్రకటిస్తూ, సున్నితమైన హాస్యం, నర్మగర్భతకు కూడా 'తగునని' నిరూపించుకున్నాడు మోహన్. కొసమెరుపు కథ చివరి వాక్యాలు రచయిత తన సామాజిక బాధ్యతను గుర్తు తెచ్చుకుని పాఠకులకు కూడా గుర్తు చేయటం రచయిత సున్నితత్వానికి, సేవాభావానికి తార్కాణం.**

తన బిడ్డను పొట్టన పెట్టుకున్నవారిని దేవుడు కాల్చి చంపాడని తెలిసిన తల్లి కుందేలు మనుషుల్లా సంతోషపడలేదు. తన బిడ్డలా ఇంకో చిన్నారికి ఇలా కాకుండా... మనుషులకు కొంత జాలిని ప్రసాదించమని దేవుడిని వేడుకుంటుంది. 'సీన్ కథలో, కథను ఇలా ముగించటం రచయితలోని క్షమాగుణాన్నీ ఎత్తి చూపే ఉదాత్తమైన ముగింపు, సాధు ప్రవర్తన 'చంపదగినట్టి శత్రువు తన చేత చిక్కెనేని... పొసగ మేలు చేసి పొమ్మను యె మేలు..." అన్న నీతిపద్యం గుర్తుకు వచ్చి పాఠకుడి మనసు ఆర్ద్రమైపోతుంది. సాహిత్యా న్నుండి ఆశించే ప్రయోజనాలు మోహన్ రాసిన ఇలాంటి కథల వల్లే సాధ్యపడుతాయి.

కథను ఎక్కడ ప్రారంభించాలో ఎక్కడ ముగించాలో మోహన్‌కు బాగా తెలుసు. ఆసక్తి రేకెత్తించే ఎత్తుగడతో మొదలుపెట్టి నల్లేరు మీద నడకలా సాఫీగా సాగింపచేసి, ఒక్కోసారి అనుకోని మలుపుతిప్పి కథకు ముగింపు పలుకుతారు. నాకేం తెలుసు...'లో. చివరివాక్యం చదివాక కూడా 'ఆయన' మరణించాడని నమ్మ బుద్ధేయదు. 'మా ఇంట్లో దసరా ఉత్సవాలు ముందే మొదలయ్యాయి' (రాళ్లకుచ్చె) అన్న ఎత్తుగడలో మొదటి వాక్యంతోనే ... 'ఏమా...మొదలు' అంటూ ఆసక్తికి తెరలేపుతారు. ఒక్క వాక్యంలోనే పదివాక్యాల మేర అర్థాన్ని దట్టిస్తారు. 'సంసారరేఖలు'లో మానస బ్రతుకు, రాంనగర్ (హైదరాబాద్‌లో ఒక చిన్న ప్రాంతం దాటి వెళ్ళటం లేదట! మౌనం కంటే ఉత్తమ సమాధానం..., జవాబు ఇవ్వకపోవటం కంటే గొప్ప ఆయుధం లేదు అంటారు. ఇదే కథలో... అక్షర లక్షలు చేసే వాక్యాలివి.

కథల్లోని సందేశాత్మకత కూడా మనల్ని మురిపిస్తుంది. మనుషులు మారాలని 'సీన్' తెలుగును ఆదరించమని 'తెలుగు అత్త ఇంగ్లీషు కోడలు', ధైర్యం చేస్తే గాని అనుకున్నది సాధించలేమని 'మిడిల్ క్లాస్ అమ్మాయి పెళ్ళి...' అసభ్యంగా మాట్లాడే 'కొచ్ బుద్ధి చెప్పాలని రచయిత సంఘటనల్ని, సంభాషణల్ని మలిచిన తీరు ప్రశంసనీయం.

చదివిన కొద్దీ కొత్తరుచులూరించే కథనం, కవితాత్మకత మోహన్ మాత్రమే వ్రాయగలడనిపిస్తుంది.

రచయితకు అభినందనలు. మరిన్ని కొత్తకథలతో మరో సంపుటితో మన ముందుకు రావాలని అభిలషిస్తూ...

# బాల్యం



కొరుప్రోలు హరనాథ్, 97035 42598

నిర్మలంగా సాగిపోతున్న నదిని చూస్తే
కల్మషాలంటని బాల్యం గుర్తుకొస్తుంది
రంగురంగుల సీతాకోకచిలుకల్ని చూస్తే
పసితనం గుర్తుకొస్తుంది
చెట్టుచేమల్లో తిరుగాడిన
జ్ఞాపకం గుర్తుకొస్తుంది
కట్టెల పొయ్యిపై అన్నం ఉడుకుతుంటే
అమ్మ గుర్తుకొస్తుంది
అమ్మచేతి అన్నం ముద్ద గుర్తుకొస్తుంది
గిరకల బండిని చూస్తే
నాన్న గుర్తుకొస్తాడు
నాన్న తెచ్చిన కొత్త చొక్కా గుర్తుకొస్తుంది
బడిపిల్లల్ని చూస్తే నాన్నలతో కలిసిన
తెలుగు మాస్టారు గుర్తుకొస్తారు
పాతపద్యాలు గుర్తుకొస్తాయి
నాతో ఆడుకున్న నేస్తాలు గుర్తుకొస్తారు
తీయని రోజులు భూతకాలాలయ్యాయి
తెలియని దిగుళ్ళు కమ్ముకున్నాయి
ఎవరన్నా నాకున్న సమస్తాన్ని
తీసుకుని ఒక్కసారి నా బాల్యాన్ని
తిరిగిస్తే బాగుండు.



కథ

# బంధపు తడి

అనుబంధాలలో అసలు మర్మం...



శ్రీమతి కామరాజుగడ్డ
వాసవదత్త రమణ
97044 44760

'తాత' అంటూ పరుగెత్తుకుంటూ వచ్చి నా పక్కన దూరిపోయి పడుకుంటూ. 'నీ గెడ్డం ఇంత తెల్లగా, పొడవుగా ఉందే రబీంద్రనాథ్ టాగూర్‌లాగా. ఏంటీ నువ్వు రోజు గెడ్డం గీసుకోవా?' నా వంక ఆసక్తిగా చూస్తూ మనవరాలు అంది.

చిన్నగా నవ్వి, 'నేనెప్పుడు నా చేత్తో నా గెడ్డం గీసుకోలేదు తల్లీ. ఎప్పుడు మనిషి ఇంటికి వచ్చి చేసేవాడు.'

'అబ్బో, నువ్వు మా నాన్నలా ఇంట్లో చేసుకోవా 'అని నేను చెప్పేది కళ్ళు ఇంత చేసుకుని వింటూ.

'సరే కానీ, ఏదైనా కథ చెప్పు తాతా' గారంగా అడిగింది.

'కథా' అంటూ నేను చిన్నగా నవ్వి 'అనగనగా ఒక పెద్ద అడవిలోకి ఒక కుర్రాడు వచ్చాడు. ఆ పచ్చటి చెట్ల నీడలో హాయిగా పడుకుని, చెట్టుకొమ్మల నుంచి తీయటి పళ్లను కోసుకొని తిని కడుపు నింపుకొన్నాడు. ఎంతో స్వేచ్ఛగా ఆ అబ్బాయికి అడవి తెగ నచ్చేసింది. ఇల్లంటే చెరసాలలాగ, అడవైతే అమ్మ ఒడిలో ఉన్నట్టుగా అనిపించేది.' చెబుతున్న నన్ను చేయి ఊపుతూ ఆపి, 'తాత, ఈ కథ నాకు బాగా తెలుసు. ఇది టార్జాన్ కథ' కని పెట్టేసినట్టుగా పకపక నవ్వుతూ అంది.

ఇంతలో తలుపు తోసుకుంటూ మా అబ్బాయి కామేష్ లోపలికి వచ్చి 'ఏంటి బాపూ! టైం ఎంతవుతోంది. పడుకోవాలి కదా. తెల్లవారే మనం ఊరుకి బయలు దేరాలి. చిన్నీ, ఏంటి నువ్వు రేపు పొద్దునే స్కూల్కి వెళ్ళాలి, లే, పద' అనేసి మనవరాలిని బలవంతంగా లేపేసి తనతో తీసుకుని వెళ్ళిపోయాడు.

వాడు నన్ను శాసిస్తున్నందుకే ఎంతో చికాకుగా అనిపిస్తున్నా ఓర్చుకున్నాను. కానీ ఠక్కున లైట్ ఆపేసి వెళ్లినందుకు మటుకు నా మనస్సు చివ్వుక్కుమంది. ఆ చీకటిలోనే నా గతంలోకి జారాను.

★ ★ ★

నా మనవరాలు చెప్పినట్టు ఈ కథ టార్జాన్ కథ కాదు అచ్చంగా నా కథే. ఈ అడివి మనిషి కథే. నేను అమ్మకడుపులో ఉండగానే మా నాన్న చనిపోయారు. నాకు ఊహ పూర్తిగా తెలియక ముందే అమ్మ కన్నుమూసింది.

నా ఆరేళ్ల వయస్సులోనే అక్కయ్యలు పెళ్లిళ్ళు అయ్యి వెళ్ళిపోయారు. అప్పుడే మా ఇంటికి వదిన వచ్చింది. అందరు నాకు అమ్మ దొరికిందన్నారు కానీ ఆమె నన్నెప్పుడు దగ్గరికి తీసుకోలేదు సరికదా ఇంట్లో ఉన్న అనేక వస్తువులలో నన్ను ఒక వస్తువులాగే చూసింది. వచ్చిన కొత్తల్లో నేను ఇంట్లో పాతుకుపోకుండా నన్ను ఎలా బయటికి పారేయలా అని చాలా ఆలోచనలు చేసింది కాని తరువాత తరువాత నేను వెళ్లిపోతే నాకు ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని రోజు నాకింత ముద్ద పడేసి కనికరంగా చూసినట్టుగా మహానటనలు చేసింది.

'అయ్యో వంద ఎకరాల జమీందారువు నువ్వు, నీకీ కర్మ ఏమిటిరా' అని అత్తగార్ల పెత్తనం కింద ఉన్న అక్కయ్యలు చాటు మాటుగా కన్నీళ్లు పెట్టుకునేవారు కానీ ఎన్నడు వాళ్ళు కూడా తమ ఇంటికి తీసుకెళ్లి పట్టెడన్నం పెట్టి నన్ను ప్రేమతో ఆదరించలేకపోయారు.

పేరుకి ఇద్దరు అక్కలు, ఒక అన్నగారు ఉన్నా, వాళ్ళ సంసారాలలో వాళ్ళు మునిగితేలుతూ నా ఉనికినే అందరు మరిచిపోయారు.

ఒక రోజు వదినగారి పితూరీలతో అన్నగారి చేతుల్లో గట్టి దెబ్బలు తిని ఏడేళ్ల వయస్సులోనే ఇంట్లోంచి పారిపోయి కాశీకి వెళ్ళుతున్న బృందంతో పాటుగా ఉత్తరానికి చేరిపోయాను. అప్పటివరకు పరిచయం లేని బయట ప్రపంచం నాకు చాలా అందంగా కనిపించింది. ఈ స్వేచ్ఛ ఎంతో సంతోషాన్ని కలిగించింది. అలా తిరుగుతూనే అక్షరాలూ నేర్చుకున్నాను. ఆసనాలు వేశాను. పురాణాలు, ఇతిహాసాలు విన్నాను. అలా సాధువుల వెంబడి తిరుగుతూ, ఒకసారి పశ్చిమానికి వచ్చాను. అప్పటికి పదిహేనేళ్ల వయస్సు వచ్చిన నాకు బొంబాయి నగరంలోని

రంగుల ప్రపంచం విపరీతంగా ఆకర్షించింది. ఇక సాధువులను వదిలేసి అక్కడే ఉండిపోయాను. నాన్న పోలికలతో ఉన్న నన్ను బొంబాయిలో ఎవరో ఊరి వాళ్ళు చూసి గుర్తుపట్టి గాలికి తిరుగు తున్నాడని చెప్పగా పెద్దక్కయ్య మనిషిని పంపించి వెతికించి నన్ను బలవంతంగా తిరిగి ఊరికి రప్పించింది.

★ ★ ★

పచ్చటి పైర్లు, పందిరి పట్టు మంచాలు, విందు భోజనాలు ఊరికి చేరిన నాకు అందమైన స్వాగతం పలికి ఎంతో ఆనందాన్ని కలిగించ సాగాయి. అంత కన్నా కనువిందు చేసింది మావయ్యంటూ నన్ను వెన్నంటి వదలకుండా తిరుగుతున్న చారెడేసి కళ్ళ అమాయకపు సౌందర్యం, మా అక్కయ్య కూతురు చిట్టెమ్మ.

ఇంకో మూడు నెలలు గడిచేటప్పటికి చిట్టెమ్మతో నా పెళ్లి వైభవంగా జరిగి పోయింది. ఆస్తి పంపకాలు, ఇంటి విభజనతో పదహారేళ్ళ వయస్సుకే నేను వంద ఎకరాల ఆసామినే కాకుండా చాలా వాటికి ఒక్కసారిగా పెద్ద యజమానిని అయిపోయాను.

'అంతా నేనే' అన్న మానవభ్రమలో పడి సుఖాలలో మునిగి తేలాను. కళ్ళు తెరిచేటప్పటికి ముగ్గురు మగపిల్లలు ఒళ్లోను, ముగ్గురు ఆడపిల్లలు భుజాన ఉన్నారు. ఎదురుగా చిట్టెమ్మ నాలుగు నెలల కడుపుతో కంటి ముందు ఇలా అలా తిరుగుతోంది. లేత యవ్వనపు మోజు క్రమక్రమంగా నాలో జారిపోసాగింది.

మూడుముళ్ల వేస్తే దేశాల వెంబడి పడి తిరగకుండా సంసారంమాయలో పడి ఇంటిపట్టునే ఉండిపోతాడని, వంద ఎకరాల ఆసామితో కూతురు పెళ్లి జరిపించడానికి ఇదంతా అక్కయ్య పన్నిన పన్నాగమని అప్పటికి నాకు తెలిసి వచ్చింది. 'నేనేమిటి ఇలా? ఈ సంసార బంధనాలేంటి' అన్న ప్రశ్న ఒక్కలాగా నన్ను పట్టి ఊపిరి ఆడకుండా కుదిపేస్తుంటే మళ్ళీ ఇంటిని, ఇల్లాలిని వదిలిపెట్టి వెళ్ళిపోయాను. కానీ ఈసారి చిత్రంగా మునిపటిలాగా హిమాలయాల వైపుగా నేను వెళ్లలేదు. జేబు నిండా ఉన్న కట్టల కొద్ది డబ్బు నన్ను బొంబాయి వైపుగా లాక్కెళ్ళింది. సంగీతంపై మక్కువ కళారంగం వైపుగా నడిపించి, నాకిష్టమైన వాయిద్యాల పైన అద్భుతమైన పట్టు సాధించేలా చేసింది.

★ ★ ★

కొన్నేళ్లకు అక్కయ్య చనిపోవడంతో బలవంతంగా మళ్లి నన్ను ఊరికి రప్పించారు. స్నేహితులంతా ఆప్యాయంగా నా దగ్గరకు చేరారు. పిల్లలంతా నాన్న అంటూ చుట్టూ చేరారు. చిట్టెమ్మ కళ్ళలో వేల మతాబులు విరిసాయేమో కానీ నాకంత పట్టలేదు.

కానీ అందమైన బొంబాయిని చూసిన కళ్ళతో మా ఊరిని చూసి మటుకు ఒక్కసారిగా చలించిపోయాను. ఊళ్ళో మొదటి కరెంటు దీపాన్ని నేనే వెలిగించాను. గాలికి పడిపోతూ పాకలో నడుస్తున్న బడిని విశాలమైన డాబా మేడగా మార్పించాను. కుడి చేత్తో చేసిన దానం ఎడమ చేతికి తెలియకుండా ఎన్నో గుప్తదానాలు చేసాను. నేనేనాడు నా చేత్తో నా గెడ్డం గీసుకున్నది లేదు. నేన్నెన్నడు ఇస్త్రీ చొక్కా వేసుకున్నది అంతకన్నా లేదు. నేను లేవగానే చిట్టెమ్మ రోజు ఒక కొత్త బట్ట నా కోసమని సిద్దంగా పెట్టేది.

కొన్ని సంవత్సరాలు ఆ ఆనందంలో, ఆ సంబరాలలో మునిగి తేలుతూ వెనక్కి చూస్తే ఏముంది ? కర్పూరంలా కరిగి పోతున్న కొండంత ఆస్తి కనిపించింది. చుట్టూ ఉన్న స్నేహితులంతా ఒక్కసారిగా మాయమైపోవడం ఇంకా ఆశ్చర్యాన్ని కలిగించింది. ఒక పక్క పిల్లలని, మరో పక్క ఇంటిని నిలబెట్టడానికి చిట్టెమ్మ చేస్తున్న ఒంటరి పోరాటం, ఆమెలో ఎదిగిపోయిన వ్యక్తిత్వం నా కళ్ళకు కట్టినట్టుగా కనిపించింది.

నా పాత్రను పోషించాలని అప్పటికి కొంత ప్రయత్నించాను కాని అలవాటు లేని పొలం వ్యవహారాలు చేయలేక, గాలి పటంలాగ తిరిగే మనస్తత్వం వీడలేక ఈసారి బొంబాయికి కాకుండా మద్రాసుకి చెప్పాపెట్టకుండా ఒక రాత్రి బయలుదేరి వెళ్ళిపోయాను.

★ ★ ★

ఆనాటి నుంచి మిగిలి ఉన్న కొద్దిపాటి ఆస్తి అమ్మకమప్పుడో, పెళ్లిపీటల మీద ఆడపిల్లలకి కన్యాదానానికో తప్ప నేను మళ్ళీ పెద్దగా ఇంటికి వచ్చి ఉన్నది లేదు. చిట్టెమ్మ పెట్టమన్న చోట సంతకం పెట్టడమే తప్ప, తిరిగి వెళ్ళు తున్నప్పుడల్లా జేబునిండా ఆమె పెట్టిన డబ్బు పట్టుకు పోవడమే తప్ప నేనీ సంసారం కోసమని నిలబడ్డది లేదు.

కాని చేసిన అప్పులన్నీ



**పచ్చటి పైర్లు, పందిరి పట్టు మంచాలు, విందు భోజనాలు ఊరికి చేరిన నాకు అందమైన స్వాగతం పలికి ఎంతో ఆనందాన్ని కలిగించ సాగాయి. అంత కన్నా కనువిందు చేసింది మావయ్యంటూ నన్ను వెన్నంటి వదలకుండా తిరుగుతున్న చారెడేసి కళ్ళ అమాయకపు సౌందర్యం, మా అక్కయ్య కూతురు చిట్టెమ్మ.**

తీర్చడానికి, మిగిలిన సొమ్ముని మగపిల్లలకు తలో కొంత పంచడానికి లంకంత ఇంటిని అమ్మినప్పుడు తొలిసారిగా చిట్టెమ్మ కళ్ళలో సముద్రమంత దుఃఖాన్ని నేను చూసాను. ఆ క్షణం హిమాలయాలలోని అఖండ మంచు కరిగి నన్ను ముంచెత్తు తున్నట్టుగా, నాకు ఊపిరాడనట్టుగా అనిపించింది. కాని విషాదకరంగా ఆ తెల్లారి ఆమె మరి ఇక నిద్ర లేవలేదు.

ఆమె మెట్టినింటి నుంచే ఆమె కట్టె తరలి వెళ్ళిపోయింది. నాలో తన్నుకొస్తున్న ఆవేదనను నేనసలు ఎలా అర్థం చేసు కోలేక, నాలో నేను సతమతమైపోతు మళ్ళి తిరిగి వెళ్ళిపోయి, నా సంగీత ప్రపంచంలో మునిగి తేలుతూ ఎన్నో కొత్త చోట్లలో అలా గాలిపటంలా తిరుగుతూనే ఉన్నాను.

* * *

ఎన్నో ఏళ్ళ తరువాత ఎక్కడో తంజావూరులో త్యాగరాయ ఉత్సవాలలో ఉన్న నన్ను వెతికి ఇంటికి తీసుకువచ్చారు నా పిల్లలు. హాలులోని పెద్దపటంలో ఉన్న చిట్టెమ్మ పసుపు పూలహారం మధ్య ఎర్రటి కుంకుమ బొట్టుతో దీపపు వెలుగులలో మెరిసిపోతూ ఎప్పటిలాగే నావంక చిరునవ్వుతో ఎంతో సంతోషంగా చూస్తూ స్వాగతం పలుకు తున్నట్టుగా అనిపించింది. ఎందుకో తొలిసారిగా నా గుండె వేగంగా కొట్టుకుంది. నా కంట్లో తెలియకుండానే తొలిసారిగా చెమ్మ కూడా చేరింది.

సంక్రాంతి పండుగకి నా పిల్లలంతా ముందే అనుకుని మా పెద్దాడింట్లో సరదాగా కలిసారు. సందడిగా సమయం గడుపుతుంటే పాత జ్ఞాపకాలన్ని నా కళ్ళ ముందు ఎందుకనో చిత్రంగా మెదులు తున్నాయి.

పెరుగుతున్న వయసు, డస్సిపోయిన దేహం, అలసిపోయిన మనసు నీ పయనమింకా ఎంతవరకు? అని నాకు సన్నగా గుర్తుచేస్తున్నాయి. ఎంత మందితో ఉన్నా, ఎన్ని చోట్ల తిరిగినా, ఎంత ఎత్తుకి ఎగిరినా గాలిపటానికున్నట్టు మొదలంటూ ఒక చోటు ఉంటుంది. ఇన్నాళ్ళు నేను తెగిపోకుండా దారంలా నన్ను కాపాడుకుంటూ వస్తున్న ఆ ఆత్మీయ హస్తాన్ని నేను నిర్లక్ష్యం చేసానా? నేను నిజంగా వెనెక్కి వచ్చి వాలాలను కున్నా నాకో గూడేది? నేనుండాల్సిన చోటేది? ఏవేవో ఆలోచనలు నా మదిలో తొలిసారిగా చెలరేగుతున్నాయి.

కళ్ళు కాయలుగా చేసుకుని నా కోసం ఎదురుచూసిన చిట్టెమ్మా ఇప్పడు లేదు, ఏ ఆస్తి లేదు, ఇల్లు లేదు, తమ్ముడి జీవితాన్ని చక్క పెట్టాలని అనుక్షణం తాపత్రయ పడిన అక్కయ్యలు బతికిలేరు. కాని ఇప్పుడు నా కంటికి ఎదురుగా మటుకు చిట్టెమ్మ దక్షతవల్ల బాగా చదువుకుని, మంచి ఉద్యోగాలలో చేరి, సొంత ఇళ్ళని కట్టుకొని సంతృప్తి కరమైన జీవితాలని గడుపుతున్న నా పిల్లలు కనిపిస్తున్నారు. వాళ్ళందరి చిరునవ్వులలో చిట్టెమ్మ నన్ను పలకరిస్తూనే ఉంది.

నాలుగు రోజులు గడిచాక నన్ను ఎందుకు తీసుకొచ్చారో అప్పుడు అసలు విషయం నాకు తెలిసింది. ఎప్పుడో మా నాన్న పొలాల పక్కగా కొంచెం ఎత్తుగా దిబ్బగా ఉన్న చోట ఒక చిన్న పాక వేయించాడు. ఆస్తులన్ని అమ్మేసారను కున్నారు కానీ కొత్తగా సరిహద్దులు కొలుస్తూ ఆ ముక్క ఇంకా నా పేరునే చూపిస్తోందని మా ఊరి కరణంగారు పిల్లలకు చెప్పారుట. మా పొలం కొన్న రైతు ఆ చిన్నముక్క తానే కొనేసుకుంటాననడంతో అమ్మకం కోసమని పిల్లలు నన్ను మా ఊరికి తీసుకెళ్ళారు.

* * *

ఎన్నో ఏళ్ల తరువాత ఊళ్ళో అడుగు పెట్టిన నాకు కొత్తరకాల అనుభూతులు కలిగాయి. ఎన్నడు తలవని జ్ఞాపకాలు నన్ను ఆత్రంగా తడుముతూ ఉన్నాయి. పొలాల వైపుగా వెళుతూ మా ఇంటి ముందు అలాగే శిలలాగా నిలబడి తేరిపారి చూస్తూ ఉండిపోయాను.

'బాబు, లంకంత ఇంటినే కాదు,-ఈ

**కొన్ని సంవత్సరాలు ఆ ఆనందంలో, ఆ సంబరాలలో మునిగి తేలుతూ వెనెక్కి చూస్తే ఏవుంది ? కర్పూరంలా కరిగి పోతున్న కొండంత ఆస్తి కనిపించింది. చుట్టూ ఉన్న స్నేహితులంతా ఒక్కసారిగా మాయమైపోవడం ఇంకా ఆశ్చర్యాన్ని కలిగించింది. ఒక పక్క పిల్లలని, మరో పక్క ఇంటిని నిలబెట్టడానికి చిట్టెమ్మ చేస్తున్న ఒంటరి పోరాటం, ఆమెలో ఎదిగిపోయిన వ్యక్తిత్వం నా కళ్ళకు కట్టినట్టుగా కనిపించింది.**

ఇంటి అమ్మకంతో అమ్మనే మనం పోగొట్టుకున్నాం' దిగులుగా అంది చిన్న కూతురు. మౌనంగా పొలం వైపుకు ముందుకు కదిలాను.

దూరం నుంచి పొలాల మధ్యలో ఒక పక్కకి పడిపోయినట్టుగా ఉన్న పురిపాకను చూడగానే నా గుండె ఒక్కసారిగా వేగంగా కొట్టుకుంది.

పెళ్ళైన కొత్తలో నేను, చిట్టెమ్మ అక్కడ గడిపిన కొన్ని అద్భుతమైన వెన్నెల రాత్రులు నా కళ్ళ ముందు ఒక్కసారిగా మెరుపులా మెరిసాయి. ఆ మధురమైన జ్ఞాపకాలు అల్లల్లాగా నన్ను ముంచెత్తి నన్ను ఒక్కసారిగా ఉక్కిరిబిక్కిరి చేసేసాయి. చుట్టు ఉన్న ఒకప్పటి నా పచ్చటి పొలాలను కళ్ళారా చూస్తుంటే ఆ పొలాల మధ్య స్వేదం చిందిస్తూ చిట్టెమ్మ పడిన కష్టమంతా ఇప్పుడు నా కళ్ళ ముందు అనుభవంలోకి వస్తోంది.

'ఈ పాక నాదే. ఇక నేనిక ఉండాల్సిన చోటు ఇదే. ఇది నా కోసమనే నా చిట్టెమ్మ అట్టే పెట్టేసింది. ఎంత దూరం ఎగిరినా, ఎప్పటికైనా తన మావయ్య తిరిగి వస్తాడని, హద్దులు లేని స్వేచ్ఛతో లోకమంతా తిరిగిన పెనిమిటి, ఏ గూట్లోనో రాజీ పడుతూ ఎప్పుడు ఎక్కడా గడుపు కోలేడని, రెక్కలు అలిసి డస్సిపోయి వెనెక్కి తప్పక తిరిగి వస్తాడని ఆమెకి ముందే తెలుసు. అందుకనే ఆఖరిశ్వాస

కథ

విడిచే వరకు ప్రకృతితో మమేకమై నేను ఆనందంగా బతకాలని ఈ చిన్న ముక్కను ఆమె అమ్మకుండా కావాలనే నా కోసమని అట్టే పెట్టేసింది.'

ఈ ఆలోచనలు సుడిగాలిలాగ నన్ను చుట్టుముట్టగానే నేను నరికిన మానులా ఒక్కసారిగా కుప్ప కూలిపోయాను. ఏడుపు రావటం లేదు కానీ గుండెల్లో సముద్రమంత ఘోష తుఫానులా కుదిపేస్తున్న ఆవేదన. ఆకాశమంత కమ్మేసిన విచారం. 'నేనిక్కడే మన ఊరిలోనే ఉండిపోతాను. ఇది నేనెప్పటికి అమ్మలేను' గొంతు పెగుల్చుకుంటూ అన్నాను. నా కొడుకులు ఎప్పటిలా మారు మాట్లాడలేదు. నా చిట్టెమ్మ నన్ను నిలబెట్టిన గౌరవం అదీ.

చిన్నది మటుకు 'ఎన్నాళ్ళు ఇలా బాపు? ఈ వయసులో ఒంటరిగా ఎలా ఉంటావు?' బాధపడుతూ చాలా ఏడ్చింది.

'ఇన్నాళ్ళుగా ఎలా ఉన్నానో అలాగే' వణుకుతున్న గొంతుతో అన్నాను.

* * *

ఆ రోజు నుంచి ఆ పొలాల మధ్య నేను తిరుగుతూంటే నేనెప్పుడు చూడని నాన్న, గుర్తుకు కూడా లేని అమ్మ నిత్యం నాతోనే ఉంటున్నారు. నాన్నయితే ఆయనకి ఎంతో ఇష్టమైన ఈ చోటులోకి నేను చేరినందుకు తెగ మురిసి పోతున్నాడు. చిట్టెమ్మకున్న ధైర్యంలో వందోవంతు కూడా లేని నేను, ఆమె జీవితపు పోరాట స్ఫూర్తిని గుండెల నిండా నింపుకుంటూ హాయిగా గొంతెత్తి పాటలు పాడుకుం టున్నాను. మనసారా వేణువును ఊదుకుంటున్నాను. పచ్చటి పైర్లగట్ల మీద ఆనందంగా తిరుగుతున్నాను. నా చిట్టెమ్మ చారెడేసి కళ్ళతో చిరునవ్వులు చిందిస్తూ ఎప్పటిలాగే నా స్వేచ్ఛను కంటికి రెప్పలా కాపాడుతూ నాకు తోడు నీడగా అనుక్షణం నన్ను అంటి పెట్టుకుంటూ నాలోనే ఉంది.

నేను రాలిపోయే వరకు నాతోనే ఉంటుందని, తనసలు నన్నెప్పుడు వీడి వెళ్ళలేదని ఇప్పుడిప్పుడే నా మనస్సుకు కాస్త కాస్త తెలిసి వస్తోంది. అనంతమైన చిట్టెమ్మ ప్రేమ ఎదను చల్లగా స్పృశిస్తూ ఉండగా ఈ గాలివాటం మనిషికి మనసులో ఎక్కడో బంధపు తడి తొలిసారిగా తగులుతోంది.

కవిత



# నీ తదనంతరం



**హనీఫ్, 92475 80946**

వాటినెందుకు
మట్టిపాలు చేస్తావ్?

నీ కోసం
చూసాయి, చెమర్చాయి
పిల్లల్ని, కుటుంబాలకు, కుటుంబాల
సుఖదుఃఖాలు అనుభవించాయి
ఎదుగూబొదుగును గమనిస్తూ
అదుపూ ఆజ్ఞలను
ఇచ్చుకునే విధంగా తోడ్పడ్డాయి
ఎన్నిటినో నీ అనుభవంలోకి చేర్చాయి

వాటినెందుకు
మట్టిపాలు చేస్తావ్?

చేతులే కత్తులు దూస్తాయి
ముందు కళ్ళతోనే యుద్ధాలు చేస్తాం
యుద్ధాలు ముందు కళ్ళే ముగిస్తాయి
ఇంకో జీవితానికి వెలుగునిస్తాయి
మళ్ళీ, మళ్ళీ చూసినంతా చూసి
రెట్టింపు జీవితాన్నిస్తాయి

కళ్ళను మట్టి పాలు
ఎందుకు చేస్తావ్?

వ్యాసం

# కాఫీ విత్ కె. ప్రభాకర్ పొయెట్రీ..

కవిత్వము కరచాలనం...



ఎ. రజాహుస్సేన్
90631 67117

కె. ప్రభాకర్ ఫేస్బుక్లో కనిపించరు. ఆయన సీనియర్ కవి. సంస్కృతం, ఇంగ్లీషులో డబుల్ ఎమ్మే చేశారు. తెలుగు, ఉర్దూ భాషల్లో ప్రవేశం వుంది. సంస్కృత భాష లెక్చరర్గా పనిచేసి రిటైర్ అయ్యారు. ప్రస్తుతం విశ్రాంత జీవితంలో సాహిత్యంతో కాలం గడుపుతున్నారు..!!

వివిధ సాహితీ కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. తెలుగు, ఉర్దూ భాషల్లో కవిత్వం రాస్తారు. కొన్ని పుస్తకాలు అచ్చయ్యాయి. ప్రస్తుతం ఉర్దూషేర్ల (తెలుగు అనువాదంతో) ఓ బృహత్ ప్రాజెక్టు రూపకల్పనలో నిమగ్నమై వున్నారు. ఈ రోజు ఉదయం ఆయనతో ఫోన్లో పిచ్చాపాటీగా మాట్లాడుతుంటే.. ఆయన నోటి వెంట అశువుగా కొన్ని ఉర్దూ / తెలుగు షేర్లు వచ్చాయి.

ఈరోజు కాఫీ టైమ్లో ఆ 'షేర్ల' ను పంచుకుందాం!

ఈ కవికి ఉర్దూ మాతృభాష కాదు. చాలా కాలం మద్రాసులో ఉన్నాడు. ఆ తర్వాత హైదరాబాదుకు షిఫ్ట్ అయ్యాడు. ఉర్దూ భాషపై బాగా పట్టు సాధించాడు. ముఖ్యంగా ఉర్దూ కవితాత్మను పట్టుకున్నాడు. షాయరీలు, గజల్స్ రాస్తున్నాడు.

ఇక తెలుగులో అయితే వేరే చెప్ప పనిలేదు అశువుగానే తెలుగులో షేర్లు (ద్విపదలు, దోహాలు) చెప్పేస్తాడు.. అందరిలో వుంటాడు కానీ ఈ కవికి రావాల్సిన గుర్తింపు రాలేదేమో అనిపిస్తుంది.

"పదహారు వయసులో మోహం
అరవై దాటితే ప్రేమ చిగురింపు"

అంటూ అరవైకు, ఇరవైకు మధ్య మనిషి బలం, బలహీనతల్ని వివరిస్తారు ప్రభాకర్..!

అలాగే

*స్త్రీలు కవిత్వాన్ని ఇష్టపడతారు. కానీ,*
*కవిత్వమే జీవితం కాకూడదంటారు!!*

అంటూ కవిత్వం పట్ల స్త్రీల మనోభావాన్ని చెబుతారు. అంతెందుకు..?

*కవిత్వం మండుతున్న పొయ్యే కాదు*
*మనం తవ్వుకున్న లోతైన గొయ్యి కూడా!!*

అంటారు.. ఒక్కసారి కవిత్వంలో పడ్డామా? ఇక అంతే బయటకు రావడం కష్టమంటారు.

*"గడిచిన రోజులు తియ్యనివి*
*తలచిన కొలదీ మాయనివి*
*గుండెల నిండా దాచనివి*
*ఎన్నడూ ఎవరూ దోచనివి!!"*

అంటూ. తన పాత రోజుల్ని, అప్పటి అనుభవాల్ని తలపోస్తారు.

ఉర్దూ షాయరీ "గుండె గాయాలమీద రాసే భాష ఉర్దూ" అంటారీయన.' ఉర్దూ ఒక మతం వారి భాష కాదు.

ఇది 'దేశ' భాష.. ఈ భాష పుట్టింది మన భారతదేశంలోనే. అందుకే ఉర్దూలో మన మట్టిపరిమళం గుబాళిస్తుంటుంది' అంటారు ప్రభాకర్ గారు.

ఇప్పుడో ప్రభాకర్ గారు చెప్పిన ఓ రెండు ఉర్దూ షేర్లు చూద్దాం.

*"తుఫానోసే రిష్తా హై మగర్*
*కినారోంసే నహీ*
*మొహబ్బత్ సే రిష్తాహై మగర్*
*షాదీకి జంజీరోంసే నహీ.!"*

తుపానులతో సంబంధం వుంది. కానీ తీరాలతో కాదు. ప్రేమతో సంబంధం వుంది.. కానీ, పెళ్ళి సంకెళ్ళతో కాదు సుమా!

"చాంద్నీ సూరతే బే పరదా
నజరాతే హై
చార్ లకీరోంకి కాగజ్ కే లియే
దేవియా భీబిక్ జాతీ హై!!"

'మెహందీ'.. 'వేశ్యావాడ','రెడ్ లైట్' పేరేదైతేనేం? 'చంద్రముఖిలాంటి పడతులు కూడా పరదా లేకుండా కనిపిస్తారిక్కడ, నాలుగ్గీతల కాగితం కోసం అప్సరసలు కూడా అమ్మబడతారిక్కడ'. అంటారు ప్రభాకర్.

ఈ కవి ప్రభాకర్తో మాట్లాడ్డం ఓ ఎడ్యుకేషన్. ఈయన నోటివెంట అశువుగా ఉర్దూ/ తెలుగు షేర్లు వినడం ఓ అందమైన అనుభవం.



బులుసు వెంకటేశ్వర్లు గొప్ప వచన రచయితగా, వక్తగా రాణించాడు. మన కవులు : 'రామరాజ భూషణుడు', 'ధూర్జటి', 'తెనాలి రామకృష్ణుడు' వంటి ప్రాచీన కవుల నుండి మొదలుకొని, 'విశ్వనాథ సత్యనారాయణ', 'నండూరి రామకృష్ణమాచార్య', 'గుంటూరు శేషేంద్ర శర్మ', 'వేముగంటి నరసింహాచార్యులు' వంటి దివంగత ఆధునిక కవులతోబాటు 'అనుమాండ్ల భూమయ్య', 'దుగ్గిరాల రామారావు', ఇంకా 'ఆచార్య ఫణీంద్ర' వంటి సమకాలీన కవుల వరకు 50 మంది కవులు రచించిన అనేక విశిష్ట పద్యాలను హృద్యంగా విశ్లేషిస్తూ రచించిన చక్కని విమర్శన గ్రంథం ఆయన రాశారు.

## తత్త్వశాస్త్ర పరిశోధకుడు బులుసు వెంకటేశ్వర్లు

# బులుసు వెంకటేశ్వర్లు

బులుసు వెంకటేశ్వర్లు ప్రముఖ కవి, రచయిత, సాహితీ విమర్శకులు. ఆయన 1956లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందారు. ఆయన కవివతంస బిరుదాంకితులు. ఇతడు తూర్పుగోదావరిజిల్లా, పొడగట్లపల్లి శివారు ప్రాంతమైన రామచంద్రా పురంలో 1906, ఏప్రిల్ 10న జన్మించాడు. ఇతడు మొదట వేదవిద్య, తరువాత ఆంగ్లవిద్యను అభ్యసించాడు. మద్రాసు విశ్వవిద్యాలయం నుండి వేదాంతంలో, తెలుగు సాహిత్యంలో రెండు ఎం.ఎ. పట్టాలు సంపాదించాడు. తరువాత తెలుగు ఉపన్యాసకునిగా 30 సంవత్సరాలు పనిచేసి 1963లో పదవీ విరమణ చేశాడు.

ఇతడు గొప్ప వచన రచయితగా, వక్తగా రాణించాడు. మన కవులు : 'రామరాజ భూషణుడు', 'ధూర్జటి', 'తెనాలి రామకృష్ణుడు' వంటి ప్రాచీన కవుల నుండి మొదలుకొని, 'విశ్వనాథ సత్యనారాయణ', 'నండూరి రామకృష్ణమాచార్య', 'గుంటూరు శేషేంద్రశర్మ', 'వేముగంటి నరసింహాచార్యులు' వంటి దివంగత ఆధునిక కవులతోబాటు 'అనుమాండ్ల భూమయ్య', 'దుగ్గిరాల రామారావు', ఇంకా 'ఆచార్య ఫణీంద్ర' వంటి సమకాలీన కవుల వరకు 50 మంది కవులు రచించిన అనేక విశిష్ట పద్యాలను హృద్యంగా విశ్లేషిస్తూ రచించిన చక్కని విమర్శన గ్రంథం ఆయన రాశారు.

"వావిళ్ల నిఘంటువు" (1949) వేదం లక్ష్మీ నారాయణశాస్త్రితో కలిసి రాశారు. భారతీయ తత్త్వశాస్త్రము-పరిశీలన అనే గ్రంథం 1956 సాహిత్య అకాడమీ అవార్డును అందుకున్నది. యజ్ఞఫలము (1962), Thousand Steps to God (1975), శ్రీరామాష్టవ సుధాలహరి (1967), బులుసు వెంకటేశ్వర్లు జీవిత చరిత్ర (1977), నిర్వచనాంధ్ర శ్రీమహాభాగవతము, శ్రీ శివప్రభుశతకం ( 1978), సర్వదుఃఖ నివారణోపాయము(1967), Lives of ancient India Saints (1982), అష్టావక్ర చరిత్రము మొదలైనవి ఆయన రచనలు.

క
థ

# వసుంధర

ఆత్మస్థైర్యం గలిగిన ఓ స్త్రీ కథ...



వేణు నక్షత్రం
+1 (703) 861-8368

"బాబూ ఉద్యోగం బాగానే ఉందా? జీతాలు సమయానికే ఇస్తున్నారా?" మటన్ ముక్క నోట్లో పెట్టుకుంటూ కొడుకు వైపు చూస్తూ అడిగాడు వెంకట్రామయ్య.

"ఇప్పుడు బాగానే ఉంది బాపు. కొత్త ఆఫీసులో చేరిన కదా!" నోట్లో ఉన్న మటన్ ముక్కను నములుతూ ఆ తర్వాత వచ్చే ప్రశ్నకు జవాబు ఎలా చెప్పాలా అని ఆలోచనలో పడ్డాడు నరేందర్.

నరేందర్ హైదరాబాద్‌లో ఒక ఫోటో జర్నలిస్ట్. భార్య వసుంధర. బాబుకి పదిహేనేళ్లు, పాపకి పదమూడేళ్లు. నరేందర్ గత పదేళ్లలో మూడు పత్రికలు, రెండు టీవీ ఛానళ్ళు మారాడు. ఏ ఆఫీసులో పని చేసినా జీతాలు ఎప్పుడు వస్తాయో, అసలు వస్తాయో రావో కూడా తెలియదు. పిల్లలిద్దరూ హైస్కూల్‌కు వచ్చే సరికి ఖర్చులు కూడా చాలా పెరిగి పోయాయి. చిన్న చిన్న పార్టీలు, బర్త్‌డేలకి ఫోటోలు తియ్యొచ్చు కదా అని వసుంధర అంటే "ఫోటో జర్నలిస్టు" అనే ఈగో అడ్డు వస్తుందట. ఆదాయం సరిపోక పోవడం, సమయానికి సాలరీ రాకపోవడం వల్ల కొన్ని యూట్యూబ్ ఛానెల్స్‌కి కూడా తాను తీసిన ఫోటోలు, వీడియోలు పంపుతూ వచ్చిన దానితో సంసారం లాగిస్తున్నాడు.

వసుంధర ఇంట్లోనే ఉండి పిల్లలిద్దరి ఆలనా పాలనా చూసుకుంటూ చిన్న పిల్లలకి ట్యూషన్స్ చెపుతూ నరేందర్ ఆదాయానికి వేన్నీళ్ళకు చన్నీళ్ళుగా కొంత సహాయ పడుతుంది. పండుగ పబ్బాలకి తన పుట్టినూరు కామారెడ్డికి ఫ్యామిలీతో సహా వెళ్లి తల్లితండ్రులతో రెండు రోజులు గడిపి వస్తాడు నరేందర్. దసరా పండుగ కోసం రాత్రి కుటుంబంతో సహా వచ్చాడు. ఊరికి రావడానికి సంతోషంగానే ఉంటుంది కానీ, వచ్చిన ప్రతీ సారి వాళ్ళ నాన్న అడిగే ఒకే ఒక ప్రశ్న "సొంతిల్లు ఎప్పుడు కట్టుకుంటావ్" అనే దానికి మాత్రం జవాబు చెప్పలేక సతమయిపోతున్నాడు. ఇప్పుడు తండ్రి నుండి రాబోయే ప్రశ్న అదే. ప్రతీసారీ ఏదో చెప్పి తప్పించు కుంటున్నాడు. కనీసం కొంత ఖాళీ స్థలం అయినా కొందామని నిర్ణయించుకునే లోపు "జర్నలిస్టులకి ఇళ్ల స్థలాలు" అని మంత్రుల నోట, ముఖ్యమంత్రి నోట వినపడగానే, లేని ఆశలు మళ్ళీ చిగురించడం, కొనే ప్రయత్నం విరమించుకోవడం - ఇది నిరంతర ప్రక్రియ అయిపోయింది నరేందర్ లాంటి చాలా మంది జర్నలిస్టులకి. ఇప్పుడు కొనాలన్నా ఆకాశాన్నంటిన భూముల ధర, సమయానికి రాని జీతాల వల్ల కూడా ఆ మాటే ఆలోచించలేకపోతున్నాడు. కానీ ఈ మధ్య వినిన, చూసిన కొన్ని సంఘటనల తర్వాత తప్పనిసరిగా హైదరాబాద్‌లో ఒక చిన్న సొంత ఇల్లయినా ఉండాలని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు, తండ్రి కోరిక కూడా అదే.

"బాబూ, ఆ మధ్య అల్వాల్‌లో ఏదో ప్లాటు చూసినా అన్నావు కదా! ఎక్కడి వరకు వచ్చింది?" తన ఆలోచనలకు భంగం కల్పిస్తూ నరేందర్ అనుకుంటున్న ప్రశ్న మరోరూపంలో రానే వచ్చింది తండ్రి నోటి నుండి.

"లేదు బాపూ, మొన్న జర్నలిస్టు మీటింగ్‌లో సీఎం, జర్నలిస్టులకి ఉచిత స్థలాలు అన్నాడు. జర్నలిస్టు కార్డు ఉన్న అందరి వివరాల దరఖాస్తులు నింపి ఇచ్చాము. స్థలం ఫ్రీగా వచ్చేప్పుడు అప్పు చేసి ఎందుకు కొంటావు అంటుండ్రు దోస్తులు. అందుకే అడ్వాన్సు వాపసు తీసుకున్నాము" తండ్రికి ఇష్టం లేని ఈ సమాధానం అతికష్టం మీద చెప్పుకొచ్చాడు నీళ్లు తాగుతూ.

సమాధానం విన్న వెంకట్రామయ్య ముఖం విచారంతో నిండిపోయింది. ఆయనకు కొడుకు ఆర్థిక పరిస్థితి తెలుసు. ఈ రోజుల్లో ప్రతి ఒక్కరికి కనీసం వంద గజాల స్థలం అయినా ఉండాలని ఆయన ఎప్పటినుండో చెపుతున్నాడు కొడుకుకి.

"మా ఇంటి ఓనరోళ్ళు కూడా మంచోళ్లు బాపూ. ఐదేండ్ల నుండి అడనే ఉంటున్నాము కదా. కరోనా టైంల కూడా కిరాయకు ఇబ్బంది పెట్టలేదు. ఇప్పుడు

కథ

అంత తొందరేమొచ్చింది, సూద్దాం సర్కారు ఇయ్యక పోతదా?'' తండ్రిని సముదాయించాడు నరేందర్.

“కొడకా, మంచి చెడు అనేవి ఎప్పుడూ అట్లనే ఉండవు. పరిస్థితిని బట్టి మారుతాయి. నువ్వు కిరాయి టైంకిస్తున్నావ్ కాబట్టి వాళ్ళు కూడా మంచిగానే చూసుకుంటారు. రేపు రేపు ఏ పరిస్థితి ఎట్ల వస్తదో!'' కొంత అసహనంగా అన్నాడు వెంకట్రామయ్య.

“అరేయ్ నరేందర్, ఇగో వెంకట్ గౌడ్ కల్లు పంపిండు. వచ్చినాక ఒక ఫోనన్న చెయ్యకపోతివేందిరా! కల్లు కోసమయితే ఫోన్ చేస్తవా వానికి'' నిష్ఠూరంగా కల్లు లొట్టితో లోపలికొచ్చాడు నరేందర్ క్లాస్మేట్ రమేశ్.

“ఏ రాత్రి బాగా లేటయ్యిందిరా. జర పాణం సుస్తుండే! లేకపోతె నేనే చెట్లదిక్కు రాక పోతుంటినా పొద్దుగాలనే?'' రమేశ్‌కి ఎదురెల్లి కల్లు లొట్టి తీసుకున్నాడు నరేందర్. ఊరికి వచ్చిన ప్రతిసారి బయటకు వెళ్లే నరేందర్, మొదటిసారి మిత్రులతో బయటకు వెళ్ళకుండా ఇంట్లోనే ఉన్నాడు. తండ్రితో జరుగుతున్న మాటల్ని ఎలా మార్చాలా అని ఆలోచిస్తుండగా మంచి టైము కొచ్చిండు రమేశ్ అని సంబురపడ్డడు.

నరేందర్ కల్లు గ్లాసులోకి ఒంపి తలా ఒక గ్లాసు ఇచ్చిండు.

“ఓ రమేశా! నరేందరొస్తేనే ఇటుదిక్కు కనపడతావ్. అప్పుడప్పుడు రావచ్చు కదా, అమ్మెట్లుందో సూసేది లేదా?“ నిష్ఠూరంగా వంటగది నుండి ఒక ప్లేటులో రమేశ్ కోసం మటన్ ముక్కలేసుకొచ్చింది నరేందర్ తల్లి వెంకటమ్మ.

“ఏ గదేం లేదమ్మా! జర పనిల పడి టైం దొరుకుతలేదు. ఇటొచ్చినప్పుడు తప్పకుండా ఒస్తాలే'' సర్ది చెప్పుకున్నాడు రమేశ్.

“ఇంట్ల ఎదురుచూస్తరు. జంబికి జల్దీ పోదాం. మురళీగాడు, వెంకట్‌గాడు ఆడనే కలుద్దాం అన్నరు. కల్లు తాగి ఆయింత నిదుర పోయేవ్'' కల్లు గ్లాసు పైకి ఎత్తి ఒక్క దమ్ములో మొత్తం తాగి, మటన్ ముక్కలు నోట్లో వేసుకుని

**ఇలాంటి అనుకోని కవరింగ్ లు వస్తాయనే ముందే బయలు దేరాడు. ఒకసారి టైం చూసుకున్నాడు. గంటలో హైదరాబాద్ చేరుతాడు, గచ్చిబౌలి ఇంటినుండి 20 నిముషాలు. గంటకు పైగా ఫ్రీ టైం ఉంది. తొందరేమీ లేదు అని మనసులో అనుకుని మళ్ళీ నిద్రలోకి జారుకున్నాడు.**

నములుకుంటూ, బయటకి అడుగులేసాడు రమేశ్.

“సరే జల్దీ వస్తాలే నాలుగైదు గంటలకి'' ఇంకో సిప్పు కల్లు లాగిస్తూ జవాబిచ్చాడు నరేందర్.

ఇప్పుడు జరిగిన ఈ తతంగం అంతా నరేందర్ ఊరికొచ్చినప్పుడల్లా జరిగేదే. వెంకట్రామయ్య ఇల్లు గురించి అడగడం, రమేష్, వెంకట్ గౌడ్, మురళీ, ఇంకా కొద్ది మంది మిత్రులతో చెట్లల్లకు పొయ్యి ఈతకల్లు తాగి పట్నం ముచ్చట్లు, పల్లెటూరి ముచ్చట్లు చెప్పుకొని రావడం. ఇటొచ్చినప్పుడు ఇంటికొస్తా అన్న రమేశ్, మళ్ళీ నరేందర్ వచ్చినప్పుడే ఇంటికి రావడం అంతా మామూలే.

పూరీలు, మిరపకాయ బజ్జీలు తీసుకొచ్చింది వసుంధర. తిన్న రెండు, మూడు మటన్ ముక్కలకే కడుపు నిండిపోయినట్టనిపించింది నరేందర్‌కి. ఇంకేం తినాలనిపించలేదు కానీ అందరితో కల్సి పండుగ భోజనం తిన్నట్టు చేసి వరండాలో కూర్చున్నాడు. చల్లటి గాలి వీస్తుంటే బాగా నిద్ర పట్టేసింది నరేందర్‌కి. అప్పటికే రెండు సార్లు ఫోన్ చేసిండు రమేశ్. ఒక్క ఫోన్‌కాల్‌కే లేచే భర్త రెండు సార్లు రింగ్ సౌండ్ అయినా లేవకపోవడం కొంత ఆశ్చర్యానికి గురయ్యి నిద్ర లేపింది వసుంధర. అతి బలవంతంగా నిద్ర లేచాడు, కానీ ఇంకా పడుకోవాలని అనిపిస్తుంది నరేందర్‌కి. కొత్త బట్టలేసుకుని ఎప్పుడూ ఫ్రెండ్స్‌ని కలిసే మర్రి చెట్టు సెంటర్ వైపు నడుస్తూ వెళ్ళాడు నరేందర్.

నరేందర్ వెళ్ళేటప్పటికే వెంకట్, మురళీ, రమేశ్ ఇంకా అందరూ ఉన్నారు. ఈ మధ్యనే యాభై ఏళ్ళు పూర్తి చేసుకున్న మురళీ పుట్టినరోజు గురించి మాట్లాడుకుంటున్నారు. “నువ్వు కూడా వస్తే బాగుండేది రా, ఆ రోజు వెంకట్, రమేశ్‌ల హంగామా చూడాల్సింది'' విరగబడి నవ్వుతూ చెపుతున్నాడు మురళి.

“వద్దామనే అనుకున్నా.. కానీ, మీకు తెలువందేముందిరా? మనకు పని ఉన్నప్పుడే ఎమర్జెన్సీ అంటరు. గవర్నర్ ప్రోగ్రాం కవర్ చేసేది ఉండే ఆ రోజే! హెడ్డింగ్ ఫోటో రాలేదా గవర్నర్ని ప్రసంగానికి పిలవలేదని! ఆ ఫోటో తీసిందే నేనే'' సంజాయిషీతో పాటు కొంత గొప్పదనం చాటుకున్నాడు నరేందర్.

“మాకు తెల్సు తియ్యిరా నీ పని గురించి. ఇంతకూ నీ యాభైయవ పుట్టిన రోజుకు మమ్మల్ని పిలవలేదేమిరా?'' అన్నాడు వెంకట్.

“నాకు అంత తీరకెక్కడిదిరా? ఎప్పుడొచ్చిందో ఎప్పుడు పోయిందో కూడా పట్టించుకునేంత టైం ఉండదు'' అన్నాడు నరేందర్. స్వతహాగా నరేందర్‌కి ఈ పుట్టిన రోజుల హంగామాలు అసలే నచ్చవు.

“దావత్ ఇయ్యాల్సొస్తదని అన్ని దొంగ మాటలు చెప్తవ్, మాకు తెల్వదా..'' రహస్యం కనిపెట్టినట్టు పోజు పెట్టాడు రమేశ్.

“ఏ నరేందర్ దావత్ లకెప్పుడన్న ఎన్కకు పోతడా'' సప్పోర్ట్ చేసిండు వెంకట్. ఇంకా ఊరి విషయాలు, పట్నం విషయాలు మాట్లాడుకుని, జమ్మి బంగారం ఒకరికొకరు ఇచ్చుకొని అలాయ్ బలాయ్ తీసుకున్నారు. మిత్రుల మధ్య సరదాగా గడిచింది సాయంత్రం అంతా.

రేపటి నగర జీవితానికి, ఉరుకుల-పరుగుల ఉద్యోగానికి సిద్ధమవుతూ భారంగా సెలవు తీసుకుని ఇంటికి బయలుదేరాడు నరేందర్.

* * *

బస్సులో ఫ్యామిలీతో తిరుగు ప్రయాణం అయ్యాడు నరేందర్ ఉదయం 7 గంటలకి. దాదాపు రెండు గంటల ప్రయాణం.

“నరేందర్.. గచ్చిబౌలి సైబరాబాద్ కమీషనర్ ఆఫీసులో పోలీస్ పరేడ్ గురించి ప్రెస్‌మీట్ ఉంది పదిన్నరకి. నువ్వు, రాజేశ్ ఈవెంట్ కవర్ చేసుకుని రండ్రి” మంచి నిద్రనుండి లేచి చీఫ్ ఎడిటర్ ఫోన్‌ని ఆన్సర్ చేసాడు.

ఇలాంటి అనుకోని కవరింగ్‌లు వస్తాయనే ముందే బయలుదేరాడు. ఒకసారి టైం చూసుకున్నాడు. గంటలో హైదరాబాద్ చేరుతాడు, గచ్చిబౌలి ఇంటినుండి 20 నిముషాలు. గంటకు పైగా ఫ్రీ టైం ఉంది. తొందరేమీ లేదు అని మనసులో అనుకుని మళ్ళీ నిద్రలోకి జారుకున్నాడు.

అనుకున్న సమయానికి గచ్చిబౌలి చేరాడు. అప్పటికే యాంకర్ రాజేష్, నరేందర్ కోసం ఎదురు చూస్తున్నాడు. జరగబోయే ప్రెస్ మీట్, దానికి సంబంధించిన వివరాలు చర్చించు కున్నారు. పక్కనే ఉన్న తోపుడుబండి మీద ఇడ్లీ తినొద్దంరా అని రాజేష్ తీసుకుపోతే చెరో రెండుఇడ్లీలు గబా గబా తినేసి, అప్పటికే సిద్ధంగా ఉన్న కమీషనర్ ఇంటర్వ్యూ కవరింగ్ పూర్తిచేసాడు.

ఫుటేజ్ తీసుకుని ఆఫీసుకి వెళ్ళాలి, కానీ ఇంటికి వెళ్లి కొద్ది సేపు నిద్రపో వాలనిపిస్తుంది. ఇంకో వైపు వామిటింగ్ వచ్చినట్టు అనిపిస్తుంది. ఒకసారి గత రెండురోజులుగా జరిగిన విషయాలన్నీ రివైండ్ చేసికొని ఆలోచించాడు. గత రెండు నెలలుగా కొంచెం అలసినట్టు అనిపిస్తుంది, ముఖ్యంగా ఊరికి పోయినప్పటి నుండి ప్రతి చిన్న పనికి అలసిపోతున్నాడు. ప్రతిసారి ఇంకా నిద్ర పోవాలనిపించింది. ఈ సారి ఫ్రెండ్స్‌తో కల్సి బయటకి కూడా వెళ్ళలేదు ఒక్కసారి జమ్మి కోసం తప్ప. బస్సులో కూడా చాలా నిద్రపోయాడు. తనకేదో జరుగుతుంది, నిర్లక్ష్యం చేయకూడదనుకొని నిర్ణయించు కున్నాడు. శరీరం కొంత విశ్రాంతిని కోరుతున్నప్పటికీ అతికష్టం మీద ఆఫీసుకి బయలుదేరాడు. ఆఫీసులో ఫుటేజ్ డవున్లోడ్ చేసి ఎడిటర్‌కి ఇచ్చి, బాస్ దగ్గర పర్మిషన్ తీసుకుని ఇంటికి వెళ్ళాడు.

తొందరగా ఇంటికి వచ్చిన నరేందర్‌ని చూసి వసుంధర ఆశ్చర్యపోయింది. నరేందర్ విషయం అంతా చెప్పాడు ఆమెకి.

“కొంత ఏజ్ వస్తుంటే అన్ని పదార్థాలు పడవు, ఏదో నువ్వు తిన్నది సరిగ్గా పడలేదేమో!” అనే అనుమానం వ్యక్తం చేసింది. రెండు పారాసెట్ మాల్ గోళీలు ఇచ్చి కొద్ది సేపు నిద్రపోతే అన్నీ సర్దుకుంటాయని భరోసా ఇచ్చింది.

వసుంధర చెప్పింది కూడా కరెక్టే కావచ్చు అని గోళీలు మింగి గంటకు పైగా నిద్రపోయాడు. ఆ తర్వాత లేచి చూస్తే అంతా మామూలుగానే ఉంది. అనవసరంగా ఏదో ఊహించుకున్నాను అనుకొన్నాడు. మరుసటి రోజు యథావిధిగా ఆఫీసుకి వెళ్ళాడు.

★ ★ ★

ఊరికి వెళ్లి వచ్చి ఒకవారం గడిచింది. ఎప్పటిలాగానే ఆఫీసుకి వెళ్లి వస్తున్నాడు. కేంద్రం - రాష్ట్రం మధ్య వరిధాన్యం కొనడం గురించి గొడవ ప్రారంభమైంది. దాని పూర్తి కవరేజ్ నరేందర్‌కి అప్పగించారు ఆఫీసులో. ఆరోజు రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన బంద్‌కు సంబంధించిన కవరేజ్ తీసుకుని ఆఫీసుకి వెళ్లి ఫుటేజ్ అంతా డౌన్లోడ్ పెట్టి డ్యూటీలో ఉన్న ఎడిటర్‌కి చెప్పి ఇంటికి బయలుదేరాడు. సమయం రాత్రి తొమ్మిది అయ్యింది. జర్నలిస్టు ఉద్యోగం కదా, ఎప్పుడు ఫోన్ వచ్చినా పరుగెత్తాలి. కొన్ని సార్లు ఇంటికి చేరుకున్న తర్వాత కూడా మళ్ళీ వెళ్ళాలి. ఆఫీసులో ఎలాంటి ఎమర్జెన్సీ పనులు లేనందుకు లోలోన సంతోషపడుతూ ఇంటి దారి పట్టాడు. మూడు ఫ్లోర్లు దిగుతుంటే ఎందుకో కొంత ఆయాసంగా అనిపించింది. ఇంటికి వెళ్తున్న సంతోషంలో ఇదేమీ పట్టించు కోకుండా బైక్ స్టార్ట్ చేసి వెళ్ళాడు. ఇంకో పది నిమిషాల్లో ఇంటికి చేరతాడు అనేలోపు కళ్ళు తిరగడం ఎక్కువ అయ్యింది. బ్రేక్ వేసి పక్కన ఆపుకోవాల నుకునేంతలోనే బండిపై నియంత్రణ తగ్గింది. వెంటనే బండి ఎడమ వైపు తిరిగి పక్కనే ఉన్న ఎలక్ట్రిక్ స్తంభానికి గుద్దుకొని పడిపోయాడు.

★ ★ ★

కళ్ళు తెరచి చూస్తే హాస్పిటల్ బెడ్ పైనున్నాడు. చుట్టూ భార్య, పిల్లలు చాలా దిగులుగా ఉన్నారు. హాస్పిటల్లో ఎవరు జాయిన్ చేశారో గుర్తు లేదు నరేందర్‌కి.

“అటు వైపుగా వచ్చిన ఇంకొక జర్నలిస్ట్ 108కి ఫోన్ చేసి చెప్పాడట. హాస్పటల్ వాళ్లే నాకు ఫోన్ చేసి చెప్పారు విషయం” కళ్ళు తుడుచు కుంటూ చెప్పింది వసుంధర. తలకి బ్లీడింగ్ ఆపడానికి కట్టు కట్టి ఉంది. ఎలక్ట్రిక్ స్తంభం తగిలి కొంచెం రక్తం వచ్చింది. వసుంధర వచ్చేసరికి తలకి ఎమ్మారై, ఎక్స్ రే, బ్లడ్ టెస్ట్‌లు అన్నీ చేసారు. ఇంకా పరీక్షల రిజల్ట్స్ రాలేదు.

“నేనే పాపిష్టి దాన్ని, మీరు మొన్న కళ్ళు తిరుగుతున్నాయి అన్నప్పుడే డాక్టర్ దగ్గరికి వెళ్ళాల్సింది. ఇంకా నయం పెద్ద ప్రమాదం తప్పింది” నరేందర్ చేతిని పట్టుకుని ఏడుస్తూ అంది వసుంధర.

“ఇప్పుడేమయిందని అంత ఏడుపు. ఏదో చిన్న దెబ్బే కదా!” అని ఓదార్చడానికి ప్రయత్నిస్తున్నాడు నరేందర్, కానీ మనసులో ఎన్నో ప్రశ్నలు, రిపోర్ట్స్ వస్తే కానీ మనసు కుదుట పడేట్టు లేదు.

అంతలోనే రౌండ్స్‌కి బయలు దేరిన డ్యూటీ డాక్టర్ వచ్చాడు.

“ఇప్పటికి అయితే బీపీ, ఈసీజీ లాంటి రిపోర్ట్స్ నార్మల్ గానే ఉన్నాయి. బహుశా మీరు తిన్న ఫుడ్ ఏదో పడలేదేమో! మిగతా రిపోర్ట్స్ కూడా వస్తే రేపొద్దున్నే డిశ్చార్జ్ అవుతారు” అని రిపోర్ట్స్ చూస్తూ చెప్పాడు.

‘డిశ్చార్జ్’ అనే మాట వినగానే ఇద్దరి కళ్ళలో ఒక మెరుపు మెరిసింది. కరోనా కాలం నుండి హాస్పిటల్‌లో అడ్మిట్ అయితే ఆ మహమ్మారి నుండి కోలుకొని డిశ్చార్జ్ కావడం అనేది ఒక కలగానే మారింది చాలా మంది జీవితాల్లో. ఆ హాస్పిటల్ బెడ్డు, ఒక మూలకి చిన్న సోఫా లాంటి దానిపైన వసుంధరకి పడుకో వాల్సివచ్చినా అది ఎంత మాత్రం సౌకర్యంగా లేనప్పటికీ ఇద్దరూ ఆ రాత్రి ప్రశాంతంగా నిద్రపోయారు పొద్దున్నే డిశ్చార్జ్ కావచ్చు కదా అనే సంతృప్తితో!

కానీ, సాఫీగా సాగుతున్న వారి జీవితాల్లో, ఆ ప్రశాంతతకి ఆ రోజే చివరిరోజు అని ఎవ్వరూ ఊహించలేక పోయారు.

★ ★ ★

కొత్త ప్రదేశమయినా ఇద్దరికీ మంచి నిద్రపట్టింది. కాలకృత్యాలు తీర్చుకుని, క్యాంటీన్ నుండి ఇడ్లీ తెచ్చుకుని ఇద్దరూ తిన్నారు. ఏ క్షణాన్నైనా డాక్టర్ వచ్చి రిపోర్ట్స్ ఇచ్చి డిశ్చార్జ్ చేస్తారని ఎదురు చూస్తున్నారు. అంతలోనే ఇద్దరు డాక్టర్లు వచ్చారు కానీ రిపోర్ట్స్ ఏవీ తీసుకురాలేదు. అంతకు ముందు రోజు అడిగిన ప్రశ్నలు అన్నీ మళ్ళీ అడిగారు ఇద్దరు డాక్టర్లు నరేందర్‌ని. ఇంకా కొన్ని టెస్టులు చేయాలి, అలాగే ఇంకొక బ్లడ్ టెస్టు కూడా చేయాలి అని వెంట వచ్చిన కాంపౌండర్‌తో మరింత రక్తం తీసుకున్నారు. అయోమయంలో పడ్డారు దంపతులిద్దరూ. మరిన్ని డబ్బులు కాజేసే డ్రామా అయ్యుంటుంది, అన్నట్టు కళ్ళ తోనే సైగ చేసింది వసుంధర. ఈ కార్పొరేట్ హాస్పిటల్స్‌లో అడ్మిట్ అయ్యాక ఒక్కరోజుకే పంపితే వారికేమి లాభం, కనీసం ఒక వారం రోజులు ఉంచి గానీ పంపరు అన్నట్లు లోలోన శాపనార్థాలు పెట్టుకుంది వసుంధర.

వీల్ చెయిర్‌పై లోపలికి తీసుకువెళ్లి ఎమ్మార్సై, సి.టి స్కాన్ లాంటి టెస్టులన్నీ చేసి రెండు గంటల తర్వాత బయటకు తీసుకు వచ్చారు. బిల్లింగ్ దగ్గర ఎవరో పేషంట్ బంధువులు గొడవ చేస్తున్నారు ఆరోగ్యశ్రీ కార్డు పనికిరాదు అన్నందుకు. నరేందర్‌కి ఆఫీసులో ఇచ్చిన హెల్త్ ఇన్సూరెన్సు కార్డు ఉంది కాబట్టి ముందే డబ్బులు కట్టమని ఎక్కడా డిమాండ్ చేయలేదు. నరేందర్‌కి కొంత అనుమా నంగా ఉంది, ఏదో కీడుని పసిగట్టాడు. వసుంధరకి డాక్టర్లు చేస్తున్న హడావిడి చూస్తుంటే కొంత అయోమయంగా ఉంది.

"అమ్మా మీరు భోంచేసి మీ రూమ్‌లో కూర్చోండి. ఇప్పుడు చేసిన టెస్టు రిజల్ట్స్ వస్తే గానీ ఏమీ చెప్పలేము" విషయమేమీ చెప్పకుండా కూర్చోమనడం విసుగు తెప్పించింది వసుంధరకి. కానీ హాస్పిటల్ కి వెళ్లిన వారెవరయినా వాళ్ళు చెప్పింది వినటం కన్నా చేసేదేముంటుంది?

టివి చూస్తూ, ఏవో మ్యాగజైన్‌లు చూస్తూ గడియారం వైపు చూసింది. సమయం నాలుగు దాటిపోయింది అయినా డాక్టర్ల జాడే లేదు. సమయం గడుస్తున్న కొద్దీ ఇద్దరిలో ఆతృత పెరిగిపోతుంది. ఎదురు చూపులతో ఇంకో గంట గడిచిపోయింది. దాదాపు అయిదు గంటల ప్రాంతంలో ఒక నర్స్ వచ్చి ఇంకో పది నిమిషాల్లో డాక్టర్ వస్తున్నాడు చెప్పింది అని.

"హమ్మయ్య, వాళ్ళకిప్పుడు తీరిన ట్టుంది" అని మనసులోనే కొంచెం రిలాక్స్ అయి నరేందర్ వైపు చూసింది. నరేందర్ మాత్రం మంచి నిద్రలో ఉన్నాడు. డాక్టర్ వస్తున్నాడని చెప్పి నిదుర లేపి, భుజానికి ఆనుకుని పక్కనే నిలబడింది. అయిదు నిమిషాల్లోపే ఇద్దరు డాక్టర్లు వచ్చారు. ఒకాయన హాస్పిటల్ హెడ్, ఇంకొక కొత్త డాక్టరు.

"మీకు ఒక ఇంపార్టెంట్ విషయం చెప్పడానికి మేము ప్రతి టెస్ట్ ని చాలా సార్లు పరిశీలించి, ఇదిగో ఈ స్పెషలిస్టు ని కూడా తీసుకు రావాల్సివచ్చింది. అందుకే ఇంత సమయం తీసుకున్నాము. ఇక్కడ మేము ఏ విషయం అయినా సరిగ్గా నిర్ధారణ చేసుకుని, నిపుణలతో చర్చిం చాకే మాపేషంట్స్ తో చెపుతాం. మేము చెప్పే విషయం మీరు గుండె నిబ్బరం చేసుకుని వినాలి, మీరు ఎలాంటి విషయం చెప్పినా కంగారు పడకూడదు" మాటకు మాటకు మధ్య చాలా సమయం తీసుకుంటూ చెప్పలేక చెపుతున్నట్టు చాలా స్పష్టంగా చెప్పాడు ఒక డాక్టర్. డాక్టర్ చెపుతున్న దాన్ని సమర్థించినట్టుగా ఇంకో స్పెషలిస్టు డాక్టర్ తల ఊపుతున్నాడు ప్రతి మాటకీ.

ఏదో సీరియస్ వ్యవహారమే అని అర్థం అయ్యింది వసుంధరకి, నరేందర్‌కి. గుండెలో ఒక్కసారిగా కెలికినట్టయ్యింది వసుంధరకి. ఇద్దరూ ఒకరినొకరు చూసుకున్నారు, ఆ చూపులకి ఎన్నో అర్థం లేని భావాలు! నరేందర్ చేతిని తన చేతిలోకి తీసుకుని నిలబడింది వసుంధర. "దేవుడా.. ఎలాంటి పరిస్థితినయినా ఎదుర్కొనే ధైర్యం కల్గించు" అని మనసులో దేవుని ప్రార్థించింది. నరేందర్ మాత్రం ఏదో జరుగుతుంది అని నమ్మాడు కాబట్టి కొంత నిబ్బరంగానే ఉన్నాడు, వసుంధర చేతిని గట్టిగా పట్టుకున్నాడు.

"ఈయన డాక్టర్ శేఖర్, ప్రఖ్యాత కాన్సర్ స్పెషలిస్ట్. మీ రిపోర్ట్ స్టడీ చెయ్యడానికే ఇంత దూరం వచ్చాడు. డాక్టర్ ప్లీజ్ ప్రొసీడ్" డాక్టర్ మాటలతో తన ఆలోచనలకు స్వస్తి పలికి నరేందర్ చేతుల్ని మరింత గట్టిగా పట్టుకుని ఎలాంటి వార్త అయినా వినడానికి సిద్ధం అయ్యింది.

"మేము అన్ని రిపోర్ట్స్ చూసి బాగా పరిశీలిస్తే అది లంగ్ కాన్సర్ అంటే ఊపిరితిత్తుల కాన్సర్ అని తేలింది"

ఆ మాట వినగానే ఒక్కసారిగా తన కాళ్ళ కింద నేల బ్రద్దలయినట్టుగా అనిపించింది వసుంధరకి. కళ్ళలో నుండి ఒక్కసారిగా పెద్ద జలపాతంగా కన్నీళ్లు బయటపడ్డాయి. వెంటనే నరేందర్ ని ఆనుకుని పక్కనే కూర్చుండి పోయింది అచేతనంగా. నరేందర్ కళ్ళలో నీళ్లు తిరుగుతున్నాయి, కానీ బయటకి కనిపించని దుఃఖం లోపల పొగుకొస్తుంది. తను ఏదో ఊహించాడు, కానీ కాన్సర్ అని ఎప్పుడో అనుకోలేదు.

"కాన్సర్ అనగానే బయపడాల్సింది లేదు. ఈ రోజుల్లో చాలా ట్రీట్మెంట్స్ వచ్చాయి. కాన్సర్‌ని జయించిన వారు చాలా మంది ఉన్నారు. మీరు ఎంత ధైర్యంగా దీన్ని ఎదిరిస్తే, ట్రీట్మెంట్ కి సహకరిస్తే అంత తొందరగా కోలుకోగలుతారు. మీ పేరు వసుంధర కదా.. అంతా మీ చేతిలో ఉంది. ఆయనకు మీరే ధైర్యం చెప్పాలి. ఇంకా చాలా టెస్టులు చేయాలి, కాన్సర్ ఏ స్టేజీలో ఉందో కనుక్కోవాలి. సరయిన ట్రీట్మెంట్‌కి ప్లాన్ చేస్తే మనం కాన్సర్‌ని జయించవచ్చు" కొంచెం ధైర్యం నింపడానికి కొన్ని మాటలు చెప్పాడు డ్యూటీ డాక్టర్.

*(మిగతా వచ్చే సంచికలో...)*

వ్యాసం

# తెలంగాణ ఉద్యమ సాహిత్యంలో కవయిత్రుల పాత్ర

స్త్రీ సాహితీ చైతన్యాన్ని తెలిపే వ్యాసం...



డా॥ వంగరి త్రివేణి
99514 44803

సాహిత్యంలో ప్రత్యేక ప్రాంతీయ వాదం అనేది సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక, భాష, కళారంగాల్లో పురోభివృద్ధిని కాంక్షించింది. తద్వారా స్థానీయమైన అస్తిత్వాన్ని పెంపొందించు కోవడానికి అనేక ప్రక్రియలను అనుసరించింది. కథ, నవల, కవిత్వం, విమర్శ, పరిశోధన వంటి రచనా రూపాలలో తన వాదాన్ని బలంగా ప్రతిష్ఠించింది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కాలంలో సాహిత్యం ప్రజలకు అత్యంత చేరువలోకి వచ్చింది. తెలంగాణ భాషాశైలిని ఉపయోగించి రాష్ట్రావశ్యకతను తెలియబరిచింది. తెలంగాణ జీవితం, సంస్కృతి నేపథ్యంలో వచ్చిన ఉద్యమ స్వరూపం కవిత్వం, కథా ప్రక్రియల్లో అతి సహజంగా ప్రతిబింబింపబడింది. స్వచ్ఛమైన ప్రాంతీయత మహిళల సాహిత్యంలోనే అభివ్యక్తీకరించబడింది.

### కవితా ఉద్యమం...

తెలంగాణ స్త్రీల కవిత్వం అత్యంత మార్దవమైంది. స్త్రీల స్వరూప స్వభావాలకు తగినట్లుగానే వారి కవితా రచన సుకుమారంగా, సుందరంగా ఉంటుందని ఇప్పటి వరకు మనకు తెలిసిన విషయం. కాని గాయాలే గేయాలై! లో అందుకు భిన్నంగా స్త్రీలకవిత్వం కన్పిస్తుంది. కొంగు నడుంకు కట్టుకొని, చీర చింగులు పైకి ఎగదోపి, వేలాడుతున్న శిగనొకసారి సవరించుకొని, చేతులకున్న గాజులు గట్టిగనుకొని నిలబడ్డ అక్కల్లాగున్నారు "గాయాలే... గేయాలై!" కవయిత్రులు. ఒకటేమిటి తెలంగాణ నిండా ఉన్న సమస్యలన్నింటిని ఎలుగెత్తి చాటారు, కలమెత్తి రాశారు. తెలంగాణ ఉద్యమం, పోరాటం మీద తెలంగాణ విద్య, వైద్య, ఉద్యోగ అవకాశాల మీద తెలంగాణ చెరువులు, భూములు, గనుల మీద తెలంగాణ సమాజం, చరిత్ర, సంస్కృతి మీద తెలంగాణ పల్లె, వ్యవసాయం, కులవృత్తుల మీద తెలంగాణ హైదరాబాదు మీద, తెలంగాణ ప్రాణత్యాగాల మీద ఉత్తుంగ స్వరాన్ని పలికించారు. అన్యాయాన్ని ఎదిరించారు.

ఈ కవితా సంకలనానికి సంపాదకత్వం వహించిన వై. లక్ష్మీవాసన్ (రాజీవ), విజయకుమారి దెంచనాల (జ్వలిత), అమృతలత రాసిన ముందుమాటల్లో తెలంగాణ ఉద్యమ చైతన్యదీప్తి అధికంగా కనిపిస్తుంది. "తెలంగాణ అస్తిత్వవేదనలో స్త్రీల గొంతులు" అనే శీర్షికన కవితా సంకలనానికి డా॥ ముదిగంటి సుజాతారెడ్డి విమర్శనాత్మక విశ్లేషణ చేశారు. "ఇవి స్త్రీల గొంతులు. కవయిత్రుల ఆవేదన. అస్తిత్వ వేదన. ఇంతకుముందు "పొక్కిలి", "మత్తడి" వచ్చాయి. వాటిల్లో కవయిత్రులకు ఎక్కువ స్థానం దొరకలేదు. ఇప్పుడు ప్రత్యేకంగా స్త్రీల మనోభావాల అభివ్యక్తితో ఈ "గాయాలే గేయాలై!" కవితల సంకలనం వచ్చింది. దీనిలో అరవైమంది కవయిత్రుల కవితలు న్నాయి. అన్నిటి వస్తువు ఒక్కటే. తెలంగాణ మీద అభిమానం "తెలంగాణ మాది మాకు కావాలనే తపన! ఆక్రోశం!" (పుట. 9) అంటూ సుజాతారెడ్డి తెలంగాణ ఉద్యమంలో స్త్రీల ఉత్తేజాన్ని, చైతన్యాన్ని తెలిపారు.

మొదటగా తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి చెందిన కవితలను పరిశీలిస్తే అందులో షహనాజ్ ఫాతిమా రాసిన కవిత 'అవసరం'

### ఆర్థిక పురోగతికి ఏకైక మార్గం తెలంగాణ...

"చేతి నిండా పనికోసం కావాలి
తెలంగాణ,
కనీసావసరాలు తీరడానికి కావాలి
తెలంగాణ,
బుద్ధి వికాస విద్య కోసం అవసరం
తెలంగాణ,
ఇహపర జ్ఞానాభివృద్ధికై సాధించాలి
తెలంగాణ,
సామాజిక చలనానికై పొందాలి
తెలంగాణ,
ప్రాణుల దప్పిక తీరడానికి తప్పనిసరి
తెలంగాణ,
సమ్మిళిత సంస్కృతి పునరు జ్జీవనం
తెలంగాణ,

మరుగున పెట్టిన చరిత్ర జ్ఞాపకానికి తెలంగాణ" (పుట -34)

ఈ కవితలో సామాజిక అంశాలన్నిం టికి, వాటి పురోభివృద్ధికి తెలంగాణ ఎంత అవసరమో కవయిత్రి స్పష్టంగా తెలిపారు. తరతరాల భేదాలు పోయి ఏకత్వాన్ని సాధించాలన్నదే తన లక్ష్యంగా చెప్పు కొచ్చారు.

సంస్కృతి విషయానికొస్తే - ఇందులో తెలంగాణ స్త్రీల కట్టుబొట్టు గూర్చి వసంత సుబ్రహ్మణ్యం తన కవిత "ఆనాటి అందాలు"లో వర్ణించారు. భారతదేశంలో తెలంగాణ స్త్రీలకు ఉన్న ప్రాధాన్యత, గౌరవాన్ని కొనియాడారు.

*"తెలంగాణ మహిళల విశిష్టతకు సాటిలేని ప్రాంతం!*

*చేతిపనులకు మన మహిళలకే ప్రథమ కిరీటం"* (పుట-38)

అంటూ 'సుగాలి' చేతి కౌశల్యం గూర్చి వర్ణించారు. ఆ మహిళలు ధరించే లంగా-రవికె వాటికి గల రంగుదారాల అద్దాలు, పూసలు, గవ్వలు వేలాడే చున్నీ మెయలు వంటివి చక్కగా కవితలో తెలియజేశారు. ఇంకా చేతివృత్తులు, వాటి విలువ, ప్రయోజనం వివరిస్తూనే చేతివృత్తుల స్థానంలో నేడు విరివిగా ప్లాస్టిక్, పాలథీన్ కవర్లు వాడుతున్న క్రమం వాటి నుంచి కలిగే దుష్పరిణామాలను వెల్లడించారు.

శక్తిస్వరూపిణి స్త్రీ. చారిత్రక స్త్రీల విషయం మనకు నిర్మల ఆంజనేయులు రచించిన "ఎవరమ్మా!?" కవితలో తెలుస్తుంది.

*"మేడారం సారలమ్మవా - సమ్మక్కవా*
*కాకతీయ కిరణం రుద్రమ రౌద్రానివా*
*డిచ్పల్లి దారికాచే దేవీ దుర్గమ్మవా*
*మేడ్చల్ అర్ధనారీశ్వరుని ఆదిశక్తివా*
*ఎవరమ్మా - నీవెవరమ్మా!?"* (పుట-47)

ఆంధ్ర - తెలంగాణల మధ్య ఎంత వ్యత్యాసం ఉందో టి. కవితా దివాకర్ కవితలో కనిపిస్తుంది. "ఒంటె - ఒనరు"లో

*"మొన్న... ఇల్లు అద్దెకిస్తే నిన్న... ఇల్లే మాదంటూ*
*ఒనర్ని బయటికి పంపిన*
*'ఒంటె'లయ్యారు!"* (పుట-57)

అంటూ ఆంధ్రవాళ్ళ స్వప్రయోజనాలను ఎండగట్టారు. ఏకు - మేకై వచ్చి నాటు కొనిపోయిన విధానాలన్ని చాలా స్పష్టంగా వివరించారు. తరతరా లుగా వారసత్వాన్ని సుస్థిరం చేసుకొని అధికారం చెలాయించిన విధానాన్నంతా వెల్లడించారు.

స్పృత్యర్థం గల కవితలలో మొదటగా చెప్పుకొనేది అనిశెట్టి రజిత కవిత "ఆత్మగల్ల తల్లి...". ఆమెనే ఆచార్య పాకాల యశోదారెడ్డి. యశోదారెడ్డి జీవితాన్ని, రచనలను ఈ కవితలో వర్ణించారు. ఆమె రచనలోగల తెలంగాణ ఆత్మగౌరవం, జాతిపౌరుషం తెలంగాణ భాషా సాంస్కృతిక సౌందర్యం వంటివి కవితాత్మకంగా అనిశెట్టి రజిత వర్ణించారు.

*"తియ్యని జానపలుకుల అవ్వ*
*బుక్క బుక్క నోటికి అందిన కమ్మని బువ్వ*
*నా ఎడ్డితల్లి బొండుమల్లె ఎచ్చుమ్మా*
*ఎడతెగని ముచ్చట్లు పందిరి కింద*
*పలుకుబడుల బడి చెప్పిన పంతులమ్మా..."* (పుట-35)

అంటూ యశోదారెడ్డి తెలంగాణ రాష్ట్రం కోసం పడినపాట్లను తెలియ జేశారు. సంస్కృతి పునరుజ్జీవనంలో తెలం గాణ ప్రత్యేకతకు ప్రాధాన్యం వహించిన యశోదారెడ్డి ఆలోచనలను, ఆశయాలను ఈ కవితలో గమనించవచ్చు.

"కనిపించని గొడ్డలి - మాయమైన చెట్టు" కవిత ఈ సంకలనంలో అత్యంత ప్రాచుర్యం పొందింది. ఇది సెజ్లకు సంబంధించిన కవితా వస్తువు. తెలంగాణ ప్రాంతాన్ని నిర్జీవం చేసే ఒక అధికార ప్రక్రియ సెజ్. దాని వల్ల నిర్వాసితులైన ప్రజల దీనస్థితి నిస్సారమైన భూసారం - పచ్చదనాన్ని కోల్పోయిన పల్లెపట్టు ఈ కవితలో కనిపిస్తుంది. మహబూబ్ నగర్ జిల్లాలోని పోలెపల్లి గ్రామవాసులు పల్లెల్లో సెజ్ లకు వ్యతిరేకంగా ఉద్యమం చేశారు. అందులో భాగంగా నిరవధిక ధర్నా చేస్తున్న రైతులకు ఆసరాగా ఉన్న చెట్టును కంపెనీ వాళ్ళు కొట్టివేసినప్పుడు, అది చూసి వలవలా ఏడ్చిన గంగమ్మకు అంకితంగా ఈ కవితను విరసం సిటీ కన్వీనర్ గీతాంజలి రచించారు. చెట్టు నీడనే వారి జీవనంగా చేసుకొని రాత్రింబవళ్ళు ఉద్యమం సాగించిన తీరును ఈ కవిత వెల్లడిస్తుంది. చెట్టు కొమ్మ, గూడు, చివురు, పూవు, వికసించని మొగ్గ, రాలిన పండుటాకు, వట్టిపోయిన పూవు, పుచ్చిపోయిన కసిగాయ ప్రతీకలుగా ఇందులో స్వీకరింపబడ్డాయి.

*"చెట్టు గూటిలో రామచిలుకనై*
*ఇల్లు కట్టుకోవాలనిపిస్తోంది!*
*పోని - మరణం తర్వాతైనా*
*తన నీడన ఉన్న భూమి గుండెలో చోటిస్తే*
*ఈ చెట్టుకి పూవునై పూయాలని అనిపిస్తుంది*
*ఈ చెట్టంటే ఎందుకింత ప్రేమ నాకు!*
*ఈ చెట్టు ఎన్నెన్ని నినాదాలు ప్రతిధ్వనించిందనీ!"* (పుట - 57)

అంటూ చెట్టు రైతు ఉద్యమానికి ఊపిరి అయిన తీరును కవయిత్రి వర్ణించారు. ఆకు ఆకులో అగ్నికణాలను మోస్తూ వచ్చిందని చెపుతూ చెట్టు, రైతు, భూమి ఒక్కటే అన్న నినాదాన్ని ధ్వనింపజేశారు.

ఓటు మీడియాకు చెందిన 'కీలెరిగి...'

**హైదరాబాద్ సిర్ఫ్ తెలంగాణయే! కదా. 1956-69 మధ్య జరిగిన పరిణామాలను ఒక చక్కని సన్నివేశానికి జోడించి విశ్లేషించారు. 'గబ్బిలాలు' అనే కవితలో వి. ప్రభాదేవి. శ్రీకృష్ణ కమీషన్ హైదరాబాద్ మీద చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకత కూడా ఈ కవితలో కనిపిస్తుంది. సీమాంధ్ర వాళ్ళు తెలంగాణ కు వచ్చి అంతా మాదేనని, అన్ని ఉద్యోగాలు పొంది, అన్ని అధికారాలు అనుభవించి చివరకు పొమ్మంటే హైదరాబాద్ను ఒంటరి చేయడానికి చూసిన ఎత్తుగడను ఈ కవిత పటాపంచలు చేస్తుంది.**

వ్యాసం

కవితను విజయ రచించారు. ఈ కవితలో ప్రభుత్వ శాఖలపైన ప్రతిఘటన తెలిపారు. ఉద్యమాలు, ధర్నాలు, బంద్ లు, రాస్తారోకోలు చేయడమే కాదు ఓటు వేటుతో గద్దె దించుతామనే ధిక్కార స్వరాన్ని వినిపించారు. ఉద్యమంలోకి వచ్చిన విద్యార్థులు, వారి బంగారు బాటకు ఇది సోపానమని ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా నిజాలను మాత్రమే ప్రస్తావించాలని ఈ కవితలో ప్రస్తావించారు.హైదరాబాద్ సిర్ఫ్ తెలంగాణయే! కదా. 1956-69 మధ్య జరిగిన పరిణామాలను ఒక చక్కని సన్నివేశానికి జోడించి విశ్లేషించారు. 'గబ్బిలాలు' అనే కవితలో వి. ప్రభాదేవి. శ్రీకృష్ణ కమీషన్ హైదరాబాద్ మీద చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకత కూడా ఈ కవితలో కనిపిస్తుంది. సీమాంధ్ర వాళ్ళు తెలంగాణ కు వచ్చి అంతా మాదేనని, అన్ని ఉద్యోగాలు పొంది, అన్ని అధికారాలు అనుభవించి చివరకు పొమ్మంటే హైదరాబాద్ను ఒంటరి చేయడానికి చూసిన ఎత్తుగడను ఈ కవిత పటాపంచలు చేస్తుంది.

తెలంగాణ పండుగలకు సంబంధించి డా॥ వి. త్రివేణి కవిత రచించారు. తెలంగాణ అస్తిత్వానికి మారురూపమైన బతుకమ్మ, బోనాల పండుగలను గూర్చి వర్ణించారు. పల్లెల్లో కనిపించే ఆప్యాయత, బంధుమిత్రుల సందడి, కలిసిమెలిసి ఉండే కుటుంబాలు వంటివి ఈ కవితలో కనిపిస్తాయి. బతుకమ్మను తీరొక్క పువ్వు తెచ్చి పేర్చే విధానాన్ని ఆ పువ్వుల యొక్క రంగు రంగుల కాంతులు, వర్ణాలు ఆ పువ్వుల సుకుమారత్వం ఆడపడుచుల ప్రతిరూపంగా వెలిగే పువ్వుల అందం వంటివి ఎంతో ఆహ్లాదంగా వివరించారు. బతుకమ్మ ఆట - పాటలు ఆటల్లోని చప్పట్లు - పాటల్లోని కథలు కలిగి ఈ కవిత మనలను మంత్రముగ్ధులను చేస్తుంది.

*"గునుగు పువ్వు గూడంత కూడింది.*
*తంగేడు పువ్వు తడికంత తట్టింది.*
*ముద్దబంతి పువ్వు మురిపెంగ*
*మొత్తింది ముత్యాల పువ్వు ముచ్చటగ ముట్టింది.*
*బీరంకె పువ్వు బిరుసుగా పట్టింది*
*బంగారు బతుకమ్మ సింగారమయ్యింది!*
*బతుకమ్మ అందం సృష్టికే బంధమయ్యింది!!"* (పుట - 90)

ఈ కవితలో ఇంకొక పండుగ బోనాలు. బోనం శక్తిని, జ్యోతిని, అమృతత్వాన్ని కవయిత్రి స్పష్టంగా వెల్లడించారు. ప్రకృతికి ప్రతిరూపంగా బోనం కాంతులను ప్రతిబింబింపజేశారు. వివిధ గ్రామ దేవతలను, వారి వారి స్వగుణాలను, వారికి భక్తులు చెల్లించే మొక్కుబడులను ఈ కవితలో తెలుసుకోవచ్చు.

*"బోనంలో పెట్టిన పచ్చన్నం*
*శక్తిమాతకు పరమాన్నం*
*బోనమొక అక్షయపాత్ర!*
*జ్యోతి ఒక ఆరని జ్వాల!!"* (పుట-92)

విజయ దామోదర స్వామి 'మాతృమూర్తికి నివాళి' అనే కవితలో తెలంగాణ కుటుంబ జీవన విధానాన్ని తెలిపారు. ఇది వారి కుటుంబానిదే అయినా, దాదాపు తెలంగాణ పల్లెల్లో కనిపించే కుటుంబం లాగా, పరిచయం ఉన్న కుటుంబం లాగా అనిపిస్తుంది.

తెలంగాణతల్లికి చెందిన కవిత తుర్లపాటి లక్ష్మి రచించింది "నేను నగెయాల్ల". తెలంగాణతల్లి ఆత్మఘోష ఈ కవితలో కనిపిస్తుంది. ముల్కి ఉద్యమం, చదువులు, ఉద్యోగాలు, భూములు, నీళ్ళు వంటి వాటికి చెందిన విషయాల ప్రస్తావన ఇందులో ఉంది. "మా చదువులు మేం జదువుకుంటం, మా కొలువులు మేం జేసుకుంటం, మా తొవ్వ మేం జూసుకుంటం" అంటూ కవయిత్రి తన ధిక్కార కవితాస్వరాన్ని వినిపించారు.

తెలంగాణ ఉద్యమానికి, పోరాటానికి చెందిన కవితలు ఈ సంకలనంలో చాలా ఉన్నాయి. సుదీర్ఘకాలం పాటు ఉద్యమ ప్రభావం కవయిత్రుల మీద చాలా ఎక్కువగానే చూపింది. ఇందులో అన్ని కవితలు తెలంగాణ ఉద్యమాన్నే చిత్రిస్తున్నాయి. కొన్ని స్త్రీల మీద, తెలంగాణ సామాజిక, చారిత్రక, సాంస్కృతిక, విద్య, వైద్య, జానపద కళలు, పండుగల మీద ఉన్నా బాహ్యాంతర్గత ప్రభావాన్ని తెలంగాణ ఉద్యమం కనబరుస్తుంది. ఈ నేపథ్యంలో రచించబడిన కవితలను కొన్నింటిని పరిశీలిద్దాం - 'కాలజ్ఞానం' అనే కవితలో గోగు శ్యామల తెలంగాణ ఉద్యమ రూపురేఖలను వివరించారు. అన్యాయమైన తెలంగాణ స్థితిగతులను, సెల్కలు ఎడారి అయిన విధానాన్ని తెలియజేశారు.

*"చాకలి ఐలమ్మ తెగింపు*
*యాదవ సంగెం లక్ష్మీబాయి నీతి*
*మాదిగ సదాలక్ష్మి నాయకత్వం*
*మాల ఈశ్వరీబాయి పౌరుషం"*

వంటివి తెలంగాణ తరుణికి మెండుగా ఉన్నాయని కవయిత్రి ధీమా వ్యక్తం చేశారు.

'తెగించి కొట్లాడుడే' అన్న కవితలో తిరునగరి దేవకీదేవి

*"అచ్చమాంబనై ఆయుధం పట్టిన దాన్ని*
*పాలకుర్తి అయిలమ్మనై*
*నా పాలు గింజల్ని దక్కించుకున్నదాన్ని*
*పోరాటమే ఊపిరిగా వడిసెలతో*
*శత్రువును ఉక్కిరి బిక్కిరి చేసినదాన్ని"*

అంటూ తెలంగాణ ఉద్యమ పంథాను వివరించారు. తెలంగాణాలో జరుగుతున్న అక్రమాలను, నీళ్ళులేక - నిధులందక రైతులు పడుతున్న అగచాట్లను, ఆంధ్రుల దురాక్రమణలతో కొనసాగిస్తున్న వ్యాపారుల లబ్ధిని పేర్కొన్నారు.

డా॥ ఆడువాల సుజాత కూడా 'తెలంగాణ తల్లి ఎత' అంటూ తన కవితలో

*"అడ్డమొచ్చినోన్ని*
*అడ్డంగా నరుకుతం*
*తెలంగాణా పొద్దుపొడుపు*
*వచ్చే దాకా పోరాడుతాం"* అంటూ

తెలంగాణ ఉద్యమ గొంతుకను వినిపించారు. 'సమరాంగన' అంటూ తెలంగాణాతల్లిని తన కవితలో ప్రతిక్షేపించారు లలితాదేవి. తెలంగాణ మహిళలు ఓరుగల్లు భద్రకాళి,

రుద్రాంబిక, ఝాన్సీరాణి శ్రీవారిని కీర్తిస్తూ వారు

"ఉద్యమాలకు బాసటగా నిలుస్తున్నారు
ఉద్యమించే వారికి ఊపిరి పోస్తున్నారు"

అని నారీశక్తిని ప్రేరేపించారు.

తెలంగాణ చారిత్రక ఘట్టాలను ఆధారంగా చేసుకొని వచ్చిన కవితలు ఈ సంకలనంలో ఉన్నాయి. మొదటగా "కాకతీయుల ప్రతాపం - సమ్మక్క సారక్క శౌర్యం" అనే కవితలో డా॥ కె. లావణ్య కాకతీయుల సామ్రాజ్యాన్ని, ఓరుగల్లు కోటను, సమ్మక్క అవతరణను, పడిగిద్దరాజు పరాక్రమతను, రాజపుత్రి సారలమ్మను అశేషంగా కీర్తించారు. కాకతీయులకు చెందిన గాథలను, సమ్మక్క సారలమ్మల వీరత్వాన్ని అత్యంత నైపుణ్యంగా కవితా గానం చేశారు.

*మూఢనమ్మకాల నుంచి*
*"మేడ రాజ్యగూడాన్ని*
*కాపాడిన శక్తిమాత!*
*సమ్మక్క పడిగిద్దరాజు*
*పుణ్యదంపతుల ముద్దులపట్టి*
*సారలమ్మ రాజపుత్రి!!*
*సమ్మక్క యుక్తి*
*శక్తియుక్తుల దైవత్వం!*
*మేడారం సౌభాగ్యం."* (పుట - 62)

అంటూ సమ్మక్క, సారలమ్మల మహిమలను, భక్తులు సమర్పించే నల్లబంగారాన్ని అత్యంత అతిశయంగా కవయిత్రి ప్రస్తుతించారు. జాతర ఆద్యంతాలు ఈ కవితలో వర్ణించబడ్డాయి. కాకతీయుల సామ్రాజ్యాన్ని కీర్తించిన విదేశీ రాయబారులు కూడా ఇందులో కనిపిస్తారు.

చారిత్రక నేపథ్యాన్ని పురస్కరించుకొని "మన తెలంగాణ" కవితలో నెల్లుట్ల రమాదేవి

"ఎన్ని పోరాటాల్ని చూసిందో
ఎన్ని ఆరాటాల్ని మోసిందో
ఎన్ని కష్టాలను కాసి
చరిత్రకెక్కిన ఈ నేల
ఎన్ని అసువుల్ని బాసిందో" అంటూ

కాకతీయుల రుద్రమదేవి, సమ్మక్క సారలమ్మ, ఐలమ్మ, జాయప సేనాని, సర్వాయి పాపన్న, కొమురం భీం, గోల్కొండ నవాబులు, రామదాసు, దాశరథి సోదరులు, సినారె, సుద్దాల అశోక తేజ, గోరటి వెంకన్న, అందెశ్రీ, చంద్రబోసు, చుక్క సత్తయ్య, సుద్దాల హనుమంతు, కాళోజీ, గద్దర్, భువనగిరి కోట, యాదగిరి గుట్ట, భద్రాచలం, వేయిస్తంభాలగుడి, నాగార్జున సాగర్, తెలంగాణ సంస్థానాలు వంటి కవి, గాయక, కట్టడాల చారిత్రక విశేషాలను వెల్లడించారు.

ప్రత్యేకమైన అంశంగా ఈ కవితా సంకలనంలో కనిపించేవి ప్రాణత్యాగాలు. తెలంగాణ బిడ్డలు వందలాది మంది అమరులైతే ఆవేదన చెందిన కవయిత్రులు తమ కలంలో కన్నీళ్లను నింపుకున్నారు. కన్నీటి చుక్కతో తెలంగాణ దుఃఖాన్ని రూపుగట్టారు. అమాయకుల బలిదానాలకు చలించిపోయిన తెలంగాణ కవయిత్రులు ప్రభుత్వపు మొండి వైఖరిని ఎండగట్టారు. కిరణ్ బాల రచించిన "ఆ రోజుల కోసం...!" కవితలో -

*వాళ్లకి "ప్రాణం" ఎందుకు చేదయ్యింది?*
*వాళ్లకి "బతుకు" అగ్గిపుల్లెందుకయ్యింది?*
*వాళ్లకి "బతుకు" నిలువెల్లా కాలి బూడిద ఎందుకయ్యింది?* (పుట -40)

అంటూ ఆత్మహత్యల వెనుక ఉన్న అనేక ప్రశ్నలను లేవనెత్తారు. రణానికైనా, మరణానికైనా తెలంగాణ వీరుడు భయపడడనే విషయాన్ని ఈ కవిత ద్వారా మరొకసారి గుర్తుచేశారు. కాని ఆత్మహత్యల వల్ల తెలంగాణ రాదని, చావు పేరెత్తకుండా 'ప్రమాణం' చేయమని యువకులను ప్రాధేయపడ్డారు.

ప్రాణత్యాగాల మీదనే "ఒక పోరాటం వేల వేల గాయాలు" అని శైలజామిత్ర "మా జోలికొస్తే..." అని మేరీ కుమారి మాదిగ వంటి కవయిత్రులు కవితలు రచించారు. తెలంగాణ స్త్రీ, వారి తెగువ, శక్తియుక్తులు వంటి వాటిపై కవితలు ఈ సంకలనంలో చాలానే ఉన్నాయి. అదే విధంగా స్త్రీల మీద జరుగుతున్న అన్యాయాలను ఎదిరించడానికి కవయిత్రుల చేతులన్నీ ఏకమయ్యాయి.

సుజన "అణుకువ గల అమ్మాయి", డా॥ తెన్నేటి సుధ "ఉద్యమం ఉప్పెనగా లేస్తే", రజనీ "కలాలు - వారెవ్వా!", శిలాలోలిత "జీవనతత్త్వం", టి. లీలా "నిన్ను " నువ్వే మార్చుకో", సస్య "నేను మనిషినికానా?", అరుణశ్రీ "శోకించకు", చల్లపల్లి స్వరూపరాణి "క్షుద్రదేవత" వంటివి స్త్రీల మనోధైర్యాలను, సాహసాలను కీర్తిస్తూ రచించిన కవితలు.

*"గుండె నట్టనది మధ్యన*
*ఏళ్ళకేళ్ళుగా తవ్వుకుంటున్న*
*ఈ దిగుడు బావి*
*ఎన్ని జీవనది ప్రవాహాల్ని*
*తనలో ఒంపుకుంటుందో"* (పుట - 45)

ఇది "ఎదురుచూస్తూ..."లో స్వాతి శ్రీపాద రచించిన పంక్తులు. విషాదమైన స్త్రీ జీవన పార్శ్వాలను తన కవితలో స్పృశించారు.

ఈ సంకలనంలో భాషాపరంగా ప్రత్యేకంగా కనిపించే కొన్ని కవితలు న్నాయి. అవి తెలంగాణ ఉద్యమాన్ని, సంస్కృతిని, సమాజాన్ని, రాజకీయాన్ని చిత్రించేవే అయినా భాషకు పెద్దపీట వేశాయి. అందులో ముఖ్యంగా జ్వలిత రాసిన "గచ్చపొదలచిచ్చు", జూపాక సుభద్ర రాసిన "డప్పుడప్పుల్లతో దండోరేసే నా రోజెన్నడో", జి. విజయలక్ష్మి రాసిన "నాక్కాత్తగీరే" శారదా హన్మాండ్లు రాసిన "సావకు బిడ్డా", సంగీతరాణి రాసిన "హిమ్మతితోని..." వంటివి చెప్పుకోదగినవి.

*"సదువుకొన పట్నంలున్నడు బిడ్డ*
*ఎయిల బిడ్డలంత పోరాటం చేస్తుండ్రు*
*లారీలకు ఊపులిచ్చి కాలే కడుపులతో*
*అగ్గోలె రగిలి పోతుండ్రు"* (పుట-143)

అంటూ తెలంగాణ భాషకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు 'సావకుబిడ్డా' కవితలో శారదా హన్మాండ్లు. తెలంగాణ జీవద్భాష, వైవిధ్యభరితమైన తెలంగాణ భాష తెలుగు భాష నుంచి వేరు పడింది. భాషా

ప్రత్యేకతను ఈ కవిత పొందుపరు చుకున్నది. భాష అస్తిత్వాన్ని సుస్థిరం చేసింది.

ఇంకా ఇందులో కొన్ని కవితలు ఫ్లోరైడ్ సమస్య, గల్ఫ్ సమస్య, ఖనిజసంపదల దుర్వినియోగం, దొర దౌర్జన్యం వంటి విషయాలకు చెందినవి ఉన్నాయి.

"నీళ్ళు అంతటా ఉంటాయి గాని
విషం కలిసిన ఫ్లోరోసిస్ జలధారలు
ఇక్కడ ప్రాణాలు తీస్తాయి" (పుట-72)

అంటూ "గత్యంతరం లేదు" కవితలో ఎన్. అరుణ వ్యక్తంచేశారు. గోదావరి - కృష్ణమ్మ జలధారలు స్వచ్ఛమైనవే అయినా, తెలంగాణ గడ్డకు శాపంగా తయారైన ఫ్లోరోసిస్ సమస్య అధికారుల అలసత్వం వల్లనే ప్రబలిందని గుర్తు చేశారు.

ఖనిజ సంపదను గూర్చి "శల్య రాజకీయాల్ని నమ్మే ఎర్రిబాగోల్లంకాదు" అనే కవితలో కందాల శోభారాణి, గల్ఫ్ సమస్యను గూర్చి "కాటిసుకం" కవితలో కొండెపూడి నిర్మల, దొరల దౌర్జన్యాన్ని ఎదిరిస్తూ "ఏది నా తెలంగాణ" కవితలో తమ్మెర రాధిక నినదించారు.

చివరగా ఈ కవితా సంకలనంలో ప్రత్యేక శైలిని ప్రకటించిన కవితలు న్నాయి. ఉయ్యాల - కోల్ పదములతో కూడిన జానపద బాణీకి చెందిన, పాటలాగా సాగే గేయానికి చెందిన కవితలున్నాయి. డా॥ వి. శోభ రచించిన "నా తెలంగాణా" కవితలో పాటను తలపించే విధంగా గేయగతి కనిపిస్తుంది.

"తెలంగాణా పల్లెలన్నీ
పోలీసోళ్ళ షహరులాయె!
గోదావరి కృష్ణమ్మలు
వాకిట్ల పారుతుంటే-
అరె, తెలంగాణ భూములన్నీ
ఎందుకిట్ల ఎండిపోయె?" (పుట - 105)

అంటూ ఎనిమిది చరణాలతో ఈ గేయం నడుస్తుంది. పల్లవి-అను పల్లవులు కూడా ఇందులో ఉన్నాయి. గాన సరణి అత్యంత గంభీరంగా ఉంటుంది తెలంగాణ సమస్యలన్నింటిని మన ముందుంచుతుంది.

"బతుకమ్మా- బతుకుమ్మాకోల్!" అంటూ జి. శ్యామల, "ముగ్గురు పెండ్లాలం ఉయ్యాలో... మా మొగనికి మేము, ఉయ్యాలో!" అంటూ శిరీషారాణి కవితలల్లారు.

ఈ విధంగా ఒకే గొంతుకతో - ఒకే స్వరంతో తెలంగాణ ఉద్యమంలో మేము సైతం అంటూ అరవై మందికి పైగా కవయిత్రులు "గాయాలే.. గేయాలై!" ద్వారా బయటకొచ్చారు. మూకుమ్మడిగా గళమెత్తారు. ఇప్పటి వరకు స్త్రీలు అనేక ఉద్యమాలలో, పోరాటాలలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. చరిత్రను తిరుగరాశారు. కొందరైతే ఉద్యమ వీరులకు వెన్ను దన్నుగా ఉండి ఆత్మ స్థైరాన్ని ఇచ్చారు. చరిత్రలో స్త్రీలు లేని ఉద్యమం లేదు. అవే జీవ-సత్వాలను కూడగట్టుకొని నేటి కవయిత్రులు కవితాపరంగా తెలంగాణ ఉద్యమంలో భాగస్వామ్యమయ్యారు.

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునికోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికనుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

సాహితీ శిఖరం

1965 సాహిత్య నోబెల్ విజేత....





**మిఖాయిల్ అలెక్సాండ్రోవిచ్ షోలోఖోవ్ సేకరించిన రచనలు, 1956 మరియు 1960 మధ్య ఎనిమిది సంపుటాలుగా ప్రచురించబడ్డాయి. 1932లో షోలోఖోవ్ కమ్యూనిస్ట్ పార్టీలో చేరారు మరియు అనేక సందర్భాల్లో, సుప్రీం సోవియట్‌లకు ప్రతినిధిగా ఉన్నారు. 1939లో అతను సోవియట్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో సభ్యుడు మరియు తరువాత అసోసియేషన్ ఆఫ్ సోవియట్ రైటర్స్ వైస్ ప్రెసిడెంట్ అయ్యాడు.**

## రష్యన్ ప్రజా రచయిత...

# మిఖాయిల్ అలెక్సాండ్రోవిచ్ షోలోఖోవ్

మిఖాయిల్ అలెక్సాండ్రోవిచ్ షోలోఖోవ్ (1905-1984) రష్యన్ కథా, నవలారచయిత. ఆయన1905 మే 24 న వెషెన్స్కాయ, రష్యాలో జన్మించాడు. అతను 1918 వరకు అక్కడే ఉన్నత పాఠశాలలో చదివాడు. అంతర్యుద్ధం సమయంలో అతను విప్లవకారుల పక్షాన పోరాడాడు. 1922లో అతను జర్నలిస్టుగా మాస్కోలో పనిచేశాడు. అక్కడ అతను వార్తాపత్రికలలో అనేక చిన్న కథలను ప్రచురించాడు. అతను 1926లో తన స్థానిక ప్రాంతానికి చెందిన కోసాక్స్ గురించి కథల సంపుటి డాన్స్కీ రాస్కాజీ (టేల్స్ ఫ్రమ్ ది డాన్)తో తన సాహిత్యరంగ ప్రవేశం చేసాడు. అదే సంవత్సరంలో షోలోఖోవ్ టిఖి డాన్ (మరియు క్వైట్ ఫ్లోస్ ది డాన్) ను రాశాడు. సాహిత్య సృజన నెమ్మదిగా పరిపక్వం చెందింది.

మిఖాయిల్ షోలోఖోవ్ యొక్క రచన టిఖి డాన్ (1940) (మరియు క్వైట్ ఫ్లోస్ ది డాన్) పూర్తి చేయడానికి 14 సంవత్సరాలు పట్టింది. ఇది సోవియట్ కల్పనలో అత్యధికంగా చదివిన రచనగా మారింది మరియు సోషలిస్ట్ రియలిజానికి శక్తివంతమైన ఉదాహరణగా పేర్కొనబడింది. రష్యాలో పరివర్తనలు మరియు సమస్యల నేపథ్యానికి వ్యతిరేకంగా ఆడిన మానవ విధిపై షోలోఖోవ్ లోతైన ఆసక్తిని ఇవి తెలియజేస్తాయి. పోడ్న్యాటయా త్సెలినా (వర్జిన్ సాయిల్ అప్‌టర్న్డ్) అతని మరో రచన. సుద్బా చెలోవెక (ది ఫేట్ ఆఫ్ ఎ మ్యాన్) - ఒక ప్రసిద్ధ రష్యన్ చలనచిత్రంగా రూపొందించబడిన చిన్న కథ వంటి అనేక రచనలు ఉన్నాయి - ఇది ప్రతికూల పరిస్థితుల్లో మానవ ప్రేమ యొక్క శక్తిని మరియు స్థితిస్థాపకతను వివరిస్తుంది. అతని సేకరించిన రచనలు, 1956 మరియు 1960 మధ్య ఎనిమిది సంపుటాలుగా ప్రచురించబడ్డాయి. 1932లో షోలోఖోవ్ కమ్యూనిస్ట్ పార్టీలో చేరారు మరియు అనేక సందర్భాల్లో, సుప్రీం సోవియట్‌లకు ప్రతినిధిగా ఉన్నారు. 1939లో అతను సోవియట్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో సభ్యుడు మరియు తరువాత అసోసియేషన్ ఆఫ్ సోవియట్ రైటర్స్ వైస్ ప్రెసిడెంట్ అయ్యాడు. "కళాత్మక శక్తి మరియు సమగ్రత కోసం, అతను తన డాన్ యొక్క ఇతిహాసంలో, రష్యన్ ప్రజల జీవితంలో ఒక చారిత్రాత్మక దశకు వ్యక్తీకరణను అందించాడు" ఇందుకు గాను అతనిని 1965 లో నోబెల్ సాహిత్య పురస్కారం వరించింది. 21 ఫిబ్రవరి 1984, వెషెన్స్కాయ, (ప్రస్తుతం రష్యా)లో ఆయన మరణించారు.

# కథల్లో తెలంగాణ యాసకు పట్టం కట్టిన సంపత్

తెలంగాణ పదసంపదతో అలరాడుతున్న కథలు...



దాస్యం సేనాధిపతి
94405 25544

కథా సాహిత్యంలో.. "లియోసా" కథా సంపుటితో కథకునిగా తమకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని పదిల పరుచుకున్న డా॥ టి. సంపత్ కుమార్ "నా" నుండి "మన" వరకు పేరుతో మూడో కథా సంపుటిని మనకందిస్తున్నారు. సాహితీ లోకంలో 2000 సం॥ నందు "లియోసా" కథాసంపుటి అందరి దృష్టినాకర్షించింది. దాదాపు సంవత్సరాల విరామం తర్వాత సంపత్ తమ రెండో కథా సంపుటిని "పెన్నులు" పేరుతో 2010లో వెలువరించినారు. మళ్లీ మరో పన్నెండేళ్ల తర్వాత 2022లో ఇప్పుడు "నా" నుండి "మన" వరకు' మూడో కథా సంపుటిని ప్రకటించారు. చతుర మాస పత్రికలో 2017లో "కదలికలు" పేరుతో రాసిన నవల సైతం నవలా ప్రియులను ఎంతగానో ఆకట్టుకుంది. 2019లో "సిక్ నాటౌట్" పేరుతో రచయిత సంపత్ జీవితంలో జరిగిన వాస్తవ ఘటనలను ఏర్చి కూర్చి.. చిట్టి పొట్టి కథల రూపంలో పాఠక మహాశయులకు ఇంకొక గ్రంథాన్ని అందించిన అనుభవం ఆయనకు ఉంది.

ఇవే కాకుండా "సునామీ నానీలు".. (అర్ధాంగి మాధవీలతతో కలిసి) ఢిల్లీ నానీలు పుస్తకాలను వెలువరించి.. నానీల ప్రక్రియను సుసంపన్నం చేశారు.

వృత్తిరీత్యా డా॥ టి. సంపత్ కుమార్ కెనడియన్ హైకమీషన్ - ఢిల్లీలో సీనియర్



డా॥ టి. సంపత్ కుమార్

సలహాదారునిగా పనిచేసిన ఆయన ఢిల్లీలో ఉన్నప్పుడే తెలుగు, ఆంగ్ల రచనలు చేసే వ్యాసంగాన్ని తమ ప్రవృత్తిగా మలుచు కున్నారు. పూర్వ ఆదిలాబాద్ జిల్లా (ప్రస్తుత నిర్మల్ జిల్లా) ఖానాపూర్ గ్రామంలో జన్మించిన ఆయన స్వయం కృషితో కెనడా ఎంబస్సీలో చేపట్టిన ఉద్యోగాన్ని దాదాపు ముప్పది మూడు సం॥లు సమర్థంగా నిర్వహించారు. విధి నిర్వహణలో భాగంగా దేశ విదేశాలు పర్యటన చేసే అవకాశం ఆయనకు లభించింది. దేశ, విదేశ ప్రజల ఆచార వ్యవహారాలు. సంస్కృతీ సంప్రదాయాలను బాగా ఆకళింపు చేసుకున్నారు. సంపత్ 2015లో ఉద్యోగ విరమణ చేసి.. తను పుట్టి పెరిగిన ఊరుకు సేవలం దించాలన్న సంకల్పంతో.. సాహిత్య, సామాజిక సేవల్లో తరించేందుకు ప్రస్తుతం నిర్మల్‌లో స్థిరపడ్డారు. తెలంగాణ భాష, యాసను ఒంట పట్టించుకుని.. తమ రచనల్లో తెలంగాణ భాషకు పెద్దపీట వేస్తూ కథలు, వ్యాసాలు రాయడం వివిధ ప్రముఖ పత్రికల్లో ప్రచురింపబడుతున్నాయి.

ఉద్యోగ విరమణ చేశాక నిర్మల్‌లో స్థిరపడ్డాక గ్రామీణ ప్రజలతో మమేకమై వ్యవసాయ క్షేత్రాన్ని ఏర్పాటు చేసుకుని.. సంపత్ దంపతులు తమ విశ్రాంత జీవితాన్ని అవిశ్రాంతంగా సాహితీ, వ్యవసాయ రంగాల్లో కొనసాగించడం అభినందనీయం.

రచయిత డా॥ సంపత్ కుమార్ తమ కథల్లో సమకాలీన ఘటనలకు మనం నిత్యం చూసే సంఘటనలకు చోటు కల్పిస్తూ సామాజిక చైతన్యానికి పాటుపడటం విశేషం.

ఆయన కథల్లో చాలావరకు నిర్మల్‌తో ఉన్న బంధాన్ని.. పరిసరాలతో ఉన్న అనుబంధాన్ని ఈ ప్రాంతంతో తమకున్న అనుభవాలను, అనుభూతులను చూడగలం. ప్రస్తుతం ఆయన వెలువరించిన ఈ మూడో కథా సంపుటిలో 14 కథలు కొలువుదీరాయి. ఇందులోని చాలా కథల ఇతివృత్తాలన్నీ నిర్మల్ పరిసర పరిస్థితులను ప్రతిఫలించేవే కావడం విశేషం. ఆయన ఈ గ్రంథంలో

పొందుపరిచిన కథల్లో జీవం ఉంది. జీవితం ఉంది. తెలంగాణ ప్రాంత జీవన చిత్రణతో సాగే ఈ కథల్లో తెలంగాణ మాండలికానికి పెద్దపీట వేశారు. కథల్లో తెలంగాణ భాష, యాసను ప్రయోగించడంలో ఎక్కడా సహజత్వాన్ని కోల్పోకుండా జాగ్రత్త పడ్డారు. ఆయా కథల యందు తెలంగాణ భాష, యాసను, మాండలికాన్ని ప్రయోగించే క్రమంలో ఆయా పదాలు.. పదబంధాలు చక్కగా కథల్లో ఒదిగిపోయేలా శ్రద్ధ చూపారు. ఎక్కడా కృత్రిమంగా పొదిగించినట్లు కనిపించదు. తెలంగాణ యాసలోని మాధుర్యాన్ని తమ కథల్లో సందర్భోచితంగా సహజంగా పాఠకులు ఆస్వాదించేలా తమ కథలను తీర్చిదిద్దారు.

ఈ కథా సంపుటిలోని ప్రతి కథ జీవన సత్యాలను మోసుకురావడమే కాక నడుస్తున్న చరిత్రకు అద్దం పట్టేలా ఉన్నాయి. కథల్లో ఇతివృత్తానికి అనుగుణంగా పాత్రలు పాత్రల మధ్య సంభాషణలు సంఘటనలకు అనుగుణంగా సన్నివేశాలు ఎక్కడ సీక్వెన్స్ దెబ్బతినకుండా కథలను నడిపించారు. వస్తువు వెలుగులో కథల నిడివిని దృష్టిలో పెట్టుకుని ఒకటి రెండు కథలు వేగంగా పూర్తి చేయడంలోనూ రచయిత ఔచిత్యాన్ని పాటించారు. చాలా కథలు రచయిత అనుభవాల నుండి ఆవిర్భవించినవే కావడం వల్ల సహజత్వానికి దగ్గరగా ఉన్నాయి. ఏకబిగిన చదివించే విధంగా కథల్ని మలచడంలో రచయిత సంపత్ సఫలీకృతులైనారు.

ఈ సంపుటిలోని చివరి కథ టైటిల్ ను సొంతం చేసుకున్న కథ జరుగుతున్న చరిత్రకు అద్దం పట్టే కథ "నా" నుంచి "మన" వరకు కథ ఆద్యంతం ఆసక్తికరంగా మలచబడింది.

దట్టమైన అడవులతో నిండివున్న పూర్వ ఆదిలాబాద్ జిల్లా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించాక నాలుగు చిన్న జిల్లాలుగా రూపుదిద్దుకుంది. ఈ నేపథ్యంలో కొత్త జిల్లాల్లోని భౌగోళిక పరిస్థితులను అందంగా ఈ కథలో రచయిత ఆవిష్కరించారు. పచ్చదనాన్ని, నల్లబంగారాన్ని జలపాతాలను, నదులు, చెరువులను, జంతువుల అరుపులను.. పక్షులు తమ కిలకిలా రావాలతో ప్రకృతికి స్వరహారతి పట్టే సన్నివేశాలను అందమైన వర్ణనలతో దృశ్యమానం చేశారు.

రచయిత శిల్పపరంగా ప్రయోగించిన ప్రతీకలు, ఉపమానాలు ఈ కథకు మరింత శోభను కూర్చాయి. మన మనుగడ, భవిష్యత్తు పర్యావరణంతో ముడిపడి ఉన్న విషయాన్ని నొక్కి చెబుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్న గురుతర బాధ్యతను గుర్తు చేస్తూ

> **"తిరిగొచ్చిన పానం"** కథలోనూ రచయిత స్వీయ అనుభవాలను అక్షరీకరించారు. తెలంగాణ యాసలో సాగే ఈ కథలో ఖానాపూర్లో ఎనిమిదో తరగతి చదివే రోజుల్లో సోపతిగాళ్లతో కలిసి కడెం ప్రాజెక్టు దర్శించేందుకు వెళ్లిన ఘట్టాలను పొందిన అనుభూతులను అందంగా ఆవిష్కరించారు. ఈ కథలో ప్రస్తావించిన గాలయ్య నూతి ఇంకా ఉందని గుర్తు చేశారు.

అడవులకు నెలవైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని దోపిడీకి గురవుతున్న వృక్షసంపదను చూసి చలించి రచయిత ఆవేదనతో రాసిన కథ ఇది.

జంతువుల అవయవాల కోసం వాటిని చంపుతున్న వైనాన్ని కలప స్మగ్లింగ్ వల్ల తరుగుతున్న వనాలను కనుమరుగవుతున్న వృక్ష సంపదను ప్రస్తావిస్తూ అల్లిన ఈ కథలో ఘటనలు, సంఘటనలు అన్నీ సహజంగా మలచబడ్డాయి.

కలప దొంగలు తరాలుగా ఈ పనిలో మెరుగులు దిద్దుకున్న నిపుణులనీ చెట్లు నరకడంలో సుప్రసిద్ధులనీ ప్రకృతి సంపదను హరించే దోపిడీదార్ల గురించి ఈ కథలో ప్రస్తావించిన తీరు బాగుంది. వనాలన్నీ తరిగిపోతున్న తీరును చూసి ఎకరాల కొద్ది అంగవస్త్రం లేనిదైందంటూ వాపోయారు. ఏపుగా పెరిగిన టేకు వృక్షాలు నేల కొరుగుతున్నాయి. ఒకటి, రెండు, మూడు ఇలా రెండువందల వరకు భూమి తల్లి నుండి బొడ్డు తాళ్లని తెంపుకున్నా యని చెప్పడం బాగుంది. అలాగే వార్డుల్లో అంగాలు విరిగిన వృక్షాలు చిత్ర విచిత్ర ఆకృతుల్లో ఒరిగినట్లు చెట్లు పక్కలపై చెట్లు తమ కొమ్మలపై తామే అడ్డంకులు లేని చోట్ల నేలపైనే అంటూ నరికిన చెట్ల పరిస్థితిని వివరించారు. కలప స్మగ్లింగ్ గ్యాంగుల కార్యకలాపాలను వారు బయటివారికి కనిపించకుండా పదిహేను వందల చెట్లున్న మామిడి తోటలో జరుపుకునే మీటింగులు పార్టీలను కళ్లకు కట్టినట్లు ఈ కథలో రచయిత విశ్లేషించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కొత్త నాలుగు జిల్లాల నుండి కలపని ఏవిధంగా తరలిస్తున్నారో తెలంగాణ యాసలో ఆయా పాత్రలు మాట్లాడుకునే సంభాషణలను సంబంధిత సన్నివేశాలను రచయిత చక్కగా ఆవిష్కరించారు.

ఈ కథలో అడవుల నరికివేతకు తెర దించేందుకు అడవిలోని చెట్లు, జంతువులు, చెట్లు ఒక్కొక్కటి పర్యావరణ పరిరక్షణ కోసం ఇచ్చే సలహాలు, సూచనలు అవి నిర్వహించుకునే మీటింగులో ప్రకటించినట్లు రచయిత సమకూర్చిన ఘట్టాలు వాటి సంభాషణలు ఆయన సృజనాత్మక ప్రతిభను చాటేలా ఉన్నాయి. కలపను జంతువుల తోళ్లు, గోళ్లు తదితర అవయవాలు దర్జాగా ఎలా సంపన్నులు ఉపయోగిస్తున్నారో ఈ కథలో ప్రస్తావించడం బాగుంది.

పేరుకేమో "ట్రీస్" విల్లా తెచ్చేదేమో చెట్లను నరికిన కలప అంటూ కొనసాగించడంలో వాస్తవికత ఉంది. ఇలా అడవులు ధ్వంసమవుతున్న పరిస్థితులను చక్కగా తెలంగాణ యాసలో ఈ కథను రూపుదిద్దారు. అడవులు కనుమరుగవ్వడం వల్ల మన జీవితాలు ఎలా కొట్టుమిట్టాడుతున్నాయో ఈ కథలో వివరించారు. మనిషి తెలిసి తప్పు చేస్తున్నాడనీ ప్రకృతి

పుస్తక పరిచయం

సంపదని తరానికింత దోచుకోండని వెనుకటి తరాల వారిచ్చిన వారసత్వ సంపద కాదని రచయిత ఈ కథ ద్వారా తేల్చి చెప్పారు.

తమ తమ కుటుంబ సంపదలని తరతరానికి పెంచేందుకు అందరూ తాపత్రయ పడటం కాదు ప్రకృతి సంపదని సైతం ప్రతి తరానికి అందించేందుకు కృషి చేయాలని రచయిత పిలుపునిచ్చారు.

కుటుంబం గల్లీ నుండి సమిష్టి రహదారి వైపు ప్రయాణం ఎప్పుడు, ఎలా మొదలౌతుందో చూద్దామనీ రచయిత పేర్కొన్నట్లు "నా" నుండి "మన" ఆలోచనలకు బీజాలు పడేదెప్పుడోననీ ఒక్క అక్షరం నుండి రెండక్షరాల వైపు ప్రయాణం ఎప్పుడు మొదలవుతుందో వేచి చూద్దాం త్వరగా జరగాలని కోరుకుందాం. సందేశాత్మక కథ. ఈ కథలో తెలంగాణ మాండలిక పదాలు అడుగడుగునా కనబడతాయి. "జల్ది జల్ది చేయుండ్రి", "బీడిలన్నా తాగనీయవా", "మొన్నటిలెక్క ఆగమాగం", "అల్కటి పనులు", "పొద్దు పొడవక ముందు", "మల్లొకసారి", "జోరుమీదున్నయి", "తక్వగాకుంట", "పక్క ఐతది", "గీల్ల దయ", "మొహంబత్తీలు", "నిల్సున్న" తదితర తెలంగాణ మాండలిక పదాలు కథలో చక్కగా ఒదిగిపోయాయి. పర్యావరణ పరిరక్షణ వల్ల ఒనగూరే అనర్థాలను, ప్రయోజనాలను వివరించే కథగా మలిచిన తీరు బాగుంది.

"గుడ్డ నిండా ప్రేమ" కథలో ఒకనాటి బంధాలు, అనుబంధాలను రచయిత తెలియజెప్పారు. బంధుత్వాలు.. ప్రేమలు, ఆప్యాయతలు, అనురాగాలు ఓ యాభై ఏళ్ల కింద ఎలా ఉండేవో వివరించే కథ. రచయిత తమ స్వీయ అనుభవాన్ని జోడించి రాసిన కథ ఇది. చిన్నప్పుడు చిన్న నానమ్మ ఇంటికి వెళ్లినప్పటి అనుభవా లను, అనుభూతులను ఈ కథలో నిక్షిప్తం చేశారు. ఎంతో ఆప్యాయతతో చిన్ననానమ్మ వడ్డించిన ఒక్క గుడ్డు (నిండు గుడ్డు) గురించి రచయిత చమత్కారంగా తెలంగాణ భాషలో రాసి పాఠకులను మెప్పించారు.

"తిరిగొచ్చిన పానం" కథలోనూ రచయిత స్వీయ అనుభవాలను అక్షరీకరించారు. తెలంగాణ యాసలో సాగే ఈ కథలో ఖానాపూర్లో ఎనిమిదో తరగతి చదివే రోజుల్లో సోపతిగాళ్లతో కలిసి కడెం ప్రాజెక్టు దర్శించేందుకు వెళ్లిన ఘట్టాలను పొందిన అనుభూతులను అందంగా ఆవిష్కరించారు. ఈ కథలో ప్రస్తావించిన గాలయ్య నూతి ఇంకా ఉందని గుర్తు చేశారు.

భార్యాభర్తల మధ్య మమతానురాగాలను ప్రతిఫలింపజేస్తూ.. ప్రకాశ్ రావు, రజని పాత్రలను "అన్యోన్యం" కథలో రచయిత సంపత్ చక్కగా నడిపించారు.

కరోనా నేపథ్యంలో రాయబడిన ఈ కథలో కరోనా ప్రభావం మనపై ఎలా ఉందో, మన జీవనశైలులపై వచ్చిన మార్పులను ప్రస్తావించిన తీరు ప్రశంసనీయంగా ఉంది.

నిజంగానే రచయిత పేర్కొన్నట్లు "దాగుడుమూతలు' వర్సెస్ 'ఖోఖో' అన్న చందంలా ప్రకాశ్ రావు, రజనిలు ఒకర్ని కాపాడుకోవడానికి మరొకరు.. భర్తని కాపాడుకోవడానికి భార్య, భార్యని కాపాడుకోవడానికి భర్త లాక్ డౌన్ కొనసాగుతున్న సమయాన ఇరువురి మధ్య అన్యోన్యత కొత్త రూపం పోసుకోవడం వంటి అంశాలను రచయిత కథలో ప్రతిభావంతంగా జొప్పించారు.

మన"వరాలు" కథలో నానమ్మ "సుజాత", మనుమరాలు "అక్షర" పాత్రలు ఆసక్తికరంగా మలచబడ్డాయి. పట్టుబట్టి ఆంగ్లం నేర్చుకున్న నానమ్మ ముద్దు ముద్దుగా తెలుగు పదాలు నేర్చుకున్న మనుమరాలిని చూస్తాం.. కెనడా నుండి కొడుకు కోడలు ఇద్దరు పిల్లల్తో మన దేశానికి వచ్చి తిరిగి కెనడా వెళ్లే వరకు సాగే ఈ కథ అందరినీ ఇట్టే ఆకట్టుకుంటుంది. మనవరాలిని మన"వరాలు"గా శీర్షిక పెట్టడంలోనూ రచయిత నేర్పరితనం కానవస్తుంది.

నేడు ముఖ్యంగా పల్లెల్లో ప్రజాప్రతినిధులు కొందరు సతుల పేరిట పతులు పరిపాలన సాగిస్తున్న పరిస్థితులకు అద్దం పడుతూ రాసిన కథ "మొఖాలకు గుండాలు" సర్పంచ్ జయమ్మ, ఆమె భర్త అంజిరెడ్డిల గురించి రాసిన ఈ కథలో ఎన్నికై గెలిచిన భార్య జయమ్మను కాదని భర్త అంజిరెడ్డి పాలనలో పెత్తనం నడిపించడాన్ని రచయిత చక్కగా ఆవిష్కరించారు. మొక్కవోని ధైర్యంతో స్వయంగా సర్పంచ్ జయ తమ మీటింగును తామే నిర్వహించే స్థాయికి ఎదగటం.. ఆమెలో వచ్చిన చైతన్యాన్ని రచయిత కథలో చక్కగా తెలియజెప్పారు. భార్యలకు భర్తలు పాల్గొనే ప్రజాప్రతినిధుల ఫోటోలను తమ తమ పత్రికల్లో భార్య స్థానంలో భర్తల ముఖాలను వృత్తాల్లో (గుండాల్లో) చూపించిన సంఘటనలనే ప్రేరణగా తీసుకుని జయ అందరికీ ఆదర్శంగా నిలిచి మహిళా చైతన్యానికి దోహద పడింది. మంచి సందేశంతో సాగే ఈ కథ భార్యల పదవులను అనుభవించే భర్తలకు కనువిప్పు కలిగేలా ఉంది.

"అమాయక చెల్లింపు" కథలో



రచయిత తన చిన్ననాటి జ్ఞాపకాలను, బాల్యంలో చూపిన గారడోళ్ల ఆటలను, గారడోళ్ల వింత వింత విన్యాసాలను కళ్లకు కట్టినట్లు దృశ్యమానం చేశారు. తెలంగాణ పదబంధ ప్రయోగంలో రచయిత చూపిన శ్రద్ధ ప్రశంసనీయంగా ఉంది. పూర్తి తెలంగాణ మాండలికంలో సాగే ఈ కథ ఆద్యంతం ఆసక్తికరంగా ఉంది.

నిర్మల్‌కు పదమూడు కిలోమీటర్ల దూరంలో రచయిత సంపత్ కాల్వ అనే గ్రామంలోని మామిడి తోటను కొని వరిని కూడా పండించడం జరుగుతుంది. పొలాన్ని దున్నినప్పటి నుంచి పండిన ధాన్యాన్ని ప్రభుత్వానికి అమ్మేవరకు వ్యవసాయదారులు ఎదుర్కొనే కష్టాలను "పొక్కుల సంచులు" కథలో పూసగుచ్చినట్టు వివరించారు. నిర్మల్ పరిసర గ్రామీణ ప్రాంతంలో రచయిత దంపతులు తాము వ్యవసాయాన్ని నిర్వహిస్తూ స్వీయ అనుభవాలను పేర్కొంటూ ఈ కథకు రూపమిచ్చారు.

దాదాపు నలభై ఏళ్ల తర్వాత ఢిల్లీ నుండి నిర్మల్ కు చేరుకున్న రచయిత దంపతులకు ఓ కొత్త సంస్కృతి పరిచయం కావడం, శుభ కార్యక్రమాలకు ఆహ్వానాలు రావడం పెరిగిపోయింది.

ఆయా శుభకార్యాల్లో పార్టీలో జరిగే తంతులను వింత వింత పోకడలను "కాదేదీ పార్టీల కనర్హం" కథలో ఆయా పాత్రలు, సంఘటనలు, సన్నివేశాలు, సంభాషణల ద్వారా ప్రస్తావించిన తీరు బాగుంది. హాస్యాన్ని, చమత్కారాన్ని జోడించి రాయబడిన కథ ఇది. పార్టీల్లో నేడు రిటర్న్ గిఫ్ట్‌ల గురించి వివిధ ఈవెంట్లను కథలో అడుగడుగునా చూస్తాం. రచయిత తాను ఎంపిక చేసుకున్న కథా వస్తువు అభినందనీయంగా ఉంది. కథను నడిపించిన తీరు మరీ బాగుంది. హాస్యం, చమత్కారంతో కథ మరింత బాగా రూపు దిద్దుకుంది.

పాకిస్తాన్ సరిహద్దు పంజాబ్ గ్రామీణ ముఖచిత్రాన్ని ఆవిష్కృతం చేస్తూ రాసిన "కంచెల మధ్య" కథలో రచయిత పంజాబ్ ప్రాంత మనుషుల సంభాషణలను చక్కగా పొందుపరిచారు. బి.ఎస్.ఎఫ్. వారు ఊర్లు ఖాళీ చేయించి నప్పుడల్లా ఇల్లు, సంపదను వదిలివెళ్లే పరిస్థితులు అక్కడివారి జీవితాల్లో ఒక అంతర్భాగమైన విషయాన్ని రచయిత నర్మగర్భంగా ఆయా సన్నివేశాలను కథలో ప్రవేశపెట్టారు. టీ కొట్టు నడిపే అక్బర్ పాత్ర కథకు నిండుదనం కూర్చింది.

అక్బర్ బాబాగా, ఆయన అందరి మన్ననలు పొందటం విశేషం.

ఉపాధి కోసం ఉత్తర తెలంగాణ నుండి గల్ఫ్ దేశాలకు వెళ్లే ప్రజల జీవితాలను తెలియజెబుతూ "ఘు"బాయ్ కథను తీర్చిదిద్దారు. ఇల్లు, కుటుంబం, వ్యవసాయం, బంధు మిత్రులను వదిలి ఉపాధి కోసం దేశం కాని దేశంకు వెళ్లి అక్కడ వారు పడే కష్టాలను ఈ కథలో ఆయా పాత్రల ద్వారా వివరించారు. నిజంగానే దుబాయ్‌కు వెళ్ళిన కొడుకు ఫోన్లో చెప్పే కష్టాలను విని భరించలేని తల్లి ‘ఘు’బాయ్ అని తిట్టిపోయడం, ఈ కథకు "ఘు"బాయ్ అని పేరు పెట్టడం అన్నీ రచనాపరంగా సరిపోయాయి! ఓ రకంగా ఉన్న ఊర్లో, దేశంలోనే ఏదో ఉపాధి సంపాదించుకోవాలన్న అర్థం ధ్వనించేలా కథ కొనసాగడం బాగుంది.

స్నేహం యొక్క గొప్పదనాన్ని చాటిచెబుతూ రచయిత స్వీయ అనుభవంతో రాసిన "నా దోస్తు టామ్" కథలో కెనడాల ఉన్న ఎన్జీవో ఆఫీసులో పని చేసే టామ్‌తో రచయిత సంపత్ గారికి ఉద్యోగ నిర్వహణలో స్నేహమేర్పడటం ఆ స్నేహం చిరకాలం కొనసాగడం బాగుంది. ఈ కథలో "టామ్" యొక్క ఉత్తమ వ్యక్తిత్వాన్ని చూస్తాం. ఆయన సామాజిక సేవను అభినందించి తీరుతాం. టామ్, సంపత్ గార్ల మధ్య స్నేహం అందరినీ అబ్బుర పరిచేలా ఉంది.

కెనడాలో రాజధాని టోరంటోలో సంపత్ కుమార్ గారి కుమారునికి ఎం.బి.ఏ.లో సీట్ రావడం. డిగ్రీ సర్టిఫికేట్ తీసుకునే వేళ. సంపత్ దంపతులు వెళ్లేందుకు పరిస్థితులు అనుకూలించక పోవడం.. వారు లేని లోటు పూర్తి చేయడానికి ‘టామ్’, ఆయన భార్య వెళ్ళి స్నేహాన్ని చాటారు. ఈ కథ వస్తువును బట్టి కొంచెం వేగంగా సాగినప్పటికీ.. స్నేహానికి కులం, మతం, దేశం ఎల్లలు లేవని ఓ గొప్ప సందేశాన్ని ఈ కథ ద్వారా ఇవ్వడంలో రచయిత సఫలీకృతులైనారు.

‘(అ)సాధారణత్వం’ కథలో ఢిల్లీ యందు ఒక విదేశీ దౌత్య కార్యాలయంలో ఆ దేశపు ప్రధాని భారత పర్యటనకు వచ్చినప్పుడు.. సాధారణ జీవనశైలిగల గాంధీ అసాధారణ వ్యక్తిత్వాన్ని, ఒక దేశ ప్రధాని ఆ అసాధారణ వ్యక్తి సమాధిని చూడటానికి అమలయ్యే అసాధారణ రీతిని చెప్పేందుకు రచయిత ప్రయత్నించారు.

"తాతయ్య దంతం" కథ ఆసక్తికరంగా ఉంది. ముగింపు అందరినీ నవ్వించేలా ఉంది. అందమైన ముఖచిత్రంతో ముస్తాబై వచ్చిన ఈ సంపుటిలోని కథలన్నీ - రచయిత సంపత్ కుమార్ గారి రచనా వైచిత్రిని చాటేలా ఉన్నాయి. తెలంగాణ మాండలిక పదాలపై పరిశోధన చేసేవారికి కావలసినంత పద సంపద ఇందలి కథల్లో లభించగలదు. ఈ సంపుటి చివరన లోగడ సంపత్ రచనలపై వచ్చిన సమీక్షలను పొందుపరిచారు.

పుస్తక రూపకల్పనలో తాళ్లపల్లి మురళీధర్ గౌడ్ కృషిని మెచ్చుకుంటాం. ఏకబిగిన అందరు హాయిగా చదువు కోదగిన కథా సంపుటిని అందించిన రచయితకు అభినందనలు తెలియజేద్దాం.

> **నిర్మల్‌కు పదమూడు కిలోమీటర్ల దూరంలో రచయిత సంపత్ కాల్వ అనే గ్రామంలోని మామిడి తోటను కొని వరిని కూడా పండించడం జరుగుతుంది. పొలాన్ని దున్నినప్పటి నుంచి పండిన ధాన్యాన్ని ప్రభుత్వానికి అమ్మే వరకు వ్యవసాయదారులు ఎదుర్కొనే కష్టాలను "పొక్కుల సంచులు" కథలో పూస గుచ్చినట్టు వివరించారు.**

కథ

# విద్యుత్ శ్మశానవాటిక

ప్రహసనమైన వ్యవస్థ...




ఆంగ్లం నుండి అనువాదం:
ఎలనాగ, 98669 45424
(నాగరాజు సురేందర్)

ఒడియా మూలం : పరేశ్ పట్నాయక్
ఆంగ్లానువాదం : సరోజ్ మిశ్రా


ఆ రోజు సాయంత్రం ఏడు గంటలకు విద్యుత్ శ్మశానవాటిక ప్రారంభోత్సవం జరగాల్సివుంది. దాని కోసం అవసరమైన ఏర్పాట్లు దాదాపు అన్నీ పూర్తయ్యాయి.

పట్టణంలోని ప్రజలందరు పెద్ద సంఖ్యలో వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ వార్తా పత్రికల్లో అడ్వర్టైజ్‌మెంట్ ఇచ్చారు. కానీ జనం దాన్ని పట్టించుకోరని దాదాపు కచ్చితంగా అనుకున్నాడు ఆ మునిసిపాలిటీ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆలేఖ్. అందుకని, ఆ ఫంక్షనుకు రావాలని స్వీపర్లు మొదలైన ఒక వంద మంది తాత్కాలిక ఉద్యోగులకు ఆదేశాలిచ్చాడు ఆయన. వాళ్లు హాజరు కావడం అనివార్యం అనీ చెప్పాడు. హాజరైతే భవిష్యత్తులో వాళ్ల ఉద్యోగాలు పర్మనెంటు కావడం లాంటి కొన్ని లాభాలు ఉంటాయని అన్యాపదేశంగా సూచించాడు.

ఆలేఖ్‌కు సహాయక అధికారిగా ఉన్నతని పేరు గురు. ఫంక్షనుకు వచ్చిన వాళ్లకు ఫలహారాలను సరఫరా చేసే బాధ్యత గురుకు అప్పగించబడింది. వాటిని ఫంక్షను మధ్యలో పంచితే శ్రోతలు చివరిదాకా ఉండరు కాబట్టి, చివర్న పంచాలని నిశ్చయించుకున్నాడు గురు.

ఉదయం ఆరు గంటలప్పుడు ఆలేఖ్‌కు ఫోన్ చేశాడు మంత్రి గారి పి.ఏ.

**మూల రచయిత పరిచయం....**

పరేశ్ పట్నాయక్ ఒడియా భాషలో రాసే ప్రసిద్ధ కథారచయిత. మూడు దశాబ్దాలుగా కథలు, నవల రాస్తున్నారు. ప్రధానంగా మూఢవిశ్వాసాలు, మతం పట్ల మూఢభక్తి అనే సామాజిక అంశాల మీద విమర్శనాత్మకంగా, వ్యంగ్యాత్మకంగా అల్లుతారు కథలను. ఒడియా సాహిత్యంలో తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని నెలకొల్పుకున్నారు. ఇప్పటివరకు 20 కథా సంపుటాలను, 3 నవలలను, 5 నవలికలను వెలువరించారు. కొన్ని కథలు ఇంగ్లిష్, హిందీ, ఇతర భారతీయ భాషలలోకి అనువదింపబడినాయి. ఒడిశా రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డును పొందారు. భార్య, ఒక కొడుకుతో భువనేశ్వర్‌లో నివసిస్తున్నారు.

"అంతా రెడీగా ఉందా?"

"రెడీనే సార్, చాలా శ్రద్ధగా అన్ని ఏర్పాట్లూ చేశాం. గౌరవ మంత్రిగారి కోసం మేమందరం ఆత్రుతగా ఎదురు చూస్తున్నాం."

"మీడియా సంగతేంటి?"

"ఆ ఏర్పాటు కూడా అయింది సార్. వాళ్లు లేకుండా ఈ రోజుల్లో ఏ ఫంక్షనూ చేయలేం. శ్రోతలు లేకుండానైనా చేయవచ్చునేమో గాని, మీడియావాళ్లు మాత్రం తప్పక ఉండాల్సిందే."

"వచ్చారా మీడియా వాళ్లు?"

"వాళ్లకోసం ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశాను. వాళ్లకు ఇచ్చే స్నాక్స్ ఇంకా కొంచెం మంచివి అన్న మాట. వాళ్లు ఇక్కడికి చేరుకున్నారు. మేం వాళ్లను బాగా చూసుకుంటున్నాం."

"శవం సంగతేంటి? అది రెడీగా ఉందా?"

"అదే సమస్య సార్."

"అంటే ఏమిటి మీ ఉద్దేశం?"

"శవం ఇంకా రాలేదు."

"ఎందుకు రాలేదు?"

"అదో విషాదకరమైన కథ సార్. ఊళ్లో ఇవాళ ఒక్క మరణం కూడా లేనట్టుంది. నేను హాస్పిటల్, పోలీస్ స్టేషన్, శ్మశాన వాటిక మొదలైన అన్ని చోట్లా వెదికాను. కానీ ఒక్క శవం కూడా దొరకలేదు. ఆ స్థలాల్లో నా సిబ్బందిని ఉంచాను. శవం దొరకగానే వెంటనే పోయి తెచ్చేసుకుంటాను."

"అదెప్పుడు జరుగుతుంది? ప్రోగ్రాంను క్యాన్సెల్ చేసి మరో రోజు పెట్టాలని మంత్రి గారికి నేను చెప్పాలేమో."

"కానీ ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి

క
థ

సార్."

"ప్రధాన పాత్రే సిద్ధంగా లేదు. నువ్వేమో ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయంటున్నావు. సరే, శవాన్ని దొరికించుకుని నాకు సమాచారం ఇచ్చేందుకు అరగంట సమయం ఇస్తున్నాను నీకు. శవం దొరికిన తర్వాతే మంత్రిగారు వస్తారు. ఒకవేళ మంత్రి గారు వచ్చి శవం రెడీగా లేకుంటే ఆ ప్రధాన పాత్ర నువ్వే అవుతావు!"

"సార్!"

భయంతో ఫోన్‌ను కట్ చేశాడు ఆలేఖ్. తన ఇరవయ్యేళ్ల గవర్నమెంట్ సర్వీస్‌లో అట్లాంటి పరిస్థితి అతనికి ఎప్పుడూ ఎదురు కాలేదు. ఆ కార్యక్రమానికి శవం చాలా అవసరం. ప్రతిరోజు ఎందరో చనిపోతున్నారు కాని, ఆ నాడు మాత్రం ఒక్కరు కూడా చనిపోలేదు. ఆ పరిస్థితి తనమీద కుట్ర లాగా అనిపించిందతనికి.

కార్యక్రమానికి మంత్రిని ఆహ్వానించేందుకు వెళ్లినప్పుడు ఆయన తన షరతులను చెప్పాడు. మృతుడు ఎయిడ్స్ లాంటి అంటురోగంతో చనిపోయి ఉండకూడదన్నాడు. ఆత్మహత్య వలన, లేదా రోడ్డు ప్రమాదంలో చనిపోయినవాడు కూడా కాకూడదు. చనిపోయిన వ్యక్తి ఒక స్త్రీ అయితే మంచిది. అది కూడా ముప్పయ్యేళ్లకంటె తక్కువ వయసును కలిగి అందంగా ఉంటే ఇంకా మంచిది.

"మంత్రిగారి కోరిక సంగతి అటుంచు, ముందు శవమే దొరకలేదు నీకు!"

సహాయాధికారి గురు ఇలా అన్నాడు ఆలేఖ్‌తో "మంత్రిగారు చెప్పినదానికి అనుగుణమైన శవం ఒకవేళ దొరకకపోతే?"

"దాన్ని నేను పట్టించుకోను. ఆయన కోరినవన్నీ ఉన్నట్టు సర్టిఫికెట్ ఇద్దాం," అన్నాడు ఆలేఖ్.

"కానీ మనం పురుషుని శవాన్ని స్త్రీ శవంగా మార్చలేం కదా!" అడిగాడు గురు.

"ఏం కాదులే. నా ఇరవయ్యేళ్ల సర్వీస్‌లో ఇట్లాంటివి ఎన్నో చేశాను. వాటిలో విజయాన్ని సాధించాను. అంతే కాక, రావలసిన అన్ని ప్రమోషన్లు సమయానికి వచ్చాయి నాకు. నేను కోరుకున్న ఊరికి పోస్టింగును వేయించుకున్నాను కూడా. జీవితంలో విజయాన్ని సాధించాలంటే కొన్నిసార్లు రిస్క్ తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఈ మీడియావాళ్లతో ప్రమాదం. వాళ్లు శవం దగ్గర్నుండి కూడా వాంగ్మూలాన్ని సేకరించగలరు. కాబట్టి వాళ్లతో జాగ్రత్తగా ఉండు," అనేసి నిరాశతో కూచున్నాడు ఆలేఖ్.

"ఏమైంది సార్?" అడిగాడు గురు, బాస్ లోని నిరుత్సాహాన్ని చూసి.

"శవం గురించి నేను ఎంత ఆందోళనగా ఉన్నానంటే, అన్నీ శవాలే కనిపిస్తున్నాయి నాకు. వాటిని పట్టుకునేందుకు నేను ప్రయత్నిస్తున్నాను కానీ అవి దొరకకుండా తప్పించుకుంటున్నాయి."

"పరిస్థితి ప్రమాదకరంగా ఉంది," అన్నాడు గురు.

"ఊహు, ప్రమాదకరంగా కాదు. ఇట్లాంటి పరిస్థితిని ఎదుర్కొన్నప్పుడల్లా నాకు లాభమే జరిగింది. నేను బి.డి.ఓ. గా ఉన్నప్పుడు ఇట్లాంటి సందర్భాలెన్నో ఎదురైనాయి నాకు. వర్షం పడినప్పుడు వరదలకు సిద్ధమయ్యాను. ఎవరైనా వడదెబ్బతో చనిపోయినప్పుడు దానికి తగినట్టుగా పత్రాలను తయారు చేయించాను. కొంచెం సేపట్లోనే తప్పకుండా శవం దొరుకుతుందని నా నమ్మకం."



అప్పుడే గుమాస్తా రౌత్ పగలబడి నవ్వాడు. అతనికి చెప్పరానంత ఆనందం కలిగినట్టుంది. దాని వలన ఏర్పడ్డ ఆదుర్దాను సంభాళించుకునేందుకు బలమైన శ్వాసను తీసుకున్నాడు. ఆఖరుకు, "శవం దొరికింది సార్," అని బిగ్గరగా అనేశాడు గబుక్కున.

"ఎక్కడ?" అని అందరూ ఒకేసారి అరిచారు.

"హాస్పిటల్లో సార్. ఆ వ్యక్తి దాదాపు పూర్తిగా చనిపోయాడు. అతడు బతికే అవకాశం లేదన్నాడు డాక్టరు."

"ఇంకా చనిపోలేదా?"

"కొద్దిసేపట్లోనే చనిపోతాడు సార్. డాక్టర్‌గారు చెప్పారు అలా."

**మన నిర్ణయం కూడా అసెంబ్లీ దాకా పోయి రగడను సృష్టించగలదు. ఆ వ్యక్తి కులం, మతం, జాతి ఏమిటి? సరైన శవాన్ని ఎంపిక చేసేందుకు హై పవర్ కమిటీని ఎందుకు వేయలేదు, మొదలైన ఎన్నో ప్రశ్నలు, వాటిద్వారా చిక్కులు తలెత్తవచ్చు. కాబట్టి ఏదైనా పొరపాటు జరిగితే దాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం కోసం ఒక ఎంక్వైరీని వేసే అవకాశం కూడా ఉంది. తర్వాత, విధినిర్వహణలో లోపం జరిగినందుకు పై అధికారులు మనమీద చర్య తీసుకోవచ్చు. అలా జరగవద్దని మనం దేవుణ్ని వేడుకుందాం."**

క
థ

"కొద్దిసేపట్లో అంటే ఎప్పుడు?"
"ఆ విషయాన్ని డాక్టరు చెప్పలేదు సార్."
"అతడు ఏడు లోపల చస్తేనే మనకు ఏమైనా ప్రయోజనముంటుంది. లేకపోతే లాభం లేదు."
"ఎందుకు సార్?"
"అదనంగా కొంచెం సేపు బతికితే ఏం లాభం? దేశానికి సేవ చేయలేనప్పుడు ప్రయోజనమేమిటి, అంటున్నాను. మనమంతా ఏం చేస్తున్నాం? దేశానికి సేవ చేస్తున్నాం. అతడు ఇప్పుడు చచ్చిపోతేనే అతని శవం ఉపయోగపడి మన ఫంక్షన్ విజయవంతమౌతుంది. కాబట్టి అతడు తొందరగా చనిపోవాలని దేవుణ్ని వేడుకోండి."
"సర్, మనం మొదట్లోనే ఒక పొరపాటు చేశామనిపిస్తోంది నాకు. శవం కోసం మనమొక అడ్వర్టైజ్మెంట్ ఇవ్వాల్సింది."
"ఆ ఆలోచన నా మెదడులో క్షణం పాటు మెదిలింది కానీ, నేను దాన్ని ఆచరణలో పెట్టలేదు. ఎందుకంటే, అప్పుడు డజన్లకొద్దీ శవాలు వచ్చేవి. వాటిలోంచి ఒక శవాన్ని ఎంపిక చేసుకునేందుకు మనం ఒక కమిటీని వేయాల్సి వచ్చేది. పెద్ద గందరగోళం ఏర్పడి, అదొక పెద్ద సమస్యగా మారేది. ఫలితంగా మనకు చాలా పెద్ద ఇబ్బంది ఎదురయ్యేది."
"ఇప్పుడు మనం చేస్తున్నదాంతో సమస్య వస్తే ఎలా సార్?"
"ఇప్పుడు కూడా సమస్య వచ్చే అవకాశం లేకపోలేదు. ఈ కాలంలో నిర్ణయాలన్నీ ప్రశ్నించదగినవే. మన నిర్ణయం కూడా రగడను సృష్టించగలదు. ఆ వ్యక్తి కులం, మతం, జాతి ఏమిటి? సరైన శవాన్ని ఎంపిక చేసేందుకు హై పవర్ కమిటీని ఎందుకు వేయలేదు, మొదలైన ఎన్నో ప్రశ్నలు, వాటిద్వారా చిక్కులు తలెత్తవచ్చు. కాబట్టి ఏదైనా పొరపాటు జరిగితే దాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం కోసం ఒక ఎంక్వైరీని వేసే అవకాశం కూడా ఉంది. తర్వాత, విధినిర్వహణలో లోపం జరిగినందుకు పై అధికారులు మనమీద చర్య తీసుకోవచ్చు. అలా జరగవద్దని మనం దేవుణ్ని వేడుకుందాం."
అంతలోనే అతని సెల్ ఫోన్ మోగింది. ఆలేఖ్ దాన్ని ఆదుర్దాగా అందుకున్నాడు. శవం హాస్పిటల్ నుండి బయలుదేరిందని హాస్పిటల్ సిబ్బందిలోని ఒకతను చెప్పాడు ఫోన్‌లో. వెంటనే ఆ సమాచారాన్ని మంత్రిగారి పి.ఏ.కు అందజేశాడు ఆలేఖ్.
అక్కడ ఉన్నవాళ్లందరిలో వెంటనే చురుకుదనం ప్రవేశించింది. శవం వచ్చింది. "మంత్రిగారు వస్తున్నారు," అంటూ గుసగుసలు మొదలయ్యాయి. చివరకు లోపల శవంతో ఒక ఆంబులెన్స్ వచ్చింది. దాన్ని వేదిక వెనుకభాగానికి తరలించారు. కొత్తబట్టలతో, బూట్లతో, తలమీద తెల్లని టోపీతో ఉంది ఆ శవం. నిజానికి ఆ శవాన్ని బ్యూటీ పార్లర్ కు తీసుకుపోవాలనుకున్నాడు ఆలేఖ్. కానీ సమయం లేకపోవడంతో ఆ ఆలోచన కార్యరూపం దాల్చలేదు. శవం మీద సెంటును స్ప్రే చేసి దాన్ని పువ్వులతో, పూలదండలతో కప్పేశారు. అంతిమంగా దాని కళ్లమీద గాగుల్స్ పెట్టారు."
అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ రే ఆ శవంతో పాటు దాని మరణధ్రువీకరణ పత్రాన్ని తీసుకొచ్చాడు. "ఆ శవం తాలూకు వ్యక్తి పేరేంటి?" అని అడిగాడు ఆలేఖ్.
"మిథ్యావాది," అని జవాబిచ్చాడు డాక్టర్ రే.
ఆలేఖ్ దిగ్భ్రాంతికి లోనై, "మిథ్యావాది? అదేం పేరు?" అని అడిగాడు.
పేషెంట్ మొదటిసారి తన దగ్గరికి వచ్చినప్పుడు తనకు కూడా ఆశ్చర్యం కలిగిందని చెప్పాడు డాక్టర్ రే. "కొందరు సత్యవాది అనే పేరును పెట్టుకున్నప్పుడు నేను మిథ్యావాది అని ఎందుకు పెట్టుకోగూడదు? సత్యప్రియ, సత్యనారాయణ, సత్యానంద ఇలా సత్యకు ఎన్నో మాటలను తగిలించి పేర్లు పెట్టుకుంటున్నారు ప్రజలు. మిథ్యకు ఎన్ని మాటలను కలిపారు చెప్పండి?" అని అన్నాడట ఆ రోగి.
"అతని వయసెంత?"
"యువకుడు సార్."
ఆలేఖ్‌కు చేయాల్సిన పనులు చాలా ఉండటం వల్ల సంభాషణను పొడగించేందుకు సమయం లేదు. పైగా మంత్రి ఏ క్షణంలోనైనా రావచ్చు కాబట్టి, అతని గుండె వేగంగా కొట్టుకోసాగింది. గేటు వైపు పదేపదే చూడసాగాడు. అతని ఆందోళన పెరిగి అదేపనిగా కళ్లను రుద్దుకున్నాడు."
అతడు డాక్టర్ వైపు చూసి, "ఏ వ్యాధితో చనిపోయాడు ఈ వ్యక్తి?" అని అడిగాడు.
"విచిత్రమైన వ్యాధి సార్. దాని గురించి నాకేమీ తెలియదు," అన్నాడు డాక్టర్ రే.
"దాని పేరేమిటి?"
"నాకు తెలియదు సార్. నా జీవితంలో ఎందరో పేషెంట్లను చూశాను నేను. కానీ ఇతనిది ఏదో ఒక విచిత్రమైన రోగం. దాని గురించి నేను వినలేదు, చదవలేదు."
"అది అంత ప్రమాదకరమైనది కాదని ఆశిస్తాను. అంటే అంటురోగం కాదని నా ఉద్దేశం. ఎందుకంటే మంత్రిగారు ఆ శవం పక్కన కూచోవాలి, దానికి పూలదండను వేయాలి. ఈ శవానికి ఇంతకు ముందు అంటురోగం ఉండిందని తెలిస్తే నా ఉద్యోగం ఊడుతుంది."
"అది ప్రమాదకరమైన వ్యాధో లేక అంటురోగమో నేను చెప్పలేను."
"విషయాన్ని కొంచెం వివరించండి."
"బతికి ఉన్నప్పుడు అతడు ఒక్క అబద్ధం కూడా చెప్పలేకపోయాడు."
"అంటే మీ ఉద్దేశమేమిటి?"
"అవును సార్. అతడు అబద్ధం చెప్పలేకపోయాడు. ఎప్పుడైనా నిజం మాట్లాడితే అతని ఛాతీలో తట్టుకుని ఊపిరి పీల్చుకోవడం కష్టమయ్యేదతనికి. అబద్ధం చెప్పినప్పుడు మాత్రం వెంటనే ఉపశమనం పొందేవాడు. సాధ్యమైనంత ఎక్కువగా అబద్ధాలాడాలనీ, అప్పుడతను ఆ వ్యాధినుండి కోలుకోగలుగుతాడనీ చెప్పాను నేను. కానీ అలా

చేయలేకపోయాడతడు. ఆఖరుకు అతని గుండె ఆగిపోయి చనిపోయాడు.''

ఆలేఖ్ ఒక నిట్టూర్పును వదలి, "నేను మంత్రిగారికి ఏం చెప్పాలి? ఎలా వివరించాలి?'' అని అడిగాడు.

"నాకూ భయంగా ఉంది. అది ఒకవేళ అంటువ్యాధి అయి నాకు సోకివుంటే నా గతేం కాను?''

అలా జరిగి ఉండదని చెప్పి డాక్టరుకు భరోసా ఇచ్చాడు ఆలేఖ్. "నువ్వు అబద్ధాలు చెప్పగలవు కాబట్టి భయపడే అవసరం లేదు,'' అన్నాడు.

డాక్టరు ఇలా అన్నాడు: "ఒకవేళ నేను అబద్ధం చెప్పలేకపోతే ఏం చేయాలి? నేను ఎలా బతకాలి? నా కుటుంబానికి ఏం జరుగుతుంది?''

ఆలేఖ్ చిరాకు పడ్డాడు. "నువ్వు కేవలం నీ గురించే దిగులు పడుతున్నావు. మంత్రిగారికి వ్యాధి సోకితే ఎలా? అప్పుడేం జరుగుతుందో ఊహించావా? నేను చెప్పింది నీకు అర్థమైందా?'' అన్నాడు.

డాక్టర్ ఏమీ ఆలోచించలేక ఆకాశం వైపు బిత్తరచూపులు చూశాడు.

అకస్మాత్తుగా కలకలం రేగి, "మంత్రిగారు వచ్చారు,'' అనే కేక వినిపించింది.

"మంత్రిగారు వర్ధిల్లాలి. మంత్రిగారు జిందాబాద్'' అన్న నినాదాలను చేసింది అక్కడున్న గుంపు. "మిథ్యావాది జిందాబాద్'' అనే నినాదం కూడా వినిపించింది.

దాన్ని వినగానే మంత్రి హతాశు డయ్యాడు. కొన్ని రోజుల క్రితం తాత్కాలిక ఉద్యోగులు అతని ఇంటిముందు శిబిరం ఏర్పాటు చేసి, మంత్రి అబద్ధాల మనిషి అని అరిచారు. ఈ ప్రభుత్వ కార్యక్రమంలో అట్లాంటి నినాదమే వినపడటంతో ఆయన ఆశ్చర్యానికి గురయ్యాడు. తన పి.ఏ. వైపు చూసి, "వాళ్లు నన్ను పొగడుతున్నారా లేక తెగడుతున్నారా?'' అని అడిగాడు.

"పొగడుతున్నారు సార్. చనిపోయిన వ్యక్తి పేరు మిథ్యావాది.'' అన్నాడు పి.ఏ.. మంత్రికి ఉపశమనం కలిగి ఊపిరి పీల్చుకున్నాడు. తనకు దండలు వేయడం మొదలైన ఆ కోలాహలంలో వేదిక పైకి ఎక్కాడు మంత్రి. శవం ఆ వేదిక మీద ఒక పక్కన ఉంది. దానికి పూలదండ వేశాడు మంత్రి. తర్వాత తన ఉపన్యాసపు కాగితాలు అడిగాడు పి.ఏ. ను. ఆ పి.ఏ. నాలుగు రకాల ఉపన్యాస పత్రాలను రాసి తయారు పెట్టాడు. శవం స్త్రీది ఐతే ఒకటి, పురుషునిది ఐతే ఒకటి, హిజ్రాది అయితే ఒకటి, అసలు శవమే లేకపోతే చదవాల్సింది ఒకటి. వాటిలోంచి సరైనదాన్ని తీసి ఇచ్చాడు.

"ఇది సరిగ్గానే ఉందా?'' అని అడిగాడు మంత్రి.

అటువంటి అనుమానం రావడానికి సరైన కారణం ఒకటి ఉంది. కొంతకాలం క్రితం ఆయన ఒక స్వాతంత్ర్య సమర యోధుని జన్మదిన అభినందన కార్యక్రమానికి వెళ్లి, వర్ధంతికి సంబంధిన ఉపన్యాసాన్ని చదివాడు. అప్పుడు విపరీతమైన ఇబ్బందికి గురయ్యాడు. మరొకసారి విద్యార్థుల సెమినారులో జీతాలను పెంచుతాననీ, ఇంకోసారి టీచర్స్ కాన్ఫరెన్స్ లో జీతాలను తగ్గిస్తాననీ అన్నాడు. ఆ సంఘటనలు అతణ్ణి నవ్వులపాలు చేశాయి.

"అది సరైన ఉపన్యాసం సార్. దాన్ని నేను నాలుగు భాగాలుగా రాశాను. మొదటిది అతని గుర్తింపు గురించినది. రెండవది విద్యుత్ శ్మశానవాటికకు సంబంధించినది. మూడవది ప్రభుత్వ విధానాల గురించినది. నాలుగవదేమో ప్రభుత్వ వాగ్దానాలకు సంబంధించినది.''

"నేను చదివితే గాని తెలియదు,'' అన్నాడు మంత్రి.

తర్వాత ఆయన ఉపన్యాసమివ్వడం కోసం లేచాడు. ప్రతి వాక్యం తర్వాత పెద్ద చప్పట్లు వినిపించాయి. అలా చేయాలని ఆలేఖ్ ముందుగానే తన సిబ్బందికి చెప్పాడు. మంత్రి తన ఉపన్యాసాన్ని కొనసాగించాడు.

"స్వాతంత్ర్యం వచ్చింతర్వాత చాలా కాలానికి ఇప్పుడు మనకు ఒక ప్రజా రంజకమైన ప్రభుత్వం ఉంది. ప్రజల సంక్షేమమే దాని ప్రధాన కార్యక్రమం. శవాలు కూడా ముఖ్యమైనవే. అవి అభివృద్ధిలో భాగం పంచుకునేలా చూడాలి మనం. విద్యుత్ శ్మశానవాటిక లేకపోతే శవాలకు పెద్ద అవమానం జరుగుతుంది. మన శ్మశానాలలో వాటిని ఎటువంటి అవమానాలకు గురి చేశారో నేను చూశాను. కాబట్టి మానవత్వంతో కూడుకున్న దహన కార్యక్రమాల కోసం ప్రభుత్వం ఈ విద్యుత్ శ్మశానవాటికను నిర్మించింది.

"శవాల కోసం మేము మరిన్ని మంచి కార్యక్రమాలను చేపట్టబోతున్నాం. ఆ ప్రక్రియ నడుస్తున్నది. వాటిని మేము త్వరలోనే అమలులో పెట్టబోతున్నాం. ఉదాహరణకు ఎవరైనా చనిపోతే ఆనాడు అతడు ఓటు వేయవచ్చు. అదే విధంగా ఆస్తికొనుగోలు పత్రాల మీద వేలిముద్రలను వేసి తన అంగీకారాన్ని తెలుపవచ్చు. శవపరీక్షలను మేము నిషేధిస్తాం. ఇవాళ చనిపోయిన మనిషి సాధారణ వ్యక్తి కాడు. ఇతడు చాలా గొప్పవాడు. ఇతడు తన జీవితాంతం ప్రభుత్వానికి ఉపయోగపడటమే కాకుండా ఈ రోజు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం కోసం తన శవాన్ని విరాళంగా ఇచ్చాడు. ఇతడు నిజమైన అమరుడు. ఇతడు బతికి ఉన్నప్పుడు నాకు తెలిసినవాడే. ఇతడు చేసిన మంచి పనులు నన్నెంతగానో ప్రభావితుడిని చేశాయి. ఇప్పుడు ఇతణ్ణి దహనం చేసే అవకాశం నాకు దొరికింది.''

అంతలోనే శవం కదిలింది. గాగుల్స్ కింద పడిపోయాయి. పూలదండలు కూడా చెదిరిపోయాయి. గాల్లో చేతులు తిప్పడం ప్రారంభించింది శవం. చాలా మంది విపరీతమైన భయంతో అక్కడినుండి పరుగు తీశారు. మంత్రి ఆగి శవం వైపు చూసి, "ఏమైంది?'' అని అడిగాడు.

మృతుడు ఇలా అన్నాడు: "ఏం కాలేదు. దయచేసి మీ ఉపన్యాసాన్ని కొనసాగించండి. మీ మాటల్ని వింటుంటే నాకు హాయిగా ఉంది.'' మంత్రికి విపరీతమైన భయం కలిగింది. ఆలేఖ్

డాక్టరు దగ్గరికి పరుగెత్తి, "నువ్వేమో మరణ ధ్రువీకరణ పత్రం తెచ్చావు. ఇప్పుడేమైందో చూడు," అని అడిగాడు దబాయిస్తున్నట్టుగా.

ఆ వ్యక్తి చనిపోయాడని మళ్లీ ధ్రువీకరిస్తూ చెప్పాడు డాక్టర్. దగ్గరికి వెళ్లి బాగా పరీక్షించాడు. ఆ వ్యక్తి గుండె, నాడి రెండూ ఆగిపోయాయి. "ఇతడు మళ్లీ ఎలా బతికాడో చాలా ఆశ్చర్యంగా ఉంది నాకు," అన్నాడు.

ఆలేఖ్ కోపంతో ఊగిపోయాడు. "నేను నిన్ను సస్పెండ్ చేస్తాను. అరెస్ట్ చేయించి జైల్లో పెట్టిస్తాను. ఇప్పుడు మనం ఏం చేయాలో నువ్వే చెప్పు," అన్నాడు.

"విచార పడాల్సిందేమీ లేదు. కార్యక్రమాన్ని కొనసాగిద్దాం," అన్నాడు డాక్టర్ రే.

"నీకు అర్థం కావడం లేదా? శవం బతికింది. ఇప్పుడు దాని స్థానంలో ఏ శవాన్ని పెట్టగలం? ఫంక్షన్ను మధ్యలోనే ఎలా ఆపగలం? మంత్రిగారూ నేనూ అప్రతిష్ఠతో తలవంపుల పాలవుతాం. నువ్వు ఎంత పెద్ద పొరపాటు చేశావో ఊహించగలవా?"

డాక్టర్ రే తనమాట నుండి కొంచెం కూడా పక్కకు జరగలేదు. "నేనిచ్చిన మరణ ధ్రువపత్రం సరైనదని నా గట్టి నమ్మకం," అన్నాడు.

"అలా ఎందుకంటున్నావు?"

మంత్రి ధైర్యం తెచ్చుకున్నాడు. శవం ముఖం వెలిగిపోతోంది. దాని చేతులు కదులుతున్నాయి. కళ్లు బాగా తెరుచుకుని, మళ్లీ ప్రాణం వస్తోంది దానికి. మంత్రి వంగి, శవం చెవిలో కొన్ని మాటలు ఊదాడు. అది అద్భుతం చేసింది. శవం మళ్లీ ప్రాణరహితంగా మారింది. కళ్లు మూసుకుపోయి కాళ్లుచేతులు డీలా పడి పోయాయి. డాక్టర్ రే శవం దగ్గరికి పరుగెత్తుకుంటూ వచ్చి పరీక్ష చేసి, మరణాన్ని ధ్రువీకరించాడు మళ్లీ.

"ఆ వ్యక్తి ఒక అరుదైన వ్యాధితో బాధపడ్డాడని ముందే చెప్పాను నేను. అబద్ధం మాట్లాడినప్పుడల్లా అతనికి వ్యాధినుండి ఉపశమనం దొరికేది. నిజం మాట్లాడినప్పుడేమో వ్యాధి ఎక్కువయ్యేది, అని నేను చెప్పాను. జ్ఞాపకం చేసుకోండి."

"చెప్పావు సరే. అయితే ఏమిటి?"

"మంత్రిగారి ఉపన్యాసంలోని అబద్ధాలు ఆ శవం తిరిగి బతికేలా చేశాయి."

"ఇప్పుడేం చేద్దాం?"

"అది చాలా సులభం. ఇతని ప్రాణం మీ చేతుల్లో ఉంది. ఘోరమైన అబద్ధాలను అతని చెవుల్లో చెప్పండి. అప్పుడు బతుకుతాడు. లేదా కచ్చితమైన వాస్తవాన్ని చెప్పండి. అప్పుడు దాన్ని తట్టుకోలేక చనిపోతాడు. రెండిట్లో ఏది చేస్తారో మీ ఇష్టం," అన్నాడు డాక్టర్. ఆలేఖ్ గాభరా పడుతూ, భయంతో వణుకుతున్న మంత్రి దగ్గరికి పరుగెత్తాడు. ఆ పరిస్థితిలో ఏం చేయాలో ఆయనకు తెలియలేదు. సగం చదివిన ఉపన్యాస పత్రం అతని చేయిలో ఉంది. అది వాగ్దానాలతో నిండి ఉంది.

"అంతా సవ్యంగానే జరుగుతుంది సార్. కానీ మీరొక పని చేయాలి," అన్నాడు ఆలేఖ్.

"ఏమిటది?"

"ఒక పచ్చి నిజాన్ని మీరతని చెవిలో చెప్పాలి. అప్పుడు అంతా సర్దుకుంటుంది."

"పచ్చి నిజమా? అదెలా ఉంటుంది? జీవితంలో నేనెప్పుడూ నిజం చెప్పలేదు."

"అవును సార్. అందుకే మీరు జీవితంలో విజయాన్ని సాధించారు. కానీ ఇప్పుడు మాత్రం మీరు తప్పక అబద్ధం చెప్పాలి. లేకపోతే ఈ సమస్య సమసిపోదు. ఈ ఫంక్షన్ ఫెయిలవుతుంది."

"పచ్చి నిజమా?"

"అవును సార్."

"శ్రోతలకు వినపడేలా చెప్పాలా?"

"కాదు సార్, ఈ శవం చెవిలో చెప్పండి. అప్పుడు అంతా సర్దుకుంటుంది."

మంత్రి ధైర్యం తెచ్చుకున్నాడు. శవం ముఖం వెలిగిపోతోంది. దాని చేతులు కదులుతున్నాయి. కళ్లు బాగా తెరుచుకుని, మళ్లీ ప్రాణం వస్తోంది దానికి. మంత్రి వంగి, శవం చెవిలో కొన్ని మాటలు ఊదాడు. అది అద్భుతం చేసింది. శవం మళ్లీ ప్రాణరహితంగా మారింది. కళ్లు మూసుకుపోయి కాళ్లుచేతులు డీలా పడిపోయాయి. డాక్టర్ రే శవం దగ్గరికి పరుగెత్తుకుంటూ వచ్చి పరీక్ష చేసి, మరణాన్ని ధ్రువీకరించాడు మళ్లీ. మరణం పూర్తిగా సంభవించిందన్నాడు."

తర్వాత ఆ శవాన్ని చేంబర్ లో పెట్టారు. మంత్రి బటన్ ను నొక్కాడు. కెమెరాలు క్లిక్కుమన్నాయి. శ్రోతలు చప్పట్లు కొట్టారు. ఫంక్షన్ విజయవంతమైంది. గురు అందరికీ స్నాక్స్ పంచాడు.

కారులో మంత్రి తిరిగి వెళ్లిపోతుంటే పి.ఏ. ఇలా అడిగాడు: "ఆ శవం చెవిలో మీరు ఏం చెప్పారు సార్?"

"ఒక కఠోరమైన వాస్తవాన్ని చెప్పాను."

"నిజంగానా సార్?"

"అవును. గత్యంతరం లేకపోయింది."

"ఏ నిజం చెప్పారు సార్?"

"ఎంతో ఇబ్బంది పడుతూ చెప్పాను దాన్ని. అప్పట్నుంచి నాకు ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉంది."

"ఏం చెప్పారు సార్ చెవిలో?" పి.ఏ. మళ్లీ అడిగాడు.

"ఓ, అది నాకు చాలా బాధను కలిగిస్తోంది. దాన్ని మళ్లీ చెప్పలేను. చెప్తే నేను చనిపోవచ్చు."

పి.ఏ. ఆ సంగతిని వదిలేశాడు.

సమావేశ మందిరంలో నిశ్శబ్దం చోటు చేసుకుంది. అందరూ వెళ్లిపోయారు. డాక్టర్ రే మాత్రం ఒక మూలన నిలబడి ఉన్నాడు. ఆ వ్యక్తిని బతికించే అవకాశముండింది అనుకున్నాడతడు. తను రెండు ప్రత్యామ్నాయాలను సూచించాడు. పాపం దురదృష్టవంతుడు. ఆ వ్యక్తి బతికేవాడు, అనుకున్నాడాయన. కానీ ఎవరూ అతని మాటను వినలేదు.

కవిత

# ఆవహించు మాలో....



**అవుసుల భానుప్రకాశ్, 96032 04507**



జననము తప్ప యింక తన చావును జూపని వీరుడుండెనా?
మనములు పొంగిపోవు గద మాన్య సుభాషును దల్చినంతనే,
ఘనతర హిందుసేన తన గమ్యము లక్ష్యములంచు నిల్పె తా
ననితర సాధ్యుడయ్యె ధరనంతటట! భారత వీర పుత్రుడా!

ఒక్కడు వీరయోధుడిల నొక్కటి జేయగ సైన్యశక్తితో,
చక్కగ హిందుఫౌజు మన జాతిని నిల్పెను ధైర్యశక్తియై,
మిక్కిలి యుద్ధ నీతిగల మేధ, సెబాసన నిల్చె బోసు! తా
నక్కజమైన సేవకుడె యాతడు భారత వీరపుత్రుడా!

గుండుకు గుండె చూపుచును, గుండ్లకు గుండ్లను తిప్పికొట్ట, తా
మండిన గుండెతోడ వరమానిత శోభిత వీరసైన్యమున్,
కండలు దీర్చ దీర్చె! రణ కాంతులు జిమ్మగ భారతీయులే
దండులు దండులై చనిరి ధన్యులు! భారత వీరపుత్రుడా!

రక్తము మీరలిచ్చినను  రక్కసి మూకను దున్మియాడి నే
ముక్తిని దెత్తునంచు తన మోక్ష విలక్షణ శిక్షణమ్ముతో
శక్తిని మూటగట్టి, ఘన సత్వము నంతట చాటిచెప్పుచున్
భక్తిని చూపెభారతికి భవ్యుడు భారత వీరపుత్రుడా!

హిట్లరు వంటి వారలకు హెచ్చుగ భీతిరగిల్చె వీరుడై!
యట్లని వేడుకొన్న మరియాదగ,  రక్షణ నిచ్చె!, బోసుపై
హిట్లరు చేయివేయ భుజమింతయు తొణ్కక బెణ్కనీయడిం
కెట్లని జెప్పు కొందు మతడివ్విధి! భారతవీరపుత్రుడా!!

*(సుభాష్ చంద్రబోసును స్మరిస్తూ...)*

# సాహిత్యం - ఉద్యమం రెండూ ముఖ్యమే...

- డా॥ పసునూరి రవీందర్

**చందు తులసి కొత్త కోణాలకు పసునూరి స్పందనలు...**

సబ్బండ వర్ణాలు కలిసిన తెలంగాణ సాహిత్యవనంలో సింగిడిలా పూసిన సాహిత్యకారుడు డా.పసునూరి రవీందర్. మనకు సాధారణంగా పాట పేరు చెబితే గద్దర్, గోరేటి, కథ పేరు చెబితే అల్లం రాజయ్య , పెద్దింటి అశోక్ కుమార్, తెలంగాణ కవిత్వం అంటే కాళోజీ, అలిశెట్టి...ఇలా ఒక ప్రక్రియకు కొంత మంది పేర్లు గుర్తుకు వస్తాయి. కానీ డా. పసునూరి రవీందర్ పేరు వినగానే పాట, కథ, కవిత్వం, సాహిత్య పరిశోధన, విమర్శ...ఇలా విభిన్న ప్రక్రియలు గుర్తుకు వస్తాయి. ఒక్క ముక్కలో చెప్పాలంటే తెలంగాణ సాహిత్యానికి, బహుజన ఉద్యమానికి అవసరమైన సమయంలో అందివచ్చిన కొడుకు పసునూరి. వరంగల్‌లోని శివనగర్ బస్తీలో పుట్టి ఢిల్లీ కేంద్ర సాహిత్య అకాడమీ దాకా సాగిన పసునూరి రవీందర్ ప్రస్థానం గురించి ఆయన మాటల్లోనే అడిగి తెలుసుకుందాం.

**పసునూరి రవీందర్ గారూ....తాజాగా మీ రెండో కథా సంకలనం "కండీషన్స్ అప్లయ్" తీసుకొచ్చారు. అభినందలు. పాటగాడిగా, కవిగా, కథకుడిగా, పరిశోధకుడిగా, జర్నలిస్టుగా, బహుజన ఉద్యమకారుడిగా...ఇలా బహుముఖాలుగా సాగుతుంటారు. అసలు సాహిత్యం అంటే మీకు ఇంత వలపాచన ఎందుకు..?**



ధన్యవాదాలు చందుగారు! సామాజిక అంతరాల సమాజం మనది. ఈ సమాజాన్ని మార్చాల్సిన బాధ్యత ఈ కాలపు పౌరసమాజం, మేధావులు, సృజన కారులదే. బాబా సాహెబ్ అంబేద్కర్ "ఏ దేశ భవిష్యత్ అయినా ఆ దేశ మేధావుల మీదే ఆధారపడి ఉంటుంది'' అన్నాడు. ఈ నేపథ్యం నుండి చూసినప్పుడు దళిత సమాజం నుండి చదువుకొని ఎదిగి వచ్చినవాడిగా నా వంతు బాధ్యతను పోషించాల్సిన అవసరం నాకు ముందుకు వచ్చింది. నేను నా జాతి విముక్తి కోసం ఏం చేయగలను? అని ఆలోచించినప్పుడు సాహిత్యం ద్వారా నా వంతుగా కలాన్ని , గళాన్ని అందివ్వగలను అని అర్థమయ్యింది. దానినే నా సామాజిక బాధ్యతగా నిర్వర్తిస్తున్నాను. ఇక మీరు అడిగిన బహుముఖాలు నేను తెచ్చిపెట్టు కున్నవి కావు. ఆయా ఉద్యమ అవసరాలు నన్ను అలా మలిచాయి. దేనిని వదులు కోలేని మమకారం నాకు వీటన్నింటిపై ఉంది. ఇవ్వన్నీ సాహిత్యంలో అంతర్భాగమే కాబట్టి కొనసాగిస్తున్నాను. నాకంటే ముందు తెలంగాణ నేల మీద ఎందరో ఇట్లా ఆయా ఉద్యమాల్లో బహుముఖ పాత్రలు పోషించారు. పోషిస్తున్నారు.

**వరంగల్ లోని శివనగర్ నుంచి సెంట్రల్ యూనివర్శిటి దాకా సాగిన మీ ప్రయాణం గురించి చెప్పండి?**

ఈ ప్రపంచంలో చదువును మించిన ఆయుధం లేదన్నాడు దక్షిణాఫ్రికా మహానేత నెల్సన్ మండేలా. అలాంటి చదువుబాట పట్టించారు మా అమ్మానాన్న వరవ్వ-వీరస్వామి. నిజానికి అమ్మానాన్న ఇద్దరూ నిరక్షరాస్యులే. దళితులందరిలాగే మాది కూడా పేద కుటుంబమే. అమ్మానాన్న రెక్కల కష్టమే మాకు బుక్కెడు బువ్వ పెట్టింది. కాకుంటే నలుగురు పిల్లలను చదివించడానికి మా అమ్మానాన్న ఇద్దరు ఎన్ని కష్టాలు పడ్డారో తలుచుకుంటే దు:ఖమొస్తది. మా నాన్న రిక్షాతొక్కాడు. అమ్మ వరంగల్ గ్రేన్ మార్కెట్‌లో కూలీగా పని చేసింది. కూరగాయలు అమ్మింది. మాకు ఆత్మ గౌరవ బాట చూపేందుకు వాళ్లు అవమానాల చేదును దాచుకున్నారు. అలా నన్ను, మా ముగ్గురు తమ్ముళ్లను ఉన్నత చదువులు చదివించారు. ఒక కూలీ కడుపున పుట్టిన బిడ్డలుగా మా నలుగు రిలో ఇద్దరం దేశానికే తలమానికమైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీలు చేసి డాక్టరేట్ పట్టాలు అందుకున్నాం. చిన్నతమ్ముళ్లో ఒకరు డాక్టర్‌గా, మరొకరు మల్టీనేషనల్ కంపెనీ ఉద్యోగిగా రాణిస్తున్నారు.

**సెంట్రలో యూనివర్సిటీలో కూడా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం...చాలా పోరాటం చేశారు. ఆ ఉద్యమం గురించి కొన్ని అనుభవాలు చెప్పండి?**

ముఖాముఖి

అవును, ఉద్యమం రాజుకున్న 2009నాటికి నేను హెచ్‌సీయూ క్యాంపస్‌లో స్టూడెంట్ జేపీసీ ముఖ్య నాయకుల్లో ఒకరిగా ఉన్నాను. అందువల్ల తెలంగాణ ఉద్యమానికి నా వంతు పాత్ర పోషించడానికి వీలయ్యింది. అలాగే క్యాంపస్ బయట తెలంగాణ వ్యాప్తంగా అనేక సభల్లో, సమావేశాల్లో వక్తగా, కవి-గాయకునిగా పాల్గొన్నాను. ఇక తెలంగాణ సాహిత్య ప్రస్థానంలో ఎస్సీఎస్టీబీసీమైనారిటీ గొంతుకగా సింగిడి తెలంగాణ రచయితల సంఘం ఆవిర్భా వానికి నేను క్రియాశీలక పాత్ర పోషించాను. కన్వీనర్‌గా అనేక కార్యక్రమా లు నిర్వహించాను. పలు పుస్తకాలకు సంపాదకునిగా వ్యవహరించాను. ఉద్యమాన్ని ఉగ్రూతలూగించిన "జై కొట్టు తెలంగాణ'' వంటి పాటలు, కవితలు, వ్యాసాలు రాశాను. నేను రాసిన 'లడాయి' దీర్ఘ కవితను ప్రొ.జయశంకర్ గారు కాకతీయ యూనివర్సిటీ 'విద్యార్థి పాలికేక' సభలో ఆవిష్కరించారు. నా ఆధ్వర్యంలో హెచ్‌సీయూలో జరిగిన పోరాటంలో భాగంగా గచ్చిబౌళి స్టేడియంకు "భాగ్యరెడ్డివర్మ స్టేడియం''అని పేరు పెట్టాలని స్టేడియం గేటు గోడల మీద రాయించాను. ఇట్లా మరెన్నో మరిచిపోలేని అనుభవాలు తెలంగాణ ఉద్యమంలో నాకున్నాయి.

**మీ మొదటి కథ ఏమిటీ...దాని వెనుక నేపథ్యం ఏమిటీ..**

నిండా ఇరవై యేళ్లు కూడా నిండక ముందే నన్ను సాహిత్య పిచ్చి ఆవహిం చింది. నిత్యం ఏదో రాయాలనే ఆలోచన నన్ను సాహిత్య బాట పట్టించింది. నా



మొదటి కథ 2001లో "వలస పక్షులు'' ప్రజాశక్తి దినపత్రికలో అచ్చయ్యింది. అది వలసపాలకుల కాలంలో వశపడని కరువు కాలం. రైతులు ఆకలి చావులు చస్తున్న కాలం. ఇక రైతు కూలీలది, చిన్న, సన్నకారు రైతులది చెప్ప వశంగాని దు:ఖం. అలా రైతు బతుకు నుండి బిచ్చగాడిగా మారిన ఓ రైతు అన్నం అడుక్కుంటు కనిపించిన ఘటన నన్ను కదిలిస్తే ఆ కథ రాశాను.

**చాలామంది...పట్టణాల్లో అంటరాని తనం ఉండదు అంటారు. కానీ మీ కథలు పట్టణాల్లో ఉన్న అంటరానితనం, దళిత వివక్షను పట్టి చూపినవి. వాళ్ల విమర్శకు ఎలా సమాధానమిస్తారు..?**

మన సమాజమే ద్వంద్వ విలువలతో కూడుకొని ఉంది. తన పిల్లల్ని ఇంగ్లీషు కాన్వెంట్‌లో చదివించేటాయన మాతృభాషను కాపాడుకోవాలని వేదికల మీద గొంతు చించుకుంటుంటాడు. అలాగే నిత్యం కులాన్ని పాటించే మన సమాజం, అంతా మారిపోయిందని భ్రమిస్తుంటుంది. ఇట్లా మాట్లాడేవారికి కుల వివక్ష తాలూకు కనిపించని హింస నయాపైస మందం కూడా తెలియదు. అది అనుభవించేవాడికే తెలుస్తుంది. ఇదే పట్టణాల్లో ఇల్లు కిరాయికి కావాలంటే మీరు వెజిటేరియన్నా? నాన్ వెజిటేరియన్నా?! అని అడుగుతూ కులం తెలుసు కుంటారు. ఈ సమస్య గేటెడ్ కమ్యూనిటీల్లో చాలా ఎక్కువగా ఉంది. కార్పోరేటు కాలంలో టెక్నాలజీ విస్తరిస్తున్నట్టు కనిపిస్తుంటుంది కానీ, మరోవైపు కులం కూడా మరింత బలపడుతోంది. రియలెస్టేట్ వెంచర్‌లుగా, వాట్సాప్ కుల గ్రూపులుగా, వనభోజనాలుగా...కులాలు, కులాలుగా విడిపోతూ బతుకుతుంటుంది పట్నం. ఇది బాధితులకు మాత్రమే కనిపిస్తుంది.

**మొదట రాసింది పాట, తరవాత కవిత్వం, తరువాత కథ, సాహిత్య పరిశోధన..ఇలా విభిన ప్రక్రియల్లో ఉండేవాళ్లు అరుదు. ఒక ప్రక్రియే కాకుండా ఇలా ఎందుకు విభిన్న ప్రక్రియలను ఎంచుకోవడం...?**

ఆయా ఉద్యమ అవసరాలే నాతో ఇలా రాయిస్తున్నాయి అని నేను నమ్ముత. అయితే ఒకటి కన్నా ఎక్కువ ప్రక్రియలు












రాసేవారు ఎంతో మంది ఉన్నారు. కాకుంటే ఆ ప్రక్రియలో ప్రవేశం వరకే ఉంటే సరిపోదు. పాఠకుల చేత మెప్పించ గలగాలి. ఒక కవిత రాసినా, కథ రాసినా, వ్యాసం రాసినా అది పాఠకులను చాలా రోజుల వరకు వెంటాడాలి. అందులో మనం రాసిన విషయం వారికి వారి జీవితంలోని అనుభవంగా గుర్తుకు రావాలి. అలాంటి అనుభవం లేకుంటే ఎక్కడో అది ఎదురుపడ్డప్పుడు...అవును ఒక రచయిత ముందే ఈ విషయాన్ని చెప్పాడు అని తెలుచుకోవాలి. మనం ఇవాళ జాషువాను, వట్టికోట ఆళ్వారు స్వామి, శ్రీశ్రీ తదితరులను తలుచుకుంటున్నట్టు మన రచనల్ని కూడా తలుచుకునేట్టు రాయగలగాలి. ఆ సత్తా లేకుండా అన్ని ప్రక్రియల్లో కాలుపెట్టడం అనవసరం. నేను రాసిన పాట, కవిత్వం, కథ, విమర్శ, పరిశోధన ప్రముఖుల చేత ప్రశంసించబడడం వల్ల నాలో నేను ఏదైనా రాయగలను అనే నమ్మకం కలిగింది. అదే కొనసాగిస్తున్నా. అన్నింటికంటే ముఖ్యం సామాజిక పరివర్తన. అందుకోసం రాసేటపుడు వస్తువే దాని రూపాన్ని ఎంచుకోవడం నాకు తెలియకుండానే జరిగిపోతుంది.

**మరి నవలను మాత్రం ఎందుకు దూరం పెట్టారు. ఇప్పటి వరకూ నవల రాయకపోవడానికి కారణం..**

నవల క్యాన్వాసు చాలా పెద్దది. గడిచిన కొన్ని సంవత్సరాలుగా ఒక మంచి నవల రాయాలని ఎంతో ప్రయత్నిస్తు న్నాను. కానీ సమయం సరిపోవడం లేదు. మా కుటుంబంలో మూడు తరాలు ఉద్యమాల్లోనే జీవించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నుండి తెలంగాణ సాధన వరకు ఏడు, ఎనిమిది దశాబ్దాల కాలపు జీవితం తెలుసు నాకు. అనేక ఉద్యమాలు, పోరాటాలు, త్యాగాలు, కష్టాలు, కన్నీళ్లు, అవమానాలు, ఆత్మ గౌరవ సంఘర్షణలు ఎన్నో తెలుసు నాకు. అవన్నీ నేను మాత్రమే రాయాలి. రాయడం వరకే నా పని అయితే ఎప్పుడో రాసేవాణ్ణి. కాకుంటే సామాజికంగా నా



జాతి కోసం నేను మరెన్నో పనులు చేయాల్సి వస్తుంది. అందుకే నేను కుదురుగా నవలా రచన మీద కూర్చోలేక పోతున్నాను. కాకుంటే ఆల్రెడీ ఒక నవల రాయడం మొదలుపెట్టిన. త్వరలోనే మీ ముందుకు వస్తుంది.

**బహుజన పాటగాళ్లు, సాహిత్యకారుల మరణాన్ని చాలామంది పట్టించుకున్నట్టు కనపడదు. మీరు అనేక పత్రికల్లో స్మృతి వ్యాసాలు రాశారు. దాని గురించి వివరించండి.**

బాలగోపాల్ గారు ఒక సందర్భంలో "ఈ దేశంలో ప్రతిభ అనేది వ్యక్తిగత సామర్థ్యం వల్ల కాకుండా కులం ఆధారంగా నిర్ణయించడుతుంది" అన్నారు. నిజమే, జీవితకాలం ఒక కళకోసం జీవించిన బహుజనులకు ఈ దేశంలో పెద్దగా ఒరిగిందేమి లేదు. వారంతా అనామకులుగా చరిత్ర గర్భంలో మిగిలిపోవడం నాకు ఇష్టం లేదు. పైగా నాకు అకాల మరణాల పట్ల తీరని వేదన ఉంది. అందుకే ఈ సమాజం కోసం తమ జీవితాన్ని ధారపోసిన సృజనకారులు ఎవరు చనిపోయినా నేను చూస్తు ఉండలేకపోయాను. వారి కృషిని ఇదిగో ఈయన ఇన్ని పనులు చేశాడు అని లెక్కగట్టి తేల్చి చూపే పని చేశాను. తెలంగాణ అస్తిత్వమైనా, దళిత, బహుజన జీవితాలైనా అలా విస్మరణకు గురైనవే అనేది మనందరికీ తెలిసిన విషయమేగా.

**తెలంగాణ కథ శిల్పపరంగా చూస్తే తెలుగు కథగా చెప్పే ఆంధ్ర ప్రాంత రచయితలు రాస్తున్న కథతో వెనుకబడి ఉందని ఒక ఆరోపణ ఉంది. దీనిపై ఎలా స్పందిస్తారు.**

ఈ ఆరోపణను నేను వ్యతిరేకిం చాను. ఇప్పుడు కూడా వ్యతిరేకిస్తున్నాను. తెలంగాణ కథకు శిల్పం లేదనడం సరైంది కాదు. తెలంగాణ కథకుల్లో ఎందరో గొప్ప శిల్పచాతుర్యంతో కథలు రాసినవారు ఉన్నారు. అయినా సరే పదే పదే ఈ రకమైన ప్రస్తావనను ముందుకు తీసుకు రావడం రివాజుగా మారింది. నిజానికి ఏది శిల్పం? ఏది గొప్ప శిల్పం అవుతుందనే నిర్ణయానికి తూనికరాళ్లు ఏమిటనేది నా ప్రశ్న. బహుజన జీవితాల్లో ఉండే దు:ఖాన్ని, బాధను చెప్పడానికి వీలు లేకుండా రస, కళావాదాల మాటున శిల్పం పేరుతో కొత్తకథకుల గొంతు నొక్కే కుట్రే ఇదంతా. గొప్ప కథకు జీవితమే ముడిసరుకు. దాన్ని శిల్ప పరంగా తీర్చిదిద్దడానికి స్వానుభవమే గొప్ప సాధనం. కాబట్టి తెలంగాణ కథకు శిల్పం లేదనే వాదనలో అర్థంలేదు. తెలంగాణ కథ లేకుండా తెలుగు కథ పరిపూర్ణం ఎప్పటికీ కాలేదు.

**మీ పరిశోధనకు పాటను ఎంచు కోవడం వెనుక కల ప్రత్యేక కారణం ఏమిటి?**

ఉద్యమం మీద, ఉద్యమ సాహిత్యం మీద ఉన్న ప్రేమాభిమానాలే కారణం. విశ్వవిద్యాలయాల్లో దశాబ్దాలుగా పరిశోధన మూస ధోరణుల్లోనే కొనసాగింది. ఛందస్సు, వ్యాకరణం, అలంకారాలంటూ

ముఖాముఖి

1980ల దాకా కొనసాగింది. ఆ తరువాత అస్తిత్వవాదాలు వచ్చాయి. వాటి ప్రభావంతో కొంత మార్పు యూనివర్సిటీ పరిశోధనల్లో వచ్చాయి. దీనికి అకాడ మిక్స్‌లో అంతర్జాతీయంగా వస్తున్న మార్పులు కూడా కారణమయ్యాయి. కానీ పాటను గురించి యూనివర్సిటీలు పట్టించుకోవాల్సినంతగా పట్టించుకోలేదు. బిరుదురాజు రామరాజుగారు తెలుగు జానపదగేయసాహిత్యం మీద పరిశోధన చేస్తాను అన్నప్పుడు యూనివర్సిటీలు ఆశ్చర్యకరంగా చూశాయట. ఆ తరువాత జయధీర్ తిరుమలరావు, ఎస్వీ సత్యనారాయణ, కె.ముత్యం వంటి వారు పాట మీద ప్రత్యేక పరిశోధన దృష్టిని సారించారు. ఈ నేపథ్యంలో నా కాలానికి తెలంగాణ రాష్ట్ర సాధన నేపథ్యంలో వచ్చిన పాటల మీద పరిశోధన జరుగలేదనే ఖాళీ నన్ను ఆశ్చర్యపరిచింది. అందుకే నేను ఆ పాటల మీద పరిశోధనకు పూనుకున్నాను. నా గురువు ఆచార్య పిల్లలమర్రి రాములుగారి పర్యవేక్షణలో నా పరిశోధనను పూర్తి చేశాను. ఈ పీహెచ్‌డీ వైవాకు ఎక్స్‌పర్ట్‌గా విచ్చేసిన ఆచార్య కాత్యాయని విద్మహేగారు "చక్కని పరిశోధన చేసిన రవీందర్ భవిష్యత్ పరిశోధనకు గొప్ప ఆశను కలిగిస్తున్నాడు. ఇంతమంచి గ్రంథం చదివినందుకు గర్విస్తున్నా" అన్నారు. ఆ తరువాత ఈ పరిశోధనకు విమర్శకులు, పరిశోధకుల నుండి మంచి ప్రశంసలు లభించాయి. తెలంగాణ ఎన్నారై అసోసియేషన్ వారు సురవరం ప్రతాపరెడ్డి పురస్కారం క్రింద యాభైవేల గ్రాంటును ఇచ్చి పుస్తకం ముద్రించారు. అట్లా నా పరిశోధన గ్రంథం ఇవాళ పరిశోధకులకు ఒక ప్రామాణికంగా మారింది. ప్రముఖ విమర్శకులు ఎస్.జగన్‌రెడ్డిగారు ఈ గ్రంథాన్ని తెలంగాణ రాష్ట్రం వచ్చాక వెలువడిన "గ్రంథ రాజం" అన్నారు.

**మీ మీద ఏ కథకులు, సాహిత్యకారుల ప్రభావం ఉన్నది.**

ఈ సమాజానికి తన సాహిత్యంతో షాక్ ట్రీట్‌మెంట్ ఇచ్చిన జాషువా మొదలు అనేకమంది ప్రభావం నా మీద ఉంది. ఒక్కో ప్రక్రియలో ఒక్కొక్కరి ప్రభావం ఉంది. వారందరి పేర్లు చెప్పాలంటే లిస్టు చాలా పెద్దగనే అవుతుంది.

**ఔటాఫ్ ఏరియా కథలతో పోలిస్తే ఈ కండీషన్స్ అప్లయ్ కథలతో పోలిస్తే కథకుడిగా మీలో ఎలాంటి మార్పు మీరు గమనించారు. ఉదాహరణకు ఈ సంకలనంలో బతుకుమర్మంలాంటి కథ మీరు రాసే కథలకు కొంత భిన్నంగా ఉంది. ఎలా?**

మీరు సరిగ్గా అంచనా వేశారు. ఏ రచయితకైనా అనుభవం గడుస్తున్న కొద్ది అతడి వస్తువిస్తృతి పెరగాలి. లేకుంటే అతడు మూసలో బతికే ప్రమాదం ఉంది. పైగా ఆయన అనగానే కొన్ని రచనలే గుర్తుకు వస్తాయి. ఇలా కాకుండా సమాజం చలనశీలమైంది. రచయితకు సమాజ చలనసూత్రాలను అర్థం చేసుకోగలిగితే ఎన్నో విషయాలు అతని సాహిత్యానికి ముడి సరుకుగా మారుతాయి. నా విషయానికొస్తే నాకు దళిత అస్తిత్వంతో పాటు తెలంగాణ అస్తిత్వం కూడా నాకు ముఖ్యమే అవుతుంది. అలా నేను తెలంగాణ అవతరణ అనంతర పరిణామాలను సైతం కథలుగా మలిచే ప్రయత్నం చేస్తున్నాను. ఇందుకు సామాజిక, రాజకీయ, ఆర్థిక ప్రకంపనలన్నీ నాకు తెలియకుండానే నా కథల్లోకి వచ్చి చేరుతున్నాయి. అట్లా ఫిలాసాఫికల్ అప్రోచ్‌తో కూడిన కథే బతుకుమర్మం. దళితుల జీవితాల్లోని బాధలు, కష్టాలు, కన్నీళ్లు మాత్రమే కాకుండా మరెన్నో రికార్డు కావాల్సి ఉంది. ముఖ్యంగా సంస్కృతి, తాత్వికత మీద కథలు రావాల్సిన అవసరం ఉంది.

**కథకులు లేదా ఏ సాహిత్యకారు డికైనా ఉద్యమాలతో సంబంధం ఉంటే అతనిలోని సృజనకు పరిమితులు ఉంటాయి అంటారు. నిజమేనా..?**

ఇది పాక్షిక సత్యం. ఇవే రాయాలి. ఇలాగే రాయాలి అనే ఆంక్షలు ఒక రచయిత యొక్క స్వేచ్ఛను హరిస్తాయి. అలా కాకుండా రాయాల్సిన విషయం యొక్క ప్రాసంగికతను రచయిత తనంతట తానుగా కనుగొని, స్వతంత్రంగా రాసేలా ఉద్యమప్రభావం ఉండాలి. నిజానికి ఉద్యమకాలంలో వచ్చిన రచనల్లోనే పదునెక్కువగా ఉంటుంది.

**నిత్యం ఏదో పనిలో తలమునకలై ఉండే మీరు మీకు కుటుంబంతో ఉన్న అనుబంధం, మీకు వాళ్ల సహకారం గురించి చెప్పండి?**

నాన్న బతుకు విలువను నేర్పితే, అమ్మ ఏటికి ఎదురీదడం నేర్పింది. ఎందరో త్యాగధనులు ఈ సమాజం కోసం ఎట్లా బతకాలో నేర్పారు. ఇక నా కుటుంబం విషయానికొస్తే మా తమ్ముళ్లు నాకు కొండంత అండగా నిలుస్తారు. నా పట్ల, నా మాట పట్ల వారికుండే గౌరవం, నా ఎదుగుదల మీద వారికుండే గర్వం నాకు సంతోషాన్ని కలిగిస్తాయి. ఆ తరువాత నా సగం విజయాలకు నా సహచరి రజితే కారణం. చాలా ఓపికగా నన్ను భరిస్తుంటుంది. కుటుంబానికి ఇవ్వాల్సినంత సమయం ఇవ్వడం నాకు కుదరదు. అందుకే పిల్లలు కూడా క్రమంగా అలవాటు పడిపోయారు. సాహిత్యమే నాకు ప్రథమ ప్రాధాన్యతగా కనిపిస్తుంటది.

**మీ భవిష్యత్ ప్రణాళికలు?**

పాతికేళ్లుగా సాహిత్యంలో మునిగిన నాకు రాయాల్సినంత రాయలేకపోయాను అనే అసంతృప్తి ఉంది. అందువల్ల ఆ దిశగా దృష్టి సారించాలనుకుంటున్నాను. ఈ ప్రయాణంలో నా నుండి మరిన్ని రచనలు రావచ్చు. అలాగే సామాజికంగా దళిత-బహుజన జీవితాల్లో మార్పు కోసం నా వంతుగా పాటు పడాలనుకుంటున్నాను. సాహిత్యం - ఉద్యమం నాకు రెండూ రెండుకళ్ల వంటివి.

ఇంటర్వ్యూ:
**చందు తులసి**
7702648825



వ్యాసం

# విశిష్ట మహిళా సాహితీమూర్తులు

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశిష్ట మహిళాపురస్కార స్వీకర్తల పరిచయ వ్యాసం...**



సాగర్ల సత్తయ్య
7989117415

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న ఇరవై ఏడు మంది మహిళలకు ప్రతిష్ఠాత్మక విశిష్ట మహిళా పురస్కారాన్ని అందించింది. అందులో సాహిత్య రంగానికి చెందిన ముగ్గురు మహిళామూర్తులను పరిచయం చేయడం ఈ వ్యాసం ఉద్దేశం.

**సాహితీ సవ్యసాచి అరుణ నారదభట్ల...**

తెలుగు సాహిత్యంలో విశిష్ట ప్రక్రియలైన పద్యంలోనూ, వచన కవిత్వంలోనూ గద్య రచనలోనూ తనదైన ప్రత్యేక ముద్ర వేస్తున్నారు పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన అరుణ నారదభట్ల. సామాజిక స్పృహ పర్యావరణ స్పృహ ఉన్న రచయిత్రి. దశాబ్ద కాలంగా రచనలు వెలువరిస్తున్నారు. ఇన్నాళ్ళ మౌనం తర్వాత, లోపలి ముసురు అనే వీరి కవిత్వ సంపుటాలు తెలుగు సాహిత్యంలో వీరిని లబ్ధ ప్రతిష్ఠులుగా నిలిపాయి. గాఢత ఉన్న వచన కవిత్వం వ్రాసిన కవులు పద్య రచన చేయడం కొంత అరుదుగానే గమనిస్తాం. అనేక విశేష వృత్తాలలో పద్యాన్ని సైతం పరుగులు పెట్టించడం వీరి కలానికే సాధ్యం. ఇటీవల వందమంది కవులు వందేసి విశేష ఛందస్సుతో కూడిన పద్యాలతో పదివేల పద్యాల బృహత్ గ్రంథం అనంత ఛంద సౌరభం వెలువడింది. ఈ గ్రంథంలో రాసిన వందమందిలో అరుణ నారదభట్ల రాసిన వంద పద్యాలు ఉండడం గమనార్హం. నా అమర్నాథ్ యాత్ర పేరిట వీరి యాత్రా రచన ముద్రణ దశలో ఉంది.

వీరి కవిత్వ సంపుటాలను పరిశీలిస్తే మొదటి కవిత్వ సంపుటి 'ఇన్నాళ్ళ మౌనం తర్వాత' మానవీయ బంధాలకు పట్టం కట్టింది. రెండవ కవిత్వ సంపుటి 'లోపలి ముసురు'లో ప్రాకృతిక సౌందర్యం, పర్యావరణ స్పృహతో పాటు శ్రమైక జీవన సౌందర్యం సామాజిక స్పృహ కనిపిస్తాయి.

"బ్రతుకు పోరులో చుక్కానిలా కవిత్వం
కొత్త దారుల్లో పూలై పూస్తుంది
అగాధాలన్నీ మూటకట్టి ఆవల పారేస్తుంది
చూసే కళ్ళకు చూసినంత
ఆస్వాదించే మనసుంటే ప్రతిదీ సౌందర్యమే కానరాని లోకాలన్నీ
అందంగా ఆరా తీసే నేస్తం
కేవలం కవిత్వం మాత్రమే!" అంటూ కవిత్వాన్ని సరికొత్తగా నిర్వచించారు.

"మా ప్రాచీన సంపద మా సంస్కృతి
మా మట్టి తలపై నిలిచిన హిమసౌధం
అన్నీ మా భరతఖండ మహోన్నత శిఖరాలు!
కట్టని సహజ వజ్రపు కోటలు!"
అంటూ తమ కవిత్వం ద్వారా దేశభక్తిని చాటారు.

కేంద్ర సాహిత్య అకాడమీ నిర్వహించిన యువకవుల సమ్మేళనం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పలు కవి సమ్మేళనాలు, ఆల్ ఇండియా రేడియోలో కవిత్వ పఠనం, తెలంగాణ జాగృతి కవి సమ్మేళనాలలో పాల్గొన్నారు. పలు సాహిత్య సంస్థలచే సన్మానాలు అందుకున్నారు. తన కృషిని గుర్తించి సాహిత్య విభాగంలో తెలంగాణ ప్రభుత్వం విశిష్ట మహిళా పురస్కారం ప్రకటించడం పట్ల హర్షం ప్రకటించారు.

**కేంద్ర సాహిత్య అకాడమీ నిర్వహించిన యువ కవుల సమ్మేళనం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పలు కవి సమ్మేళనాలు, ఆల్ ఇండియా రేడియోలో కవిత్వ పఠనం, తెలంగాణ జాగృతి కవి సమ్మేళనాలలో పాల్గొన్నారు. పలు సాహిత్య సంస్థలచే సన్మానాలు అందుకున్నారు. తన కృషిని గుర్తించి సాహిత్య విభాగంలో తెలంగాణ ప్రభుత్వం విశిష్ట మహిళా పురస్కారం ప్రకటించడం పట్ల హర్షం ప్రకటించారు.**

వ్యాసం

## విశిష్ట బాలసాహితీమూర్తి డాక్టర్ కందేపి రాణి ప్రసాద్

తెలుగు సాహిత్యంలో బాలసాహిత్యం ఒక విశిష్టమైన ప్రక్రియ. శిశువు మూర్తిమత్వాన్ని తీర్చిదిద్దడానికి ఉపయుక్తమైన సాహిత్యాన్ని అందించే బాలసాహిత్యాన్ని రాస్తూ తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్నారు సిరిసిల్లకు చెందిన డాక్టర్ కందేపి రాణి ప్రసాద్. బాలసాహితీవేత్తగా, అనువాదకురాలిగా, వ్యాసకర్తగా విభిన్న ప్రక్రియలలో సాహితీసేద్యం చేస్తున్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు అంగలకుదుటి సుందరాచారి కుమార్తె అయిన రాణి ప్రసాద్ విద్యార్థి దశ నుండే సాహితీ సృజన చేస్తున్నారు.

నేషనల్ అడల్ట్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంలో బోధకురాలిగా, ఆంధ్రా యునివర్సిటీ, వాల్తేరులో కౌన్సిలర్‌గా, స్కూల్ ఆఫ్ డిస్టేన్స్ లెర్నింగ్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ కాకతీయ యునివర్సిటీ, వరంగల్లో అధ్యాపకురాలిగా సేవలందించారు.

'పూలతోట' (కవితా సంకలనం), 'సరదా సరదా బొమ్మలు', 'హరివిల్లు' (కవితా సంకలనం), 'నెలవంక' (కవితా సంకలనం), 'సైన్స్ పాయింట్' 'నంది వర్ధనాలు' నానీలు 'బాల్యమా ఎక్కడ నీ చిరునామా!' వ్యాసాలు, 'విహారం' యాత్రా కథనాలు 'కస్తూరిబా' జీవిత చరిత్ర 'మిఠాయిపొట్లం', 'సైన్స్ వరల్డ్' సైన్స్ వ్యాసాలు, సీతాకోకచిలుక' సైన్స్ గేయాలు, 'హౌస్ వైఫ్' (కవిత్వం), 'సైన్స్ కార్నర్' (సైన్స్ వ్యాసాలు), 'పూలజడ' (బాల్య జ్ఞాపకాలు), 'స్వీటీ మిల్కీ ఓ చిలుక' (బాలల కథలు), 'ద్రాక్ష గుత్తులు' (బాలగేయాలు), 'కనుచూపు మేర' (యాత్రాకథనాలు), 'సౌరభం' (బాలసాహిత్య వ్యాసాలు) 'పజిల్స్ ప్లాంట్' (పిల్లల పజిల్స్) 'బొటనికల్ జూ' (వెజిటబుల్ కార్వింగ్ వ్యాసాలు) 'సృజన', క్వారంటైన్, డాక్టర్ చెప్పిన కథలు, నా జ్ఞాపకాల్లో అమ్మ మొదలైనవి వీరి రచనలు.

'మై పిక్చర్స్' మాస్టర్ కె.స్వాప్నిక్ బొమ్మల పుస్తకం, 'లిటిల్ హార్ట్స్' మాస్టర్ కె. సృజన్ స్వాప్నిక్‌ల 'మొగ్గ' వ్యాసాల పుస్తకం, 'పుష్పాంజలి' (అంగలకుదిటి గోవిందమ్మ), 'టిక్ టాంబుర' (బాలల జానపద కథలు) మొదలైన గ్రంథాలకు సంపాదకత్వం వహించారు.


అరుణ నారదభట్ల


డా॥ కందేపి రాణి ప్రసాద్


డా॥ బండారు సుజాత శేఖర్

చక్రాల కథ, మంగు బొంగరం, నాకొక జిరాఫీ కావాలి, నాకు శలవు లొచ్చాయి, మనసు పక్షి, బొమ్మ షికారు, పర్వతాలపై ప్రయాణం, అపరంజి బొమ్మ, రాహుల్ మరియు కళల బ్యాటు మొదలైన గ్రంథాలను ఇతర భాషల నుండి తెలుగులోనికి అనువదించారు.

రాణి ప్రసాద్ పుస్తకాలు కూడా ఇతర భాషలలోనికి అనువదించబడ్డాయి. తన తొలి గ్రంథమైన పూలతోటను గార్డెన్ పేరుతో ఆంగ్లంలోనికి పూల్ వారి పేరుతో హిందీలోనికి రవితాకూర్ అనువదించారు సీతాకోకచిలుక గ్రంథాన్ని 'తితలి', పేరుతో పుట్ల పరమేశ్వర్ హిందీలోకి అనువదించారు.

'సింగపూర్ తెలుగు సమాజం' ఆహ్వానంపై 2002 - సింగపూర్ తెలుగు మహాసభల్లో పాల్గొన్నారు. 'బొంబాయి ఆంధ్ర మహాసభ సత్కారం', 'ఆంధ్ర సంస్కృతి సమితి' ఒరిస్సా సత్కారం, అందుకున్నారు. అనేక చిత్రకళా ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. వివిధ పత్రికలలో పిల్లల కోసం అనేక శీర్షికలు నిర్వహించారు. సైన్సు, బాల సాహిత్యంపై పాఠశాలల్లో కళాశాలలో విరివిగా అవగాహన సదస్సులు నిర్వహించారు. తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారంతో పాటు అనేక సంస్థల పురస్కారాలు అందుకున్నారు. బాలసాహిత్య విభాగంలో ప్రతిష్ఠాత్మక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశిష్ట మహిళా పురస్కారాన్ని అందు కోవడం పట్ల రాణిప్రసాద్ తన ఆనందాన్ని ప్రకటించారు.

## తెలంగాణ సాంస్కృతిక పరిశోధకురాలు....

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ సంస్కృతి పట్ల వివక్షత కొనసాగుతున్న రోజుల్లో బతుకమ్మ పాటలలోని వైభవాన్ని ప్రపంచానికి చాటారు బండారు సుజాత శేఖర్. నల్లగొండ జిల్లా దేవరకొండకు చెందిన సుజాత శేఖర్ తెలంగాణ బతుకమ్మ పాటలపై పరిశోధన చేసి పిహెచ్డి పట్టా పొందారు. ఉయ్యాలండి ఉయ్యాల... ఊహల పల్లకి ఉయ్యాల అంటూ పిల్లల కోసం పాటలు రాసిన కవయిత్రి. చిత్తూ చిత్తుల బొమ్మ... శివుడి ముద్దుల గుమ్మ అంటూ ఎన్నో బతుకమ్మ పాటలు వెలుగులోకి తెచ్చిన పరిశోధకురాలు డాక్టర్ బండారు సుజాతశేఖర్. పాఠ్య పుస్తక రచయిత్రిగా, ఓపెన్స్కూల్ దూరవిద్యా విధానం పాఠ్యపుస్తకాల్లో రచయిత్రిగా సమన్వయకర్తగా సేవలందించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి తెలంగాణ ప్రభుత్వం వరకు అందరి చేత ప్రశంసలు అందుకున్నారు. "తెలంగాణ బతుకమ్మ పాటలు పౌరాణిక, సామాజిక, సాంస్కృతిక భాషా పరిశీలన "ఆమె పరిశోధన గ్రంథం బతుకమ్మ పాటలపై తొలి పరిశోధన గ్రంథం. డాక్టర్ బండారు సుజాత శేఖర్ తెలంగాణ వైతాళికులు కే.సి గుప్తా, తేనె చినుకులు,

వ్యాసం

జొన్నకంకులు, వాసవి గేయమాల, నిదురించని నిజం, మునగాల కొండల రావు జీవిత చరిత్ర, మనసు పాడింది, సౌజన్య శిఖరాలు, కవితా పుష్పం, మొదలైన పుస్తకాలను ప్రచురించారు. రేడియోలో, పత్రికల్లో, టీవీ ఛానల్స్, వెబ్ పేపర్స్‌లో ఆమె పాటలు, కవితలు, ప్రసంగాలు ప్రచురించబడినాయి. పలు జాతీయ అంతర్జాతీయ సదస్సులలో పాల్గొని పత్రసమర్పణ చేశారు. నల్గొండ జిల్లాలో తొలి నానీల కవయిత్రి. ఆమె పాటలు సినిమాల్లో, యూట్యూబ్ లో వినవచ్చు.

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం "కీర్తి పురస్కారం", బీఎన్ సాహితీ పురస్కారం, భారత మహిళా శిరోమణి, కవిరత్న, మహిళ టాప్ టెన్ విశిష్ట మహిళ, ఉత్తమ ఉపాధ్యాయిని మొదలైన పురస్కారాలు అందుకున్నారు.

నాటి ముఖ్యమంత్రి మాజీ గవర్నర్ రోశయ్యగారితో, నేటి ముఖ్యమంత్రి కేసీఆర్‌గారితో ప్రశంసలు పొందారు. నాటి విద్యాశాఖ మంత్రి శ్రీ రంగారావుగారి నుండి నేటి వరకు విద్యాశాఖతో ఎన్నో సత్కారాలు పొందారు. తెలంగాణ ఉద్యమానికి తనదైన తోడ్పాటు అందించిన డాక్టర్ సుజాత శేఖర్ తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ జాగృతి వారి ఉద్యమ సాహితీవేత్తగా ప్రత్యేక సత్కారాలు పొందారు. ఇటీవల అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా జానపద సాహిత్య విభాగంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశిష్ట మహిళా పురస్కారం అందుకోవడం మన సంస్కృతికి దక్కిన గౌరవంగా ఆమె పేర్కొన్నారు.

కవిత



# గజ ఈతగాండ్లు!



కరిపె రాజ్ కుమార్, 81251 44729

దాంపత్య సుఖాన్ని
దానవులై గ్రోలుతారు!
కుటుంబ నియంత్రణ
శస్త్ర చికిత్స చేసుకోమంటే
క్రోసులదూరం పారిపోతారు!
అగ్గిమీద గుగ్గిలమై అబలలపై
అరివీరభయంకరంగా కలబడతారు!

గోరంత గాటుతో పోయేదానికి
గొడ్డలి వేటుగా మార్చాలని చూస్తారు!
వేసక్టమీ వద్దంటే! వద్దంటారు
ట్యూబెక్టమీయే ముద్దంటారు!!

ఇటుగిన్నె అటు సర్దనోళ్ళు!
ఆపరేషన్ చేసుకుంటే!
అసలు పనికి!
పనికిరాకుండా పోతామంటారు
నిత్యం భూగోళాన్ని
భుజాలపై భారంగా మోసే
ఆ అమ్మతల్లులకైతే
ఏమైనా కానిమ్మంటారు!

పంటిచివరన బిగబట్టి
దగ్ధ దావానలాన్ని భరించాలి!

కనురెప్పలకు మూతులుకట్టి
కన్నీటి ప్రవాహాలకు
కరకట్టలు నిర్మించాలి!

ఆమె శరీరమొక ప్రయోగశాల!
ఆమ్నియోసెంటెసిస్ పరీక్షలూ
అబార్షన్ వధశాలలూ!
అవసరమైనప్పుడల్లా కత్తెరతో
పరపరాకోసేసి
అందం చెడకుండా
సూదులతో కుట్లు వేసేయాలిమరి!

నంగనాచి పురుషత్వమేతప్ప
నరాల్లో పౌరుషంలేని
పశువులు!
పురిటినొప్పులు అనుభవించని
పుణ్య పురుషులు
పున్నామనరక ప్రవాహ
ఈ గజ ఈతగాండ్లు!!



# ఎక్కడుంది మానవత్వం...?

ముక్కపల్లి సాగర్, 98662 09436

స్వార్థపు సంకెళ్ళ మధ్య బందీ అయిన
బంధాలన్నీ బోరున బాధపడుతుంటే
మానవత్వం ఎక్కడుంది...?

ఒళ్ళంత విషము నింపుకొని చిరునవ్వులు
చిందిస్తూ నటనలో జీవిస్తుంటే
మానవత్వం ఎక్కడుంది...?

సాటి మనిషికి సహకరించని చేతులన్నీ
అంగవైకల్యమై దిక్కులు చూస్తుంటే
మానవత్వం ఎక్కడుంది...?

నేను నాది నాకే అని అన్నింట నా అనే భావనే
నిండి పరులను పట్టించుకోని ప్రపంచంలో
మానవత్వం ఎక్కడుంది...?

కుటుంబం కుటుంబం అనే కుంపటిలో
మనిషి కాలి బూడిదవుతుంటే
మానవత్వం ఎక్కడుంది...?

సంఘజీవి అయిన మనిషి సాటివారికి
సహకరించేందుకు సంకోచిస్తుంటే
మానవత్వం ఎక్కడుంది...?

కళ్ళెదుటె తల్లడిల్లుతున్న తనువుల చూసి చూసి
చూడనట్టు చూపులు తిప్పుకుంటుంటే
మానవత్వం ఎక్కడుంది...?

సాయమందించే చేతులు లేని సమాజంలో
ఎటు పయనించునో
మా"నవత్వం"...!

క
థ

# కందార్థ - గీతార్థ - సీసార్థముల వైశిష్ట్యం!

ప్రాచీన విశిష్టప్రక్రియా పరిచయం...



సుప్పని సత్యనారాయణ
94926 26910

ప్రస్తుత సాహిత్య వాతావరణంలో ఇది ఒక మూలన తలెత్తిన అనుమానం. నిజానికి ఈ ప్రక్రియ కొత్తదేమి కాదు. చాలా పురాతనమైనది. కానీ వర్తమాన కాలంలో కవిత్వం పలుపాయలుగా, భిన్న పార్శ్వాలు (హైకులు, నానీలు, మణి పూసలు, మినిపోయెట్రీ)గా వెలువడు తుండడం వల్ల ఈ గొప్ప ప్రక్రియ కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. విషయానికి వస్తే: కందార్థము! మొదటి నాలుగు పాదాలు యతిస్థానం వరకు కందపద్య నియమాలను అనుసరిస్తు, చివర (4 పాదం) యతి స్థానం నుండి ॥దర్వు॥ గా పిలువబడుతు, రాగం ద్వారా పాటగా ముందుకు సాగుతుంది. ॥దర్వు॥ నుండి గణాలతో నియమం లేకుండా పాదాంతం వరకు ॥ప్రాస॥ను అనుసరిస్తు సందేశాత్మకమైన ధోరణితో, చమత్కారమైన పదబంధాలతో "రాగానికి, తాళానికి" ఏమాత్రం భంగం కలగకుండా వాటికి అనుగుణంగా చివరకు నాలుగు పాదాలతో పూర్తవుతుంది.

కొందరు రచయితలు ॥దర్వు॥ను పూర్తిచేసి ముగిస్తే మరికొందరు దానికి ॥మిత్ర॥ (అంటే = మిత్రుడు, తోడు) జోడించి మరో నాలుగు పాదాల వరకు పొడిగించి, దానిని కూడా రాగ, తాళ, భావాలకు అనుగుణంగా ఆ పాదాలను పూర్తి చేయడమనేది జరుగుతుంది.

ముఖ్యంగా ఈ పద్ధతి పూర్వ భజన సంప్రదాయంలో భాగమైన "తత్వకీర్తనలు, అచలబోధ, గురుపూజ, గురుస్తుతి, ఆధ్యాత్మిక కీర్తనలు" పాడే సందర్భంలో లోకనీతులను, విజ్ఞాన సంబంధమైన విషయాలను, నైతిక, మానవీయ, ధర్మాధర్మ బోధనకు సంబంధించిన అనేక విషయాలను పాఠకలోకానికి రసానుభూతిని కలిగించే విధంగా ఈ కందార్థములు (ఇదే కోవలో: గీతార్థములు - సీసార్థములు కూడానూ) నాటి మహాకవులెందరో రచించి తెలియ జేయడం జరిగింది. ఇంకా చెప్పాలంటే ఈ ప్రక్రియ తెలంగాణ ప్రాంతంలో ఎక్కువగా కొనసాగిందని చెప్పవచ్చు. కందార్థములను, గీతార్థ, సీసార్థములను రచించినటువంటి కొందరు కవులను గమనిస్తే యక్షగాన కవులు: 1. శ్రీ చెర్విరాల భాగయ్య (శతాధిక యక్షగాన గ్రంథకర్త), 2. శ్రీ గడిగె భీమకవి (నాగరకుంట), 3. శ్రీ పనస హనుమద్దాసు, 4. శ్రీ రావురూకుల విఠలాఖ్యుడు, 5. శ్రీ పెద్దిరాం పోచన్న పంతులు (తిరుమలపురము), 6. శ్రీ అణ్ణాచార్యులు (మాసానిపల్లి), 7. శ్రీ రమణాఖ్యుడు, 8. శ్రీ గోశిక నరహరి (దురికి), మొదలగువారు.

## భజన, తత్వ కీర్తనలు రచించిన కవులు...

1. శ్రీ బసిరెడ్డి రాజిరెడ్డి (బోర్లం), 2 శ్రీ ఈగ బుచ్చదాసు (యాదగిరిగుట్ట), 3.శ్రీ రాకమచర్ల వేంకటదాసు, 4. శ్రీ పనస హనుమద్దాసు, 5. శ్రీ పెద్దిరాం పోచన్న పంతులు, 6. శ్రీ పీరు మొహిద్దిన్, 7. శ్రీ బోరల అప్పలస్వామి, 8. శ్రీ గుజ్జల నారాయణ, 9. శ్రీ కొంకణం సాధు, 10. శ్రీ గట్టయ్య దాసు, 11. శ్రీ ముదిగొండ శంకరాచార్యులు, 12. శ్రీ ఎలగందుల లింబాద్రి, 13. శ్రీ గోశిక నరహరి వంటి లబ్ధ ప్రతిష్ఠులైన రచయితలు ఈ "కంద, సీస, గీతార్థముల"ను రచించగా కొన్ని ముద్రితమై మరికొన్ని అముద్రితంగా ఉన్నాయి. నేటికి తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో భజన కార్యక్రమంలో ఈ కందార్థము లను పాడుతు ఉండడమనేది జరుగుతూ ఉన్నది. మా ప్రాంతం (కోనాపూర్, బాన్సువాడ)లో ఈ ప్రక్రియ ఇంకా సజీవంగా కొనసాగుతోంది. అందువలన పూర్వ పరంపర నుండి వస్తున్న ఈవిధానం మా నాన్న, పెదనాన్న వాళ్ళు కొనసాగించడం వలన నాకు కూడ కొంత అబ్బిందనే చెప్పాలి. అందుకే ఇంత అద్భుతమైన సాహిత్య ప్రక్రియ మరుగున పడకూడదనే సదుద్దేశంతో వాటిని మళ్ళీ తెరపైకి తీసుకువచ్చి సాహిత్యలోకానికి పరిచయం చేద్దామనే తలంపుతో నేను కూడా ఆ కందార్థములను రాయడానికి పూనుకోవడం జరిగింది.

కావున సాహితీ బంధువులందరికీ తెలియజెప్పాలనుకునే విషయం ఒక్కటే. అదేమిటంటే పూర్వపు కవిత్వ పద్ధతులలో భాగమై, నాడు అశేష జనాదరణకు నోచుకుని, ఇప్పటికి కొందరు రంగస్థల నటులు గాయకులు కంఠత: పాడగలిగే ఈ కందార్థములను విస్మరించకుండా, మన సమయానుకూలంగా ఈ విధానాన్ని కొనసాగిస్తు కందార్థములను రచించేం దుకు పూనుకొని, ఆ అపూర్వమైన వైభవమును మళ్ళీ నేటి తరానికి పరిచయం చేద్దామని కోరుతూ...

సెలవు.

కవిత

# ఆమె



మాదస్త ప్రణవి, 93478 10982

తన జీవన సాగుకై
నడకను ప్రారంభించిన నాగలికర్రు ఆమె
దుఃఖాన్ని దిగమింగడం
పెదవులపై నవ్వులు పూయించడం
ఆమెకు వెన్నతో పెట్టినవిద్య

ఆమె పలుకులతడి తగిలాక
అనుబంధాల మొలకలు
ఆయువు పోసుకోవలసిందే
ఆమె ఓలలాడించే తన ప్రేమపొత్తిళ్లలో
ఎవరైనా ఒదిగిపోవాల్సిందే

అలా కమనీయంగా తాను
కలలనాట్లు వేస్తుంటే
కట్టలు తెంచుకున్న స్వరగంగ
తన నోట ప్రవహిస్తుంది

ఇక తన ఇంటి మడిలో
అప్పుడప్పుడు మొలకెత్తే కలతల కలుపులు తీస్తూ
తన కాపురాన్ని పండిస్తుంది
కడగళ్ళ బరువులెత్తాలంటే
ఓర్పుచుట్ట తప్పనిసరి అంటుంది

కన్నెర్రజేసే కరువుకి
ఘాటుగా సమాధానం చెప్పే నాటుకొడవలై
ఆర్తనాదాలకు స్వస్తిపలుకుతుంది

ఈ మట్టిలో పుట్టిన పైరుబిడ్డకి
తానే తల్లినంటుంది
ఆకాశమంత ఎదిగి కూడా ఇంకా
అత్త చాటు కోడలునే అంటుంది
ఇగురం అంటే ఇదే కదా....!



కవిత



# ఆమె అంటే....



సుతారపు వెంకట నారాయణ, 98489 58690

గమనం
గ్రహింపు
గగన వీక్షణం
గమ్య నిర్దేశనం

సహనం
సమానత్వం
సహజత్వంలో
సరేసరి

భావనలు
భాష నిర్మాణం
భాగ్య రేఖల
భవిష్యత్ యోచనలు

శోధనలూ
సాధనలూ
సహజీవనంలో
సక్రమ లక్ష్యాలు

అవనిలో
ఆకాశంలో
అనుభవాల్లో
అన్నిటిలో ఆమె సగం

(మార్చ్ 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా...)

క
థ

## దశాబ్ది సాహిత్యంపైన కాంచనపల్లి ప్రసంగం



కాలిఫోర్నియా ఆరెంజ్ కౌంటి యునైటెడ్ స్టేట్స్: మార్చి 25 శనివారం ఈ దశాబ్ది సాహిత్యంపైన తంగేడు సాహిత్య పక్షపత్రిక సహసంపాదకుడు డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్ రాజు సుదీర్ఘ ప్రసంగం చేశారు. ఆయన తన ప్రసంగంలో కవిత, కథ, వ్యాసం ఈ దశాబ్ది కాలంలో ఎలా పరిణామం చెందుతున్నాయో వివరించారు. ఈ కార్యక్రమంలో సారంగ సంపాదకులు డా॥ అఫ్సర్ అధ్యక్షుడుగా, ప్రముఖ సాహితీవేత్త కొండపల్లి నీ హారిణి నిర్వాహకురాలిగా, ప్రముఖ సాహితీవేత్త వేణు నక్షత్రం సాంకేతిక సహాయకుడిగా వ్యవహరించారు. ఇంకా ఈ జూమ్ సభలో భారతదేశం సాహితీవేత్తలు రూప్‌కుమార్ సంపత్, నక్కహరికృష్ణ, కందాళై రాఘవాచార్య, కందుకూరి శ్రీరాములు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## సామరస్యంతోనే సమాజంలో ప్రశాంతత
## ముక్తకంఠంతో చాటిచెప్పిన ఉగాది కవి సమ్మేళనం



సమాజంలో సహజీవన సామరస్య విలువలు ప్రజల ప్రశాంతమైన జీవితానికి అద్దం పడతాయని తరతరాలకు వాటినందించడంలో కవులు రచయితల పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర సాంస్కృతిక, యువజన, క్రీడా, పర్యాటక శాఖామాత్యులు వి. శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మార్చి 22న రవీంద్రభారతి ప్రధాన సమావేశ మందిరంలో జరిగిన రాష్ట్రస్థాయి ఉగాది కవి సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, శాసనమండలి సభ్యులు గోరేటి వెంకన్న పాల్గొన్నారు తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు జూలూరు గౌరీ శంకర్ సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ పాల్గొన్న ఈ సమావేశంలో డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ ఆశారాజు కోట్ల వెంకటేశ్వర్ రెడ్డి నాళేశ్వరం శంకరం వడ్డేపల్లి కృష్ణ జూపాక సుభద్ర, వనపట్ల సుబ్బయ్య, ఘనపురం దేవేందర్, నరసింహ తదితరులు తెలంగాణ సహజీవన సామరస్య విలువలు అనే విషయంపై కవితాగానం చేశారు. ఈ సందర్భంగా కవులను కవయిత్రులను అతిథులు ఘనంగా సన్మానించారు.

## కవిత్వమే సమాజానికి వసంత హేతువు...



కవిత్వమే సమాజానికి వసంత హేతువు అని ప్రముఖ కవి సభాసామ్రాట్ విపి చందన్‌రావు అన్నారు. శ్రీ శోభకృత్ నామ ఉగాది వేడుకలు మరియు ప్రపంచ కవితాదినోత్సవం సందర్భంగా తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో మార్చి 21న నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కేర్ డిగ్రీ కళాశాలలో "వసంతాన్ని పిలుద్దాం రా" శీర్షికన కవి సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన విపి చందన్‌రావు మాట్లాడుతూ ఉగాది ఆగమనంతో చెట్లకు వచ్చిన పచ్చదనం మనిషి జీవితాల్లో ఆనందమై సంతృప్తియై రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా చేసిన తెలంగాణ భాషలో తొలి కవితా సంపుటి "ఇసిత్రం" రాసిన ప్రముఖ కవి పంచరెడ్డి లక్ష్మణ మాట్లాడుతూ కవిత్వము, వసంతం మనిషి జీవితంలో ఉచ్ఛ్వాస నిశ్వాసలుగా ఉన్నాయని, ఉండాలని ఆకాంక్షించారు. మహిళలకు కవిత్వం సాహిత్యం ఆధునిక ఆయుధాలుగా పరిణమించాయని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఘనపురం దేవేందర్ మాట్లాడుతూ కవిత్వం వ్యక్తిత్వం ఒకే విధంగా ఉన్న కలం యోధులు సమాజానికి చైతన్య దీపికలవుతారని అన్నారు.

## అరిశా సత్యనారాయణ-అరిశా ఆదిలక్ష్మి గార్ల స్మారక కథల పోటీ

ఆధునిక జీవితం సంక్లిష్టమైంది. సంక్షుభితభరితమైంది. అయినప్పటికీ మనుషులుగా మనమంతా ఒకచోట కలిసి బతకడం తప్పనిసరి. కనుక మన చుట్టుపక్కల ఉన్న వారిలో మానవీయ భావనలని పెంపొందించడం, ఉన్నత సంస్కారాన్ని అలవరచడం సాహిత్యరచనల కర్తవ్యం. దీనిని దృష్టిలో ఉంచుకొని అరిశా సత్యనారాయణ - అరిశా ఆదిలక్ష్మి గార్ల స్మారక కథల పోటీని నిర్వహించాలని సంకల్పించడమైంది. జీవితకాలమంతా సానుకూల భావనలతో, మంచి పక్షాన నిలిచిన ఈ ఇద్దరి జ్ఞాపకాల స్ఫూర్తి ఈ కథల పోటీకి ప్రేరణ. పాఠకులలో ఉదాత్త సంస్కారం పాదుకోడానికి తోడ్పడే కథారచనని ప్రోత్సహించాలన్నదే ఈ పోటీ ఉద్దేశం. ఈ పోటీలో పాల్గొనవలసిందిగా కథకులని ఆహ్వానిస్తున్నాం. **బహుమతులు** : మొదటి బహుమతిః రూ. 7000, రెండో బహుమతిః రూ. 5000, మూడో బహుమతిః రూ. 3000, అయిదు ప్రత్యేక బహుమతులు, ఒక్కొక్క కథకి రూ. 1000

మీ కథలు చేరడానికి చివరితేదీ - 30 ఏప్రిల్ 2023, పోటీ ఫలితాలను ప్రకటించే తేదీ 25 మే 2023, మీ కథలని పోస్టు చేయవచ్చు లేదా మెయిల్‌లోనూ పంపవచ్చు.

**నిబంధనలు, ఇతర వివరాలకు సంప్రదించండి :** ఎడిటర్, పాలపిట్ట, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500044, ఫోన్ : 9490099327, email: palapittamag@gmail.com

స్వీకారం




## ఆకాశంలో అల్లరి

డా॥ హారిక చెరుకుపల్లి
9005 59913

పొట్టి శ్రీరాములు
తెలుగు విశ్వవిద్యాలయం
వెల : రూ. 100/-




## కార్వేటి నగరం కథలు

ఆర్.సి. కృష్ణస్వామి రాజు
తిరుపతి
ఫోన్ : 93936 62821

వెల : రూ. 140/-




## అక్షర ధార

గన్నమరాజు గిరిజా మనోహరబాబు
9949103448

వెల : రూ. 200/-




## అక్షరధుని

గన్నమరాజు గిరిజా మనోహరబాబు
9949103448

వెల : రూ. 200/-




## ప్రాచీన తెలుగు కవయిత్రులు

కాత్యాయని విద్మహే

వెల : రూ. 100/-




## ఇది ఇట్లెందుకు?

డా॥ ధరణికోట రమేష్ కుమార్

ధరణి పబ్లికేషన్స్
ఖమ్మం
వెల : రూ. 250/-



## ఆకాశంలో ఒక నక్షత్రం

డా॥ ఎం. సుగుణరావు

పాలపిట్ట పబ్లికేషన్స్
హైదరాబాద్
వెల : రూ. 200/-




## కాలచక్రం

కన్నడం : నా.సు. భరతనహళ్ళి
తెలుగు అనువాదం : వేలూరి కృష్ణమూర్తి

పాలపిట్ట పబ్లికేషన్స్, హైదరాబాద్
వెల : రూ. 150/-




## ఉపకారి

బూర్ల వెంకటేశ్వర్లు
సెల్ : 94915 98040

వెల : రూ. 150/-



జానపద పితామహులు

## బిరుదు రాజు రామరాజు

జయంతి : 16-4-1923